ఆదివారం
23-2-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 153
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

స్పేస్ ఎక్స్ 23 స్టార్‌లింగ్ ఉపగ్రహాల ప్రయోగం సక్సెస్

లాస్ ఏంజిల్స్: అమెరికా ప్రైవేటు అంతరిక్ష కంపెనీ స్పేస్ ఎక్స్ 23 స్టార్‌లింగ్ ఉపగ్రహాలను కక్ష్యలోకి విజయవంతంగా చేర్చింది. ఫ్లోరిడాలోని కేప్ కనావెరల్ స్పేస్ ఫోర్స్ స్టేషన్ నుంచి ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపినట్లు స్పేస్ ఎక్స్ ప్రకటించింది. ఈ ప్రయోగం విజయవంతం అయినట్లు వెల్లడించింది. ఫాల్కన్ 9 రాకెట్‌కు సంబంధించి ఇది 450వ మిషన్ అని తెలిపింది.

కూలిన సొరంగం

8 మంది గల్లంతు

- ఎస్‌బీఎస్‌ఎల్ వద్ద ఘటన
- కార్మికుల రక్షణకు రంగంలోకి ఎన్‌డీఆర్‌ఎఫ్, సైన్యం
- ప్రమాద స్థలి వద్ద మంత్రులు ఉత్తమ్... జూపల్లి

విశాలాంధ్ర-హైదరాబాద్: ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద భారీ ప్రమాదం జరిగింది. సుదీర్ఘ విరామం తర్వాత పునః ప్రారంభమైన సొరంగం పనుల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. శనివారం ఉదయం ఎడమ వైపు సొరంగం 14వ కిలోమీటరు వద్ద పనులు జరుగుతుండగా టన్నెల్ పైకప్పు మూడు మీటర్ల మేర కూలింది. ఈ ఘటనలో 8 మంది కార్మికులు గల్లంతయ్యారు. 13 మంది గాయపడ్డారు. ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ఇటీవల ప్రభుత్వం పనులను తిరిగి ప్రారంభించింది. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం దోమల పెంట సమీపంలో సొరంగ మార్గం నిర్మిస్తున్నారు. ఆ పనుల్లో మొదటి షిఫ్ట్‌లో సుమారు 50 మంది కార్మికులు సొరంగంలోకి వెళ్లారు. ఉదయం 8.30 గంటల సమయంలో కార్మికులు పని చేస్తుండగా... ఆకస్మాత్తుగా పైకప్పు కూలి మట్టిపెళ్లలు విరిగిపడ్డాయి. సొరంగానికి అమర్చిన రింగు కూలడంతో ప్రమాదం జరిగిందని అధికారులు చెబుతున్నారు. పదిరోజుల క్రితమే ఈ సిగ్మెట్స్ రింగులు అమర్చినట్లు తెలుస్తోంది. అయితే ఇవి ఒక్కసారిగా ఊడిపడడం... నీటి లీకేజ్ ఎక్కువ కావడంతో మట్టి కిందపడింది. అమెరికాకు కంపెనీ రాబిన్‌కు చెందిన బోర్ మిషన్ మట్టిలో కూరుకుపోయింది. ఇదే సమయంలో సొరంగంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో కార్మికులు భయాందోళనకు గురయ్యారు. వారిలో 42 మంది బయటకు రాగా... 8 మంది కార్మికులు లోపల చిక్కుకున్నట్లు తెలుస్తోంది. గాయాలతో బయటపడిన కార్మికులను హుటాహుటిన జెన్‌కో ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలం వద్ద నీటిపారుదల శాఖ అధికారులు, పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. కార్మికులను రక్షించేందుకు ఎన్‌డీఆర్‌ఎఫ్, సైన్యం సహకారం తీసుకుంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే సొరంగం వద్దకు సింగరేణి సహాయక బృందాలు చేరుకున్నట్లు వివరించింది. కాగా, సొరంగంలో చిక్కుకున్న వారిలో మనోజ్ కుమార్ (పీఈ) ఉత్తర ప్రదేశ్, శ్రీనివాస్ (ఎఫ్‌ఈ) ఉత్తర ప్రదేశ్, కార్మికులు సందీప్ సాహు-జార్ఖండ్, జటాక్స్-జార్ఖండ్, సంతోష్ సాహు-జార్ఖండ్, అనూజ్ సాహు-జార్ఖండ్, సన్నీ సింగ్ (జమ్మూ కశ్మీర్), గురుప్రీత్ సింగ్-పంజాబ్ ఉన్నారు. ఇదిలాఉండగా, సొరంగం తవ్వకాలు మొదలు పెట్టిన ఏజెన్సీ నిర్వాహకులు మాట్లాడుతూ అకస్మాత్తుగా సొరంగంలోకి నీరు, మట్టి 8 కిలోమీటర్ల మేర రావడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని భావిస్తున్నామన్నారు. రోజువారీ మాదిరిగానే శనివారం పని మొదలు పెట్టామని, 30 నిమిషాలలోనే ఈ ప్రమాదం జరిగిందన్నారు. దీంతో పని

- మిగతా 2 లో

ప్రధాని ముఖ్య కార్యదర్శిగా శక్తికాంత దాస్

న్యూఢిల్లీ: ప్రధాని మోదీకి ముఖ్య కార్యదర్శి-2గా ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు శనివారం జారీ అయ్యాయి. ప్రధాని పదవీ కాలం లేదా తదుపరి ఆదేశాలిచ్చే వరకు దాస్ కొనసాగుతారని కేబినెట్ నియామకాల కమిటీ వెల్లడించింది. శక్తికాంత దాస్ 2018 డిసెంబరు నుంచి ఆరేళ్ల పాటు ఆర్బీఐ చీఫ్‌గా ఉన్నారు. ఆయనకు పరిపాలన రంగాల్లో నాలుగు దశాబ్దాల అనుభవం ఉంది. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల్లో కీలక పదవులు చేపట్టారు. ఆర్థిక,

- మిగతా 2 లో

ఏపీకి ముగ్గురు సీనియర్ ఐపీఎస్‌లు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : తెలంగాణలో పని చేస్తున్న ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులు అంజనీకుమార్, అభిలాష్ బిస్త్, అభిషేక్ మహంతి ఆంధ్రప్రదేశ్‌లో రిపోర్టు చేయాలని కేంద్ర హోంశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు అంజనీ కుమార్, అభిలాష్ బిస్త్‌ను శనివారం రిలీవ్ చేస్తున్నట్లు సీఎస్ శాంతికుమారి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కరీంనగర్‌లో పోలీస్ కమిషనర్‌గా పనిచేస్తున్న అభిషేక్ మహంతి

- మిగతా 2 లో

BBC NEWS INDIA

బీబీసీ ఇండియాకు ఈడీ భారీ జరిమానా

న్యూఢిల్లీ: బ్రిటిష్ బ్రాడ్ కాస్టింగ్ కంపెనీ (బీబీసీ) ఇండియాపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) చర్యలు తీసుకుంది. ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్(ఫెమా)ను ఉల్లంగించినట్లు పేర్కొంటూ బీబీసీ ఇండియాకు మొత్తం రూ.3.44 కోట్ల జరిమానా విధించింది. అప్పట్లో బాధ్యతల్లో ఉన్న ముగ్గురు డైరెక్టరకు రూ.1.14కోట్లు చొప్పున జరిమానా విధించింది. ట్రాన్స్‌ఫర్ ప్రైసింగ్ నిబంధనల ఉల్లంఘనలు, లాభాల మళ్లింపు క్రమంలో సంస్థకు చెందిన ముంబై, ఢిల్లీ కార్యాలయాల్లో ఐటీ

- మిగతా 2 లో

కులగణనతోనే బీసీలకు

సామాజిక న్యాయం

- ఆరోపణలు కాదు... తప్పు ఎక్కడో చెప్పండి
- ఉద్యోగాలు ఊడతాయనే సంజయ్, కిషన్‌రెడ్డి తప్పుడు ప్రచారం
- జనగణనలో కులగణన చేర్చాలని తీర్మానం: రేవంత్ రెడ్డి

విశాలాంధ్ర - హైదరాబాద్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అందరి భాగస్వామ్యంతో రాష్ట్రంలో కులగణన నిర్వహించామని, మా నాయకుడు రాహుల్‌గాంధీ ఇచ్చిన మాటను తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇలాంటి సాహసం చేయలేదని స్పష్టం చేశారు. ప్రజాభవన్‌లో శనివారం బీసీ నేతలతో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ హాజరయ్యారు. సీఎం మాట్లాడుతూ బీసీలకు కులగణన ఎక్స్ రే వంటిదని రాహుల్ గాంధీ ఆనాడే చెప్పారన్నారు. అన్ని రంగాల్లో బీసీలకు సామాజిక న్యాయం జరగాలంటే కులగణన చేయాల్సిందేనని స్పష్టం చేశారని గుర్తు చేశారు. అధికారంలోకి రాగానే కులగణన చేసి తీరుతామని భారత్ జోడో యాత్రలో మాట ఇచ్చారని దాని ప్రకారం కార్యాచరణ చేశామని రేవంత్ వివరించారు. గతంలో సమగ్ర కుటుంబ సర్వే తప్పుల తడకగా ఉందనే ఆనాటి ప్రభుత్వం లెక్కలను బయటపెట్టలేదన్నారు. మేం చిత్తశుద్ధితో కులగణనపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి, చట్టపరంగా ఇబ్బందులు కలగకుండా ప్రణాళికా విభాగానికి అప్పగించి కులగణను పకడ్బందీగా నిర్వహించామని చెప్పారు. ఇంటింటికి ఎన్యూమరేటర్లను పంపి సమాచారాన్ని సేకరించామని, తప్పులు దొర్లకుండా వారి సమక్షంలో కంప్యూటరీకరించామన్నారు. తప్పులు జరిగాయని మాట్లాడుతున్న వారు ఏ బ్లాక్‌లో ఎక్కడ తప్పు జరిగిందో చెప్పాలని నిలదీశారు. దేశంలో ఎవరూ ఇప్పటివరకు కులగణన చేపట్టలేదని, బీసీల లెక్క తెలిస్తే వాటా అడుగుతారనే దీనిపై బీజేపీలో ఉన్న ఒకటి రెండు ఆధిపత్య సామాజిక వర్గాలు కులగణనపై కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. కేసీఆర్ సర్వే ప్రకారం బీసీలు 51 శాతం

- మిగతా 2 లో

పేదల హక్కుల కోసం

ఎర్రజెండా పోరు

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

విశాలాంధ్ర- పినపాక: పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడేది ఎర్రజెండా నాయకులు, కార్యకర్తలేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మణుగూరు మండలం చిక్కుడు గుంటలో సీపీఐ శతవసంతోత్సవాల్లో భాగంగా మైసా కొండయ్య భవనంలో శనివారం అమరవీరుల స్మారక సంస్మరణ పైలాన్ ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కూనంనేని మాట్లాడుతూ, రాష్ట్రంలో పేద ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాటం కొనసాగించేది సీపీఐ అన్నారు. స్వాతంత్ర్యం రాకముందు నుంచే అంటరానితరం నిర్మూలించాలని, సమానత్వం రావాలని భూసంస్కరణలకోసం, దున్నేవానికి భూమి కావాలనే నినాదంతో కమ్యూనిస్టు పార్టీ అనేక పోరాటాలు, ప్రాణ త్యాగాలు చేసిందని గుర్తు చేశారు. లక్షలాది ఎకరాలను పేద ప్రజలకు పంచిన చరిత్ర ఆ పార్టీదే అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం కొనసాగించి ప్రజలకు విముక్తి కావించిందన్నారు. రైతాంగ సమస్యల పైన, కార్మిక హక్కుల కోసం నిరంతరం పరితపించే పార్టీ ఎర్రజెండాఅన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా పేద ప్రజల కోసం నిరంతరం పరితపించే పార్టీ అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి .అయోధ్య, జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాష మాట్లాడుతూ భూస్వాములను ఎదిరించి కమ్యూనిస్టులు అనేక పోరాటాలు చేశారన్నారు. మాజీ ఎంపీటీసీ కామిశెట్టి రామారావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రావుల మురళీ, దుగ్గిరాల సుధాకర్, సరెడ్డి పుల్లారెడ్డి పాల్గొన్నారు.

ఆదుకుంటాం

- మిర్చి రైతుకు భరోసా
- క్వింటా రూ.11,781 కంటే తగ్గితే కేంద్రం ద్వారా కొనుగోలు
- వ్యాపారులు, ఎగుమతిదారులతో సమీక్షలో చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మిరప రైతులను గట్టెక్కించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎగుమతి దారులు, వ్యాపారులు, కమిషన్ ఏజెంట్లు సహకరించాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో మిరప రైతులను ఆదుకోవాలన్నదే తన తాపత్రయం అని అన్నారు. సచివాలయంలో మిర్చి రైతులు, వ్యాపారులు, అధికారులు, ఎగుమతిదారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. దాదాపు రెండున్నర గంటలపాటు సాగిన ఈ సమీక్షలో రైతులు, వ్యాపారులు, ఎగుమతి దారుల నుంచి వారి సమస్యలు, అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. మిర్చి ధరలు తగ్గి రైతులు ఇబ్బందులు పడతున్నారన్నట్లు తెలిసిన వెంటనే

- మిగతా 2 లో

‘పోలీసు’ అవసరాలు తీరుస్తాం

- భద్రతలో అప్రమత్తత అవశ్యం
- సురక్షితంగా ఉన్నామన్న భరోసా పౌరుడిలో ఉండాలి
- హోంశాఖ ప్రీ బడ్జెట్ సమావేశంలో భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతి పౌరుడు సురక్షితంగా జీవిస్తున్నామన్న భరోసాతో ఉండాలని, ఆ మేరకు పోలీసుశాఖ అవసరాలు తీరుస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అంబేద్కర్ సచివాలయంలో శనివారం హోంశాఖ ప్రీ బడ్జెట్ సమావేశం జరిగింది. వివిధ అంశాలపై పోలీసు ఉన్నతాధికారులతో భట్టి చర్చించారు. తెలంగాణ రాష్ట్రం శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న మూడు నగరాలకు తోడు నాలుగవ నగరం ఫ్యూచర్ సిటీ సైతం సిద్ధం అవుతుందని, రీజినల్ రింగ్ రోడ్డు పనులు వేగవంతం అవుతున్నాయని వివరించారు. ఆర్థిక వనరులు, ఉపాధి అవకాశాల నేపథ్యంలో పెద్ద ఎత్తున

- మిగతా 2 లో

రేపటి నుంచి అసెంబ్లీ

- తొలిరోజు గవర్నర్ ప్రసంగం
- జగన్ సహా వైసీపీ ఎమ్మెల్యేల హాజరు
- భద్రతా ఏర్పాట్లు మరింత కట్టుదిట్టం

ఈనెల 24వ తేదీ నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు. అనంతరం సభ వాయిదా పడుతుంది. ఈనెల 28వ తేదీన 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశముంది.

8లో

ఇదీ లోకం!

ప్రాజెక్టుల సాధనకు

మరో ఉద్యమం

- నీటి వివాదాలకు శాశ్వత పరిష్కారం
- ప్రతి గ్రామానికి సాగు, తాగునీరు
- కరువు జిల్లాలను సస్యశ్యామలం చేయాలి
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, నిపుణుల డిమాండ్

విశాలాంధ్ర-కడప బ్యూరో: రాష్ట్రంలో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాలు కరువు, వలసలు, ఆత్మహత్యలకు నిలయంగా మారాయని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ప్రాజెక్టుల నిపుణులు అన్నారు. కరువు నుంచి విముక్తి కోసం పెండింగ్ ప్రాజెక్టులు, పంటకాలువలు, నీటి వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. నికర జలాల కేటాయింపుతో ప్రతి ఎకరాకు సాగునీరు, ప్రతి గ్రామానికి తాగునీరు అందే దిశగా ప్రభుత్వం తక్షణం స్పందించాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య అధ్వర్యంలో ప్రాజెక్టుల ప్రాంతీయ మహాసభ స్థానిక హరిత హోటల్‌లో శనివారం జరిగింది. వివిధ రంగాలకు చెందిన నిష్ణాతులు ప్రాజెక్టులపై ప్రసంగించారు. లక్ష్మీనారాయణ, తులసిరెడ్డి, దశరథరామిరెడ్డి, రామాంజనేయులు, రామచంద్రయ్య, రావుల వెంకయ్య, ప్రసాద్ తదితరులు ప్రాజెక్టుల తీరు తెన్నులు, నిర్మాణాలకు తీసుకోవాల్సిన విధులు, నిధులపై సమగ్రంగా చర్చించారు. ప్రభుత్వాలు మారుతున్నా ప్రాజెక్టులు అసంపూర్తిగా ఉండడంతో రైతులు ఇతర రాష్ట్రాలకు వలస పోయే పరిస్థితి దశాబ్దాలుగా కొనసాగుతోందని, దీన్ని అంతమొందించడానికి మరో ఉద్యమం చేయకతప్పదని వారు హెచ్చరించారు.

నీటిపారుదల ప్రాజెక్టుల నిపుణులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ప్రాజెక్టుల పరిపూర్తి కోసం సమరశీల పోరాటానికి 1970, 80 దశకంలోనే ఉద్యమాలు ప్రారంభించినట్లు చెప్పారు. కృష్ణానది జలాల సాధనకు, పెండింగ్ ప్రాజెక్టుల కోసం వివిధ రూపాలలో విద్యార్థి దశ నుంచే ఉద్యమాలు చేసినట్టు వెల్లడించారు. రాయలసీమ వేదికగా కృష్ణా జలాల సాధన కోసం 1998 నుంచి నేటి వరకు పాదయాత్రలు చేయడమే కాకుండా వ్యయప్రయాసలకు, ప్రభుత్వ వ్యతిరేకతకు గురైనా పోరాటాలతో రాయలసీమ ప్రాజెక్టుల సాధనకు

- మిగతా 2 లో

అభ్యుదయ సాహిత్య అంతర్జాతీయ నేపథ్యం

ఇరవయ్యవ శతాబ్దం రెండో దశాబ్దమే సంక్షుభితంగా మొదలైంది. 1914 జులై 28న మొదలై 1918 నవంబర్ 11న ముగిసిన మొదటి ప్రపంచ యుద్ధం తీవ్ర ఆర్థిక సంక్షోభాలకూ, సాంస్కృతిక సంక్షోభ ప్రమాదాలకూ సంకేతమైంది. సాంస్కృతిక రంగంలో తలెత్తుతున్న సంక్షోభాన్ని రచయితులు, కళాకారులు పసిగట్టారు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

శాంతి చర్చల్లో జెలెన్‌స్కీ ముఖ్యం కాదు: ట్రంప్

వాషింగ్టన్: ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ శాంతి చర్చల్లో పాల్గొనడం ఏమంత ముఖ్యం కాదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. యుద్ధం విషయంలో జెలెన్‌స్కీ వైఖరిని తప్పుపట్టారు. 'ఈ వ్యక్తిని నేను చాలా ఏళ్లుగా గమనిస్తున్నా. తన దేశంలోని నగరాలు ధ్వంసమవుతూ, పౌరులు, సైనికులు చనిపోతూ, బలం-బలగం తగ్గుతున్నా జెలెన్‌స్కీ మొండిగా ఉన్నారు. చర్చలకు ముందుకు రావడంలేదు. మూడేళ్లలో ఎలాంటి పురోగతి సాధించలేదు. ఒప్పందాలు చేసుకోవడాన్ని చాలా క్లిష్టంగా మారుస్తారు. దేశం ధ్వంసం అవుతున్నా ఆయన తన పద్ధతి మార్చుకోలేదు' అని ఓ ఇంటర్వ్యూలో జెలెన్‌స్కీపై ట్రంప్ తనదైన శైలిలో విమర్శలు గుప్పించారు. మరోవైపు ఓవల్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడిన ట్రంప్.... మాస్కో కీవ్ మధ్య యుద్ధం ముగియాలంటే జెలెన్‌స్కీ-పుతిన్ కలవాలని నొక్కిచెప్పారు. రష్యా-ఉక్రెయిన్ అధ్యక్షుల మధ్య రాజీ కుదిరితేనే శాంతి నెలకొనగలదని చెప్పారు. యుద్ధం-లక్షల మంది ప్రాణ నష్టం ఆగడమే మనం కోరేదని ట్రంప్ అన్నారు. ఇదిలావుంటే, ఉక్రెయిన్‌లోని ఖనిజ నిల్వలను వినియోగించుకునేలా వాషింగ్టన్‌తో ఒప్పందంపై కీవ్ త్వరలోనే సంతకాలు చేస్తుందని ఆకాంక్షించారు. 'వాళ్ల శౌర్యులు... ఏ రకంగా చూసిన ధైర్యవంతులే. మేము మాకు చాలా దూరంగా ఉన్న ఓ దేశంపై భారీగా ఖర్చు చేస్తున్నాం. అందుకు ప్రతిఫలం ఆశించడంలో తప్పులేదు' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. కాగా, తమ వనరులను అమెరికా హస్తగతం చేసేందుకు జెలెన్‌స్కీ నిరాకరించారు. ఒప్పందం కుదరదని స్పష్టంగా చెప్పారు.

ఉక్రెయిన్‌కు 350 టన్నుల టీఎన్‌టీ రవాణా

అడ్డుకున్న గ్రీస్ కమ్యూనిస్టులు

బెర్లిన్: యుద్ధం ఆగాలని, శాంతి నెలకొనాలని గ్రీస్ కమ్యూనిస్టులు- కార్మిక సంఘాలు ఉద్ఘాటించాయి. ఉక్రెయిన్‌కు పంపే పేలుడు సామాగ్రిని నిలువరించాయి. మొత్తం 350 టన్నుల టీఎన్‌టీ పేలుడు పదార్థాలను ఉక్రెయిన్‌కు రవాణా చేయకుండా గ్రీస్‌లోని తూర్పు అట్టికాలో లావ్రియో నగరంలోగల లేబర్ సెంటర్ (కార్మిక సంఘాల అధ్వర్యంలో) అడ్డుకుంది. ఉక్రెయిన్‌లో యుద్ధానికి గ్రీస్ ప్రభుత్వం మద్దతు ఇవ్వడాన్ని గ్రీస్ కమ్యూనిస్టులు, కార్మిక సంఘాల ప్రతినిధులు ఆక్షేపించారు. జెలెన్‌స్కీ ప్రభుత్వానికి సహకరించేలా 155 ఎంఎం ఆర్టిలరీ షెల్స్ ఉత్పత్తి చేసేందుకు హెల్లెనిక్ డిఫెన్స్ సిస్టమ్స్ ఫ్యాక్టరీకి 350 టన్నుల పేలుడు పదార్థాలను గ్రీస్ పంపుతోందని పేర్కొన్నారు. ఈ రవాణాను అడ్డుకున్నట్లు ప్రకటించారు. అయితే గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ, కార్మిక సంఘాల నిర్ణయాత్మక జోక్యంతో బూర్జువా ప్రభుత్వాలకు ప్రజల శ్రేయస్సు పట్టదని స్పష్టమైందన్న వాదనకు మరింత బలం చేకూరింది.

తెలంగాణలో కొలువుల జాతర

విశాలాంధ్ర-హైదరాబాద్: రాష్ట్రంలోని మహిళా శిశు సంక్షేమ శాఖలో కొలువుల జాతర మొదలైంది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల ఖాళీల భర్తీకి ప్రభుత్వం నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చేసింది. ఖాళీల భర్తీకి సంబంధించిన ఫైల్‌పై మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క సంతకం చేశారు. మొత్తం 6,399 అంగన్వాడీ టీచర్లు, 7,837 హెల్పర్ల పోస్టుల భర్తీకి రంగం సిద్ధమైంది. ఎన్నికల కోడ్ ముగియగానే నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టుల భర్తీకి సంబంధించి ఆయా జిల్లాల కలెక్టర్లు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. మొత్తం 14,236 పోస్టులను తెలంగాణ ప్రభుత్వం భర్తీ చేయనుంది. తెలంగాణలో ఈ స్థాయిలో అంగన్వాడీ టీచర్లు, హెల్పర్ల కొలువులు భర్తీ చేయడం ఇదే తొలిసారి. ఖాళీల భర్తీ ప్రకియతో అంగన్వాడీలు మరింత పటిష్టంగా పనిచేయనున్నారు.

ప్రధాని ముఖ్య కార్యదర్శిగా శక్తికాంత దాస్

(మొదటిపేజీ తరువాయి)

పారిశ్రామిక, మౌలిక వసతులు తదితర శాఖల్లో పనిచేశారు.

నీతి ఆయోగ్ సీఈవో పదవీ కాలం పొడిగింపు

నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం పదవీ కాలాన్ని పొడిగిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఫిబ్రవరి 24 నుంచి మరో ఏడాది పాటు ఆయన పదవిలో కొనసాగుతారు. 1987 బ్యాచ్‌కు చెందిన మాజీ ఐఏఎస్ సుబ్రహ్మణ్యం 2023, ఫిబ్రవరిలో నీతి ఆయోగ్ సీఈవోగా నియమితులయ్యారు. ఆయన పదవీ కాలం రెండేళ్లు కాగా మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది.

బీబీసీ ఇండియాకు ఈడీ భారీ జరిమానా

(మొదటిపేజీ తరువాయి)

అధికారులు 2023, ఏప్రిల్‌లో సోదాలు నిర్వహించి కేసు నమోదు చేశారు. ఇది జరిగిన రెండు నెలలకు ఈడీ దర్యాప్తు మొదలు పెట్టింది. ఈ నేపథ్యంలో రోజుకు రూ.5వేల జరిమానా చెల్లించాలని ఆదేశించింది. ఈ ఉత్తర్వులు 2021, అక్టోబరు 15 నుంచి సమ్మతి లభించే వరకు వర్తిస్తాయని బీబీసీ ఇండియాకి ఈడీ స్పష్టం చేసింది. 'ఇండియా: ది మోదీ క్వశ్చన్' పేరుతో 2002 గుజరాత్ అల్లర్లలో మోదీ పాత్రపై 2023, జనవరి 17న డాక్యుమెంటరీ విడుదల చేసిన బీబీసీపై ఐటీ దాడులు, ఈడీ చర్యలు వివాదాస్పద మయ్యాయి. దేశ సమగ్రతకు, సార్వభౌమత్వానికి విఘాతం కలిగించే ఈ డాక్యుమెంటరీ లింకులన్నీ తొలగించాలని యూట్యూబ్, ట్విట్టర్‌కు జనవరి 20న కేంద్రం ఆదేశాలిచ్చింది. ఈ క్రమంలో దాదాపు ఏడాది పాటు భారత అధికారుల నిఘాలో ఉన్న బ్రాడ్‌కాస్టర్... 2024, ఏప్రిల్‌లో తమ న్యూస్ రూమ్ పబ్లిషింగ్ లైసెన్స్‌ను 'కలెక్టివ్ న్యూస్‌రూమ్' అనే ఓ ప్రైవేటు కంపెనీకి అప్పగించే నిర్ణయించింది. పూర్వ ఉద్యోగులు ఈ సంస్థను నిర్వహిస్తున్నారు.

ఏపీకి ముగ్గురు సీనియర్ ఐపీఎస్‌లు

(మొదటిపేజీ తరువాయి)

రిలీవ్‌పై ఎన్నికల కమిషన్‌కు ప్రభుత్వం లేఖ రాసింది. ఈనెల 27న ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నందున మహంతి విషయంలో నిర్ణయం తీసుకోవాలని ఈసీని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి సీఎస్ లేఖ రాశారు. 1990 బ్యాచ్‌కు చెందిన అంజనీకుమార్ రహదారి భద్రత అథారిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తుండగా, 1994 బ్యాచ్‌కు చెందిన అభిలాష్ బిస్త్ తెలంగాణ పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా ఉన్నారు. 2011 బ్యాచ్‌కు చెందిన అభిషేక్ మహంతి కరీంనగర్ పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. 2014లో ఉమ్మడి రాష్ట్ర విభజన అనంతరం డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ)... రెండు రాష్ట్రాలకు అఖిల భారత సర్వీసు అధికారులను కేటాయించింది. దీనిపై కొందరు అధికారులు క్యాట్‌ను ఆశ్రయించడం...తర్వాత డీవోపీటీపై హైకోర్టులో పిటిషన్ వేయడం వంటి పరిణామాలు జరిగాయి. చివరకు 2024లో నియమించిన ఖండేకర్ కమిటీ సిఫార్సుల మేరకు తాజాగా ముగ్గురు ఐపీఎస్‌లను ఏపీలో రిపోర్ట్ చేయాలని హోంశాఖ ఆదేశించింది.

విదేశీ జోక్యాన్ని సహించం: మెక్సికో

మెక్సికో సిటీ: విదేశీయులు తమ నుంచి అనుమతులు తీసుకోకుండా భద్రతాపరమైన కార్యకలాపాలను చేపడితే కఠినంగా వ్యవహరిస్తామని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షెయిన్‌బమ్ స్పష్టంచేశారు. భారీగా జరిమానాల విధించడమే కాకుండా వెంటనే నిర్బంధిస్తామని హెచ్చరించారు. క్లాడియా విలేకరుల సమావేశంలో ఈ మేరకు ప్రకటించారు. 'జాతీయ భద్రతా చట్టం, సమన్వయ కార్యక్రమాలను అక్రమంగా చేపడితే ఊరుకోం. మేము మెక్సికోను కాపాడుకుంటున్నాం' అని ఆమె అన్నారు. మెక్సికో డ్రగ్స్ ముఠాలను ఉగ్ర సంస్థలుగా అమెరికా ముద్ర వేయడాన్ని ప్రస్తావిస్తూ... దీనిని అదనుగా చేసుకొని మెక్సికో వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటామంటే కుదరదని క్లాడియా తేల్చిచెప్పారు. కాగా, దేశ భద్రత, సార్వభౌమత్వాన్ని బలపర్చుకోవడం కోసం రాజ్యాంగబద్ధ రెండు సంస్కరణలను క్లాడియా ఇటీవల ప్రతిపాదించారు. రాజ్యాంగంలోని 19, 40 అధికరణలకు ప్రతిపాదించిన సవరణలను కాంగ్రెస్ ఆమోదించాల్సి ఉంది.

ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా కాష్ పటేల్ ప్రమాణం

వాషింగ్టన్: ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (ఎఫ్‌బీఐ) డైరెక్టర్‌గా కాష్ పటేల్(44) ప్రమాణ స్వీకారం చేశారు. భగవత్ గీతపై ప్రమాణం చేసి నూతన బాధ్యతలు స్వీకరించారు. పటేల్‌ను ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా నియమించేందుకు సెనేట్ ఆమోదించింది. సభలో 51కుగాను 49 మంది ఆయనకు మద్దతిచ్చారు. ప్రమాణ స్వీకారోత్సవానికి పటేల్ కుటుంబం హాజరైంది. అమెరికా అటార్నీ జనరల్ పాంబోండీ అధ్వర్యంలో శ్వేతసౌధం ప్రాంగణంలోని ఐసెన్‌హోవర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీస్ బిల్డింగ్ (ఈఈఓబీ)లోని ఇండియన్ ట్రీటీ రూమ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. 'నేను నా అమెరికా కలను జీవిస్తున్నా. అమెరికన్ కలలు సాకారం కావని ఎవరైనా అనుకుంటే...నన్ను చూడండి. గొప్ప దేశ లా ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు నాయకత్వం వహించబోతున్న భారతీయుడితో మీరు మాట్లాడుతున్నారు. ఇలా మరెక్కడా జరగదు' అని పటేల్ అన్నారు. పటేల్ న్యూయార్క్‌లో పుట్టి పెరిగారు. ఆయన మూలాలు భారత్‌లోని గుజరాత్‌లో ఉన్నాయి. కాగా, కాష్ పటేల్ తల్లిదండ్రులు తూర్పు ఆఫ్రికాకు చెందిన వారు. తల్లి తాంజానియా... తండ్రి ఉగాండాకు చెందిన వారు. ఈ కుటుంబం 1970లో కెనడా నుంచి వచ్చి న్యూయార్క్- క్వీన్స్‌లో స్థిరపడింది.

కూలిన సొరంగం

(మొదటిపేజీ తరువాయి)

నిలిపివేసి బయటకు రావడంతో పాటు వీలున్నంత వరకు సిబ్బందిని బయటకు తీసుకువచ్చామని తెలిపారు.

సహాయ చర్యలు పర్యవేక్షిస్తున్న మంత్రులు

ప్రమాదం విషయం తెలుసుకున్న రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. సంఘటనా స్థలిని పరిశీలించడంతో పాటు లోపల చిక్కుకున్న వారిని కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు దోమలపెంటలోని జేపీ అతిథి గృహంలో సహచర మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి తెలంగాణ అగ్నిమాపక, సహాయక బృందం డీజీ.నారాయణ రావు, ఐజీ సత్యనారాయణ, నాగర్ కర్నూల్ కలెక్టర్‌తో పాటు రాబిన్ సంస్థకు చెందిన లెన్ మైనార్డ్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సొరంగంలో చిక్కుకున్న మిగిలిన 8 మందిని సురక్షితంగా కాపాడటం కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్వశక్తులూ ఒడ్డి పని చేస్తోందని చెప్పారు. ఇప్పటికే సింగరేణికి చెందిన సహాయక బృందాలు రంగంలోకి దిగాయని, సైన్యానికి చెందిన సహాయక బృందాలతో తనతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడామని, శనివారం రాత్రికి ఆ బృందం ఇక్కడకు చేరుకుంటుందని ఆయన వెల్లడించారు. అంతేకాకుండా సొరంగం వద్ద ప్రమాదాలు సంభవించినప్పుడు రంగంలోకి దిగి కాపాడే బృందాలతో కూడా మాట్లాడామన్నారు. ఇటీవల కాలంలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఈ తరహా సంఘటన చోటుచేసుకున్నప్పుడు రంగంలోకి దిగి ప్రాణాపాయం లేకుండా కాపాడిన బృందాన్ని కూడా రంగంలోకి దింపనున్నట్లు వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ఉన్నత స్థాయి ప్రభుత్వ యంత్రాంగం ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు ఎప్పటికప్పుడు సమాలోచనలు చేస్తూ సమష్టి నిర్ణయం తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. అగ్నిమాపక సహాయక బృందం, పోలీసు బృందాలు సహాయ సహకారాలు అందిస్తున్నాయని, వైద్య బృందం అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచిందన్నారు. నీటిపారుదల శాఖాధికారులు పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సొరంగంలో చిక్కుకున్న వారిని కాపాడేందుకు చర్యలను పర్యవేక్షిస్తున్నారని అన్నారు. అయితే సొరంగంలో వెంటిలేషన్‌కు ఇబ్బంది లేదన్నారు. సొరంగం తవ్వకంలో రాబిన్ సంస్థ ప్రపంచ స్థాయిలో పేరెన్నికగన్నదని తెలిపారు. లోపల చిక్కుకున్న ఆ 8 మందిని సురక్షితంగా కాపాడడమే ప్రభుత్వం ముందున్న సవాల్ అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రమాదంలో చిక్కుకున్న ఆ ఎనిమిది మందిలో ప్రాజెక్టు ఇంజినీర్, సైట్ ఇంజినీర్‌తో పాటు ఇద్దరు మిషన్ ఆపరేటర్లు, నలుగురు కార్మికులు ఉన్నారని వివరించారు. ఏదైతే సొరంగం బోర్ మిషన్ వద్ద పని మొదలు పెట్టారో అక్కడికి నీరు, మట్టి చేరుతుండటంతో పాటు ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో మిషన్ మీద ఉన్న వారు, వెనుక భాగంలో ఉన్న వారు బయటకు రాగలిగారని చెప్పారు. అయితే మిషన్ ముందు భాగంలో ఉన్న వారు అందులో చిక్కుకున్నారని మంత్రి వెల్లడించారు.

సీఎం రేవంత్... మంత్రి కోమటి రెడ్డి దిగ్భ్రాంతి

ఎస్ఎల్‌బీసీ సొరంగం వద్ద జరిగిన ప్రమాదంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సొరంగం పైకప్పు కూలి అనేక మంది గాయాలైన సమాచారం అందిన వెంటనే ముఖ్యమంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, అగ్నిమాపక శాఖ, హైడ్రా, ఇరిగేషన్ విభాగం అధికారులు వెంటనే అక్కడికి చేరుకొని సహాయక చర్యలు అందించాలని సీఎం ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇరిగేషన్ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఇరిగేషన్ అధికారులు ప్రత్యేక హెలికాప్టర్‌లో ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం స్కీంలో భాగంగా శ్రీశైలం నుంచి దేవరకొండ వైపు వెళ్లే సొరంగం 14 కిలోమీటరు ఇన్లేట్ వద్ద (దోమలపెంట దగ్గర) సి పేజ్ ను పూడ్చివేసిన కాంక్రీట్ సెగ్మెంట్ స్లిప్ అవడం వల్ల ప్రమాదం జరిగిందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

సహాయక చర్యలకు సిద్ధమైన సైనిక టాస్క్‌ఫోర్స్

సొరంగం పైకప్పు కూలిన ఘటనలో 8 మందిని రక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యలు వేగవంతం చేసింది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు చేపట్టిన సహాయక ఆపరేషన్‌లో సాయం చేసేందుకు సైన్యానికి చెందిన 'ఇంజినీర్ టాస్క్‌ఫోర్స్ (ఈటీఎఫ్)' రంగంలోకి దిగనుంది. నిపుణులైన ఇంజినీర్లతో కూడిన బృందం, వైద్య సామగ్రి, అవసరమైన సహాయ పరికరాలతో సిద్ధమైంది. ఈ మేరకు స్థానిక యంత్రాంగంతో ఈటీఎఫ్ కమాండర్ సమన్వయం చేసుకుంటున్నట్లు సైన్యం ఓ ప్రకటనలో తెలిపింది. అదనంగా ఒక సహాయక బృందం సహాయక యంత్రాలతో సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించింది. సైనిక ఉన్నతాధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ... సీఎం రేవంత్‌రెడ్డికి ఫోన్ చేసి ఎస్ఎల్ బీసీ ప్రమాద ఘటనపై ఆరా తీశారు. సహాయక చర్యలకు కేంద్రం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

కులగణనతోనే బీసీలకు సామాజిక న్యాయం

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే... కానీ తాము నిర్వహించిన కులగణన ప్రకారం 56.33 శాతంగా ఉందని, బీసీల లెక్క తగ్గిందో పెరిగిందో మీరే చెప్పండి అని అన్నారు. గుజరాత్ లో ముస్లింలు ఓబీసీ కేటగిరీలో ప్రయోజనం పొందుతున్నారని, తాను ఎప్పుడూ మీడియాలో చెప్పుకోలేదని మోదీ 2023 లో ఓ ఇంటర్వ్యూలో చెప్పారన్నారు. కానీ బండి సంజయ్... బీసీలలో ముస్లింలను కలిపారని చెబుతున్నాడని, ఏ ఇంట్లో తప్పు జరిగిందో నిరూపించాలని సవాల్ విసిరారు. మోదీ రాజకీయంగా వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందనే ఈ ప్రక్రియను తప్పుబడుతున్నారని, కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఉద్యోగాలు పోతాయనే దీనిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దీన్ని తిప్పి కొట్టాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందన్నారు. జనగణనలో కులగణన చేర్చాలని తీర్మానం చేస్తున్నామన్నారు. సామాజికవర్గాలవారీగా సమావేశాలు నిర్వహించి మార్చి 10 లోగా తీర్మానాలు చేయాలన్నారు.

దేశంలో మొదటిసారి బీసీల లెక్కతేల్చాం: భట్టి

కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం జరుగుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన బీసీ జన గణనను ఏ సర్వే తోనూ పోల్చలేరన్నారు. 2011లో జరిగిన జనగణన లో కేవలం ఎస్సీ, ఎస్టీ, ఇతర జనాభా లెక్కలే తేల్చారని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే అధికారికం కాదన్నారు. దానిని క్యాబినెట్లో పెట్టలేదు, శాసనసభలో చర్చకు రాలేదు కాబట్టి అది చెల్లుబాటు కాదన్నారు. దేశంలో మొదటిసారి బీసీ జనాభాను అధికారికంగా లెక్క తేల్చి ముద్ర వేశామని స్పష్టం చేశారు. ఇది బీఆర్ఎస్‌కు నష్టం కాబట్టే సర్వే తప్పు అంటూ తప్పుడు ప్రచారం చేసి బీసీలకు ప్రయోజనం దక్కకుండా ఆ పార్టీ రాజకీయం చేస్తుందని దుయ్యబట్టారు. తెలంగాణలో విజయవంతం అయితే దేశవ్యాప్తంగా చేయాల్సి వస్తుందని, బీజేపీ నేతలు సర్వేపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. సర్వేపై ఎవరు ఏ ప్రశ్న అడిగినా అధికారికంగా సమాధానం ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అన్ని ఆధారాలు అధికారికంగా నిక్షిప్తం చేశామని, ఎనిమిది కోట్ల పేజీలకు పైబడిన సమాచారం సర్వే ద్వారా సేకరించామన్నారు.

'పోలీసు' అవసరాలు తీరుస్తాం

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణకు వలస వచ్చేవారం సంఖ్య పెరుగుతుందని, భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు.

సరిహద్దుల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. సైబర్ క్రైమ్ కేసుల పరిష్కారంలో దేశంలోనే తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నారు. పోలీస్ క్వార్టర్స్ నిర్మించాల్సిన అవసరం ఉందని, ఎక్కడెక్కడ నిర్మాణానికి అవకాశం ఉందో ప్రతిపాదనలు పంపాలని ఉన్నతాధికారులను కోరారు. పోలీస్ శాఖ బలోపేతానికి సీఎస్ఆర్ నిధులు వినియోగించుకోవాలని సూచించారు. భర్తీ చేసిన ఉద్యోగాలు, ప్రస్తుతం ఖాళీల వివరాలపై సమీక్షించారు. గ్రేహౌండ్స్, నార్కోటిక్స్, ఇంటిలిజెన్స్, ఫైర్, ఎక్స్ సర్వీస్ మెన్ తదితర ఎనిమిది విభాగాల ఉన్నతాధికారులు తమ బడ్జెట్ అవసరాలపై నివేదిక సమర్పించారు. డీజీపీ జితేంద్ర, స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రవి గుప్తా, డీజీ అభిలాశ్ బిస్త్, గ్రేహౌండ్స్, ఆక్టోపస్ అడిషనల్ డీజీ స్టీఫెన్ రవీంద్ర, హైదరాబాద్ సిటీ కమిషనర్ సి.వి. ఆనంద్, రాచకొండ సీపీ సుధీర్ బాబు, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి పాల్గొన్నారు.

మహా శివరాత్రికి 3 వేల ప్రత్యేక బస్సులు

టికెట్ ధరల్లో 50 శాతం సవరణ

మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం

24 నుంచి 28 వరకు 43 శైవక్షేత్రాలకు...

విశాలాంధ్ర- హైదరాబాద్ : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు అసౌకర్యం కలగకుండా టీజీఎస్‌ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 26న మహాశివరాత్రిని పురస్కరించుకుని రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు మూడువేల ప్రత్యేక బస్సులు నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. 24 నుంచి 28 వరకు ప్రత్యేక బస్సులను సంస్థ నడపనుంది. శ్రీశైలానికి 800, వేములవాడకు 714, ఏడుపాయలకు 444, కీసరగుట్టకు 270, వేలాలకు 171, కాళేశ్వరానికి 80, కొమురవెల్లికి 51 బస్సులతో పాటు అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప తదితర ఆలయాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్‌ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, కుర్చీలు, తాగునీరుతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది. ప్రభుత్వ జీవో ప్రకారం ప్రత్యేక బస్సుల్లో 50 శాతం వరకు టికెట్ ధరలను సవరించింది. రెగ్యులర్ సర్వీస్‌ల టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ చార్జీలు అమల్లో ఉంటాయి. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 26 నుంచి 28వ తేది వరకు సవరణ చార్జీలు వర్తిస్తాయి. సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేస్తుంది. ఈ మేరకు సంస్థ ఉన్నతాధికారులతో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి అధికారులతో యాజమాన్యం సమీక్ష నిర్వహించింది. గత శివరాత్రి కన్నా ఈసారి 809 బస్సులను అదనంగా సంస్థ నడపనుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని, ఈ ప్రత్యేక సర్వీస్‌లను ఉపయోగించుకుని క్షేమంగా శైవాలయాలకు చేరుకొని భక్తులు మొక్కులు చెల్లించుకోవాలని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ కోరారు. స్పెషల్ బస్సుల్లో... పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత సదుపాయం అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవాలని సూచించారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం, వేములవాడకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని, టికెట్ల బుకింగ్‌ను ఉఉఉ.ౡఔౠఙ.ఱఅ వెబ్‌సైట్‌లో చేసుకోవచ్చని అన్నారు. స్పెషల్ బస్సుల సమాచారం కోసం టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033ను సంప్రదించాలని కోరారు.

ఆదుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

కేంద్రానికి లేఖ రాశానన్నారు. గతేడాది డిసెంబర్ 26వ తేదీ, ఈ ఏడాది ఫిబ్రవరి 5, 11వ తేదీల్లో లేఖలు పంపినట్లు సీఎం గుర్తుచేశారు. మిరప సాగుకు ఏటా పెట్టుబడి పెరుగుతోంది కానీ ఆ స్థాయి ఆదాయం లేదని రైతులు సీఎంకు తెలిపారు. నల్లతామర తెగులుతో పంట నాణ్యత, దిగుబడి తగ్గిపోతోందన్నారు. ఎకరాకు రూ.3 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకూ ఖర్చు అవుతోందని వెల్లడించారు. కూలీ ఖర్చులు పెరిగాయని, కూలీలు దొరకడం లేదన్నారు. వ్యయప్రయాసాలతో పంటను యార్డుకు తెస్తే ఉదయం నిర్ణయించిన ధర మళ్లీ మధ్యాహ్నానికి వచ్చిన తర్వాత ఉండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాకు రూ.500 చొప్పున వ్యాపారులు తగ్గిస్తున్నారని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ప్రశ్నిస్తే నాణ్యత లేదంటున్నారని... ఉదయం ఉన్న నాణ్యత మధ్యాహ్నానికే తగ్గుతుందా అని రైతులు అసహనం వ్యక్తంచేశారు. ఇదిలావుంటే, ఏపీ నుంచి మిర్చి ఎక్కువగా చైనా, కొలంబో, బంగ్లాదేశ్, ఇండోనేసియా దేశాలకు ఎగుమతి అవుతుందని ఎగుమతి దారులు తెలిపారు. ఈ ఏడాది ఎగుమతులు తగ్గడంతో ధర తగ్గిందన్నారు. సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ నెలల్లో వచ్చిన వరదల కారణంగా, పురుగు మందులు ఎక్కువగా వినియోగించడం వల్ల, నాణ్యత కొంత దెబ్బతినడం వల్ల డిమాండ్ తగ్గుతుందని వెల్లడించారు.

ప్రాజెక్టుల సాధనకు మరో ఉద్యమం

(మొదటిపేజీ తరువాయి)

కృషి చేస్తున్నట్టు చెప్పారు. ప్రాజెక్టుల కోసం నిధులు కేటాయించి... పూర్తి చేయడానికి ఏ ప్రభుత్వం దశాబ్దాలుగా చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ప్రాజెక్టులు పూర్తికాకపోవడంతో రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలు పూర్తిగా కరువుకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బచావత్ ట్రిబ్యునల్ నీటి కేటాయింపులకు రూపకల్పన చేసిందని, కానీ దానిని కర్నాటక, తెలంగాణ రాష్ట్రాలు వ్యతిరేకించి బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌ను తీసుకొచ్చి రాయలసీమ రైతులకు ఉరితాళ్లు బిగించిందని ధ్వజమెత్తారు. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు ఏపీకి అశనిపాతంగా తయారైందన్నారు. హేతుబద్ధత కాని కొలమానాలు, పంపకాలు... ప్రాజెక్టుల స్థిరీకరణకు అంతరాయం కలిగిస్తున్నాయన్నారు. ఆల్మట్టి ఎత్తు పెంపు మన నెత్తిన కుంపటిగా తయారైందన్నారు. గ్రేటర్ రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ సీనియర్ నేత తులసిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టులు అనాదిగా వివక్షకు గురవుతున్నాయన్నారు. ఏ ప్రభుత్వమూ ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టులు పూర్తి చేయకపోవడంతో రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలు కరువు రక్కసికి గురవుతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రాయలసీమను కరువు నుంచి విముక్తి చేయడానికి టీడీపీ వ్యవస్థాపకులు ఎన్టీ రామారావు తెలుగుగంగను తీసుకువస్తే... ఆ ప్రాజెక్టును ఇప్పటి వరకు పూర్తి చేయకపోవడం బాధాకరమన్నారు. జీఎన్ఎస్ఎస్, హంద్రీనీవా, వెలిగొండ వంటి ప్రాజెక్టులు దశాబ్దాలుగా అటకెక్కాయన్నారు. రాష్ట్ర విభజన తరువాత ప్రాజెక్టులకు సంబంధించి అనేక పరిణామాలు చోటుచేసుకున్నాయని, కర్నాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాలు ఏపీ నికర జలాలు వాడుకునే అవకాశం లేకుండా అసంబద్ధ అనుమతులు లేని ప్రాజెక్టులు తేవడంతో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కృష్ణా యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని కర్నూలులో ఏర్పాటు చేసి బడ్జెట్‌లో రూ.45 వేల కోట్లు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన ప్రాజెక్టుల పూర్తికి సహకరించాలన్నారు.

రాయలసీమ ప్రాజెక్టుల ఉద్యమకారుడు దశరథరామిరెడ్డి మాట్లాడుతూ బనకచర్ల ప్రాజెక్టు క్లిష్టమైనదని, ఉన్న ప్రాజెక్టులనే సత్వరం పూర్తి చేయాలని కోరారు. 2004లో పులిచింతల ప్రాజెక్టు నిర్మించి రాయలసీమ అభివృద్ధికి పాటుపడతామన్నారే కానీ ఏమాత్రం అభివృద్ధి చెందలేదన్నారు. రాష్ట్ర విభజన తరువాత 2014లో పోలవరం పూర్తి చేస్తామని చంద్రబాబు కోట్ల రూపాయలు ఖర్చుచేసినా ప్రాజెక్టు పురోభివృద్ధి సాధించలేదన్నారు. ప్రస్తుత పాలకులు ఏపీ అంటే పోలవరం, అమరావతి అనే అంశంతో ముందుకెళుతున్నారని, రాయలసీమకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఆంజనేయులు మాట్లాడుతూ తీవ్ర కరువు కాటకాలతో అనంతపురం జిల్లా అల్లాడుతోందన్నారు. కరువు రక్కసికి బలైన చిన్న, సన్నకారు రైతులతో పాటు దినసరి కూలీలు కూడా ఉపాధి లేక కర్నాటక, మహారాష్ట్రకు వలస పోయి భిక్షమెత్తుకునే పరిస్థితులు రాష్ట్ర పాలకులు కల్పించారన్నారు. వాటికి చరమగీతం పాడాలంటే రాయలసీమ ప్రాజెక్టులను సత్వరం పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ రాయలసీమలో ప్రాజెక్టులు ఎన్టీ రామారావు, చంద్రబాబు ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడే ముందుకు కదిలాయన్నారు. వైఎస్ఆర్ హయాంలో కొంత వరకు ప్రాజెక్టుల పనితీరు మెరుగుపడినా... ఆ తరువాత కుంటుపడ్డాయన్నారు. జగన్ పాలనలో ఏ ప్రాజెక్టుకు తట్టెడు మట్టి ఎత్తిన పాపాన పోలేదని విమర్శించారు.

ఏఐకేఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రావుల వెంకయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా ప్రాజెక్టుల సమస్యల సుడిగుండంలో ఉన్నాయని, యమునా, కృష్ణా డెల్టా పరీవాహక ప్రాంతాల సమస్యలాగే కావేరి నదీ జలాల సమస్యలు దేశాన్ని పట్టిపీడిస్తున్నాయని అన్నారు. పాలకులు నిధులు కేటాయించి పరిష్కార మార్గాలు చూపాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం నేత రామచంద్రయ్య మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టుల నిర్మాణంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని అన్నారు. పాలకులు ఎవరున్నా ప్రాజెక్టుల నిర్మాణం కోసం నిధులు కేటాయించాలన్నారు. జిల్లా నాయకులు గాలి చంద్ర, మనోహర్‌రెడ్డి, ఎల్.నాగసుబ్బారెడ్డి, గుంటి వేణుగోపాల్, ఉద్దె మద్దిలేటి, ఎస్.వెంకటశివ, కేసీ బాదుల్లా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ మాసంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : మార్చి 2 నుండి ప్రారంభమయ్యే ముస్లింల పవిత్ర రంజాన్ మాసం నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. రంజాన్ మాసంలో చేయవలసిన ఏర్పాట్లపై శనివారం కలెక్టరేట్లో మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మస్జిద్‌ల వద్ద పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మస్జిద్‌లలో ఈనెల ఉపవాసకుల రద్దీ అధికంగా ఉంటదని ఆవరణలో పిచ్చి మొక్కలు, చెత్త ఎప్పటికప్పుడు పరిశుభ్రం చెయ్యాలని చెప్పరు. మంచినీటి సరఫరాలో భాగంగా బావులు, ట్యాంకులు శుభ్రం చేసి బ్లీచింగ్ చెల్లించాలన్నారు. రంజాన్ మాసంలో నిర్వహించే ప్రార్థన సమయానికి అనుగుణంగా రెండు పూటలా త్రాగునీరు సరఫరా చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఇఫ్తార్, సహరి, ప్రత్యేక నమాజుల సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతర సరఫరా జరగాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈవో నాగలక్ష్మి, భద్రాచలం ఆర్డీవో దామోదర్ రావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, వైద్య శాఖ అధికారి భాస్కర్ నాయక్, ఈఈ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ సుజాత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు మణుగూరు రానున్న మంత్రి సీతక్క

విశాలాంధ్ర - పినపాక : రాష్ట్ర శిశు -సంక్షేమ, నీటిపారుదల, గ్రామీణ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ఆదివారం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మణుగూరు మండలం శేషగిరి నగర్‌లో మధ్యాహ్నం 12 గంటలకు ఆమె చేరుకుంటారు. మంత్రి సీతక్క సహాయకులు కాంగ్రెస్ నేత సతీష్ తండ్రి ప్రథమ వర్ధంతి కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం ఆమె నియోజకవర్గంలోని సమస్యలపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లుతో పాటు కాంగ్రెస్ నాయకులతో చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సకాలంలో చేరుకోవాలని ఆమె పర్యటనను సద్వినియోగం చేసుకోవాలని బాధ్యులు కోరారు.

పాలనకు మతం రంగు పూస్తున్న బీజేపీ

సీపీఐ సమావేశంలో భాగం హేమంతరావు

విశాలాంధ్ర - ఖమ్మం : బిజెపి పాలనకు మతం రంగు పుస్తుందని ప్రతి దానిని మతం కోణంలోనే చూస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు. మతాన్ని బూసిగా చూపి రాజకీయ ఎజెండాగా మార్చుకుని బిజెపి లబ్ది పొందాలని చూస్తుందని ఆయన తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఖమ్మం, వైరా, పాలేరు, మధిర నియోజక వర్గాల సమావేశం శనివారం స్థానిక గిరిప్రసాద్ భవన్లో జరిగింది. మిడికంటి చిన్న వెంకటరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో హేమంతరావు మాట్లాడుతూ మోడీ పదేళ్ల పాలనలో ప్రజల మధ్య మతపరమైన విభజన తీసుకు రావడంలో బిజెపి దాని అనుబంధ సంస్థలు సఫలీకృతమయ్యాయని ఆయన తెలిపారు. మెజార్టీ, మైనార్టీ పద్ధతిలో బిజెపి వ్యవహరిస్తుందని ఇదే పద్ధతి కొనసాగితే భవిష్యత్తులో దేశంలో శాంతి కొరవడుతుందని ఆయన అన్నారు. పాలనకు మతం రంగు పూయడం వల్ల లౌకికవాద భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందన్నారు. కార్పొరేట్లు సంపన్న వర్గాలు మినహాయించి మరో వైపు చూసే ఆలోచనలో బిజెపి లేదన్నారు. ఆర్థికంగా భారత్ వెలుగుతుందని చెబుతున్న బిజెపి పాలనలో ఉపాధి కల్పన రంగాలు వట్టిపోయాయని వ్యవసాయ రంగం కూనరిల్లుతుందని చిన్నతరహా పరిశ్రమలు మూతపడ్డాయని కేవలం కార్పొరేట్ సంస్థలు మాత్రమే పురోగతిలో ఉన్నాయని ఆయన అన్నారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ వాటాకు ఇబ్బంది జరిగితే భారత కమ్యూనిస్టు పార్టీ సహించదన్నారు. కృష్ణా జలాలను తెలంగాణ భూములకు మళ్లించాలని చారిత్రక పోరాటాలు నిర్వహించిన ఘన చరిత్ర సిపిఐదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, ఏపూరి లతాదేవి, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు అజ్మీర రామ్మూర్తి పాల్గొన్నారు.

సిబ్బంది సమస్యలపై పోలీస్ దర్బార్

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: శనివారం రామగుండం కమిషనరేట్ స్పెషల్ పార్టీ, క్విక్ రెస్పాన్స్ టీం పోలీస్ సిబ్బంది, అధికారులకు రామగుండం కమిషనరేట్‌లో పోలీస్ దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని స్పెషల్ పార్టీ, క్యూ.ఆర్.టి. సిబ్బందితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమస్యలను వెంటనె పరిష్కరించేలా చూస్తామ న్నారు. ఎలాంటి సమస్య ఉన్నా దర్బార్‌లో చెప్పడం ఇబ్బందిగా ఉంటే ఆఫీస్‌కి వచ్చి నేరుగా కలిసి చెప్పవచ్చన్నారు. పోలీస్ విధి నిర్వహణలో భాగంగా ఎన్నో పని ఒత్తిళ్లను ఎదుర్కోనాల్సి వుంటుందని, క్రమశిక్షణ, ప్రణాళికబద్ధంగా విధులు నిర్వహించడం ద్వారా ఈ ఒత్తిళ్లను అధిగమించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ సీ. రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐ లు దామోదర్, శ్రీనివాస్, ఆర్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - వనపర్తి : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి కె విజయ రాములు మాట్లాడుతూ ఆత్మకూరు పట్టణంలో బాబాకాలనీలో టీఎన్జీవో బిల్డింగ్ పక్కన ఉన్న 20 ఫీట్ల రోడ్డుకు అడ్డంగా ఎలాంటి పర్మిషన్లు లేకుండా అక్రమ కట్టడాన్ని చేస్తున్న మాజీ ఎంపీపీ బంగారు శ్రీనుపై చర్యలు తీసుకోవాల న్నారు. బాబా కాలనీలో నిర్మించిన వెంచర్లో 10శాతం ల్యాండ్ పూర్తి వివరాలు ఇవ్వాలని ఆత్మకూరు పట్టణంలో అనేక వెంచర్ల లో ఉన్న 10శాతం ల్యాండ్ కమ్యూనిటీ పర్పస్ కోసం ప్రజల అవసరాల కోసం 10శాతం ల్యాండ్ వెంచర్ల లో తప్పనిసరిగా ఉండాలని అది మున్సిపాలిటీ పరిధిలో అప్పటి గ్రామ పంచాయతీ ఇప్పటి మున్సిపాలిటీ పరిధిలో ఉండాలి, కానీ ఈ ప్రభుత్వ స్థలాలన్నీ కబ్జాదారుల చేతులకు అసెస్మెంట్ నెంబర్లు ఇచ్చి మున్సిపల్ కమిషనర్లు టిపివోలు పర్మిషన్లు ఇచ్చి ల్యాండ్లను కబ్జా గార్ల చేతుల్లో పెట్టారు. కాబట్టి వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అసమానతలు పోయి అందరికీ సమానత్వం రావాలి

మంత్రి దామోదర్ రాజనర్సింహా

విశాలాంధ్ర బ్యూరో - మెదక్ : వర్గీకరణ ఒక కులానికి వ్యతిరేకం కాదు.. 59 దళిత కులాలున్నాయి.. అసమానతలున్నాయి.. ఆ అసమానతలు పోయి అందరికి సమానత్వం రావాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సి.దామోదర్ రాజానర్సింహా అన్నారు. శనివారం మెదక్‌లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డికి మద్దతుగా పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, స్థానిక ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్ రావు, క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్ పాల్గొన్నారు. మంత్రి దామోదర్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు సూచనతో వర్గీకరణపై కమిటీ వేసి నివేదిక రాగానే అసెంబ్లీలో తీర్మానం చేసింది కేవలం తెలంగాణ రాష్ట్రం, కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. 14 నెలల కాంగ్రెస్ పాలనలో హామీలను నెరవేరుస్తు పట్టభద్రుల ఎన్నికలకు వచ్చామన్నారు. బీసీ కుల గణన బ్రిటిష్ పాలన తర్వాత మొదటి సారిగా చేపట్టడం జరిగిందన్నారు. ఆనాడు మాటిచ్చి ఈనాడు 56 వేల మందికి ఉద్యోగాలు కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిది అన్నారు. మెదక్ జిల్లాను సిరిసిల్ల జోన్‌లో కలపడం సముచితం కాదు, దీన్ని సరిదిద్దాల్సిన అవసరం ఉంది. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తా అని హామీ ఇచ్చారు. కరీంనగర్ వాసి, విద్యావేత్త ఆల్ ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి సౌమ్యుడు, 55 వేల మందికి విద్యను అందిస్తు, సుమారు 8 వేల మందికి ఉపాధి కల్పిస్తున్న వ్యక్తి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అచితూచి అభ్యర్థిని ఎంపిక చేసింది. ఓటు వేసేటప్పుడు భావోద్వేగాలకు గురికావద్దు. ఆలోచన చేసి ఓటు వేయాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు. 30 సంవత్సరాలు విద్యారంగంలో సేవ చేస్తున్న సందర్భంగా ఆయనను ప్రభుత్వం అభ్యర్థిగా ఖరారు చేసిందన్నారు. విద్యా, ఆరోగ్య భద్రత రెండు సమాజానికి ముఖ్యమైనవన్నారు. మెదక్ మెడికల్ కాలేజీ రాదన్నారు.ఏడుపాయల అమ్మవారి అభివృద్ధికి, మెదక్ చర్చికి ముఖ్యమంత్రి స్వయంగా వచ్చాడన్నారు. అందరూ బాగుండాలి అందులో మనం ఉండాలి కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం అన్నారు. నరేందర్ రెడ్డిని ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ గెలిస్తే లాభం లేదని మంత్రి కొండ సురేఖ అన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు బీజేపీ ఎంపీలున్నా రాష్ట్రానికి తెచ్చింది గాడిద గుడ్డు అన్నారు. గతంలో దుబ్బాక ఎమ్మెల్యేగా పనిచేసిన రఘూనందన్ రావు కేంద్రం నుండి ఏం తెచ్చారని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెంది లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ లోపాయికరి ఒప్పందంతో బీజేపీ ఎంపిగా గెలిపొందారన్నారు. చిన్న పిల్లవాడికి చాక్లేట్ ఆశ చూపినట్లు బీజేపీ తీరు ఉందన్నారు. బీజేపీ అభ్యర్థి గెలిస్తే ఎవరికీ లాభం రాదు, ఓడితే అయనకొక్కడికే నష్టం అన్నారు.

సమస్యల పరిష్కారానికై దశలవారి పోరాటం

విశాలాంధ్ర-తొర్రూరు: తొర్రూరు ప్రాంత సమస్యల పరిష్కారానికి పాలకులు నిర్లక్ష్యం పై దశల వారి పోరాటాలను ఉధృతం చేస్తామని వామపక్ష పార్టీల నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం తొర్రూర్ ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం సిపిఐ రాష్ట్ర నాయకులు తమ్మెర విశ్వేశ్వర రావు, సిపిఐ ఎంఎల్ మాస్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి, సిపిఎం జిల్లా నాయకులు బొల్లం అశోక్‌లు మాట్లాడుతూ, తొర్రూరులో మంజూరైన 100 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించాలని, ఆస్పత్రి నిర్మాణాన్ని ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా పట్టణ కేంద్రంలో నిర్మించాలని డిమాండ్ చేశారు. తొర్రూరు పట్టణంలో ప్రైవేటు భూమిని కొనటానికి నిధుల కొరత ఉంటే వామపక్ష పార్టీలు జోల పట్టుకుని నిధులు వసూలు చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామని అన్నారు.దీనిలో ప్రజాప్రతినిధులు కూడా పాల్గొనవచ్చని ఆహ్వానించారు. తొర్రూరు ప్రధాన రహదారిపై డ్రైనేజీని నిర్మాణాన్ని పూర్తి చేస్తూ కరెంటు పోల్స్ తొలగించాలని రోడ్డు నుండి డ్రైనేజీ వరకు సిసి రోడ్డు నిర్మించాలని అన్నారు. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఎస్‌టిఓ, ఫైర్ స్టేషన్, ఇరిగేషన్ ఆఫీస్‌తో పాటు మినీ స్టేడియం, బాలికల హైస్కూల్, పాలిటెక్నిక్ కాలేజీలు తదితర ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన నిర్మాణాన్ని చేపట్టాలని వారు అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు రైతులకు అంతర్గత రోడ్ల నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తొర్రూర్ మండల కార్యదర్శి ఎండీ యాకుబ్, సిపిఐ తొర్రూర్ మండల బందు మహేందర్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి కిరణ్, వీరన్న, జమ్మల శ్రీను, సోమిరెడ్డి, గుద్దేటి సాయి మల్లు, ఉమ్మగాని యాకయ్య, దొమ్మటి సోమయ్య వెంకట్ రెడ్డి, యాకన్న,తిమ్మిడి రవి, ధరావత్ యాకన్న, తాళ్ల వెంకటేశ్వర్లు, జితేందర్ రెడ్డి, వెంకన్న, మహేందర్ మురళి సంతోష్ నందీశ్వర్, సాయిలు, యాకయ్య, లక్ష్మయ్య, వెంకన్న పాల్గొన్నారు.

బాధితులకు చట్టాలు అండగా ఉండాలి

విశాలాంధ్ర - గార్ల : చట్టాలు నేరస్తులను శిక్షించడానికి మాత్రమే కాదు బాధితులకు అండగా, భరోసాగా ఉండాలని ప్రముఖ న్యాయవాది, విశ్వ సమాజం వ్యవస్థాపకులు విశ్వ జంపాల అన్నారు. శనివారం గార్ల మండల కేంద్రంలోని విశ్వ న్యాయవాద కార్యాలయంలో యువ న్యాయవాదులైన కందుకూరి ప్రవీణ్‌బాబు, కందుకూరి లక్ష్మణ్‌లకు పాత, కొత్త క్రిమినల్, మేజర్ చట్టాల సారాంశమున్న ఏఎల్‌టి పబ్లికేషన్ పుస్తకాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ న్యాయవాదులు చట్టాలపై పూర్తి పట్టు సాధించాలాన్నారు. వృత్తిని కేవలం సంపాదనకోసం కాకుండా తమ వద్దకు వచ్చే బాధితులకు న్యాయం చేస్తూ అండగా నిలవాలని కోరారు. న్యాయవాదులు నిరంతరం చట్టాలను అధ్యయనం చేస్తూ బాధిత ప్రాంతాలను, ప్రజలను సందర్శిస్తూ రాజ్యాంగపరమైన హక్కులపై అవగాహన కల్పిస్తూ చైతన్యం చేయాలన్నారు. చట్టాలు సమాజ అభివృద్ధికి శోధక శక్తులుగా ఉండాలన్నారు. చట్టాలు కేవలం బలవంతులకోసం, ప్రజలపై నియంత్రత్వ అణచివేత ధోరణలతో ఉండకూడదన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సాహిత్య వేదిక జిల్లా అధ్యక్షులు వజ్రం నాగేశ్వరరావు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, సిపిఎం జిల్లా కౌన్సిల్ సభ్యులు కందునూరి శ్రీనివాస్, దాసరి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ అంటే కేసీఆర్‌కు భయమెందుకు

విశాలాంధ్ర - ఇల్లందు : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఏపీ సియం నారా చంద్రబాబు నాయుడు ఎన్డీఏ రూపంలో తెలంగాణ రాజకీయాల్లోకి వస్తూన్నారని తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వీరి అహంకారానికి పరాకాష్టగా ఉన్నాయని టిడిపి ఇల్లందు నియోజకవర్గ నేత ముద్రగడ వంశీ విమర్శించారు. తాము అధికారంలో ఉన్నంతకాలం తెలంగాణలో చంద్రబాబు నాయుడుని కాళ్లు పెట్టనివ్వలేదని జగదీష్ రెడ్డి చెప్పటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమ న్నారు. శనివారం ఇల్లందులోని టీడీపీ ఆఫీస్‌లో వంశీ మాట్లాడుతూ చంద్రబాబు అంటే కెసిఆర్‌కు ఎందుకింత భయమని ప్రశ్నించారు. ప్రాంతాల పేరిట వైషమ్యాలను రెచ్చగొట్టి రాజకీయాల్లోకి వచ్చి అందల మెక్కిన కేసీఆర్‌కు చంద్రబాబును విమర్శించే అర్హత లేదన్నారు. చంద్ర బాబు తన రాజకీయ జీవితంలో రాజ్యాంగ బద్ధంగా వ్యవహరిస్తూ దూరదృష్టి గల గొప్ప విజన్ కలిగిన నాయకుడన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఆనాడు తమ పార్టీ లేఖ ఇవ్వలేదా అని గుర్తు చేసారు. రాష్ట్రం విడిపోయినా అన్నదమ్ముల్లాగా రెండు రాష్ట్రాలు ఉండాలని చెప్పిన గొప్ప నాయకుడు చంద్రబాబు అన్నారు. టిడిపి రెండు రాష్ట్రాల్లో రాజకీయాలు చేయకూడదా అని ప్రశ్నించారు. కెసిఆర్ తాను తెరాస పార్టీని బిఆర్ఎస్‌గా మార్చి ఇతర రాష్ట్రాల్లో తిరగ లేదా అని వంశీ ప్రశ్నించారు. 2009 ఏదాది చంద్రబాబు అండతోటే కెసిఆర్, హరీష్ రావు, కేటీఆర్ గెలిచారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. బిఆర్ఎస్ నేతలు ఇష్టమైచ్చినట్లు మాట్లాడితే టిడిపి నాయకులు, కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు.

ఏఐసీఎస్ క్రికెట్ బృందానికి ఎంపికైన తిలక్‌కిషోర్

విశాలాంధ్ర - కారేపల్లి : ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ క్రికెట్ టీంకు ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని సూర్యతండ గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న భూక్యా తిలక్ కిషోర్ ఎంపికయ్యారు. ఇటీవల కాలంలో ఉద్యోగుల సంఘం క్రికెట్లో తిలక్ కిషోర్ మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో అత్యున్నత ప్రతిభ కనబరిచారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాలలో తనదైన శైలిలో నిరంతరం జట్టుకి అండగా నిలిచి గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఈ క్రమంలో రాష్ట్ర ఎంప్లాయిస్ సంఘం ఢిల్లీలో జరగబోయే ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ క్రికెట్ టీంకు ఎంపిక చేశారు. కాగా ఖమ్మం జిల్లా నుంచి ఏఐసిఎస్ టీంకు ఎంపికైన మొట్టమొదటి వ్యక్తిగా తిలక్ కిషోర్ చరిత్ర సృష్టించారు. మార్చి 14 నుండి 26 వరకు ఢిల్లీలో జరగబోయే పోటీలలో తిలక్ కిషోర్ పాల్గొననున్నారు. తిలక్ కిషోర్ ఉద్యోగ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూనే, తమ సంఘానికి బాధ్యుడిగా వ్యవహరిస్తూ సహ ఉద్యోగులకు అండగా నిలిచేవాడు. దీంతో పాటుగా క్రీడలలో సైతం ఉన్నత ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో ఎంపిక కావడం పట్ల సహచర ఉద్యోగస్తులు, ఉన్నతాధికారులు హర్షం వ్యక్తం చేసి శుభాకాంక్షలు తెలుపారు. జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తిలక్ కిషోర్ మాట్లాడుతూ జాతీయస్థాయి ఎంపీ కావడం పట్ల సంతోషం వ్యక్తం చేసి, ఎంపిక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

కోల్ ఇండియా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు షురూ

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం : భారతదేశ బొగ్గు గనుల పరిధిలోని కోల్ ఇండియా స్థాయి అథ్లెటిక్ పోటీలు కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం నుంచి రెండు రోజులు నిర్వహించే మహిళా, పురుషుల ఈ పోటీలను సింగరేణి సంస్థ డైరక్టర్ (ఈఅండ్ ఎం) డి.సత్యనారాయణ రావు ముఖ్య అతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. సింగరేణి కాలరీస్ కార్పొరేట్ ఏరియా ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఈ పోటీలు కొత్తగూడెం 22, 23 రెండు రోజులు నిర్వహించెందుకు వేదిక కావడం గర్వంగా ఉందన్నారు. ఆయన ఒలంపిక్ పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన తోపాటు కార్పొరేట్ జిఎం కవిత నాయుడు సంయుక్తంగా ఒలంపిక్ జ్యోతిని వెలిగించి బెలూన్‌లను ఎగురవేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ సత్యనారాయణరావు ప్రారంభ ఉపన్యాసంలో మాట్లాడుతూ క్రీడా ప్రతిభతో స్నేహభావంతో క్రీడల్లో రాణించాలని కోరారు. క్రీడలు అనేవి శారీరక, మానసిక దృఢత్వాని ఆరోగ్యానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీలలో పాల్గొనే కోల్ ఇండియా పరిధిలోని 9 బొగ్గు సంస్థల జట్లు సింగరేణి, బిసిసిఎల్, సిసిఎల్, సిఎంపిడిఐ, ఈసిఎల్, ఎన్‌సిఎల్, ఎస్ఈసిఎల్, ఎంసిఎల్,డబల్యూసిఎల్ క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు.

వివిధ ఇవేంట్స్ లొ క్రీడాకారుడు అద్భుత ప్రదర్శన కనబరిచి విజేతలుగా నిలిచారు. జీఎం (పర్సనల్) వెల్ఫేర్, ఐఆర్ అండ్ పిఎం కవితా నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమములో విశిష్ట అతిధులుగా గుర్తింపు సంఘం (ఏఐటియూసి) అడిషనల్ జనరల్ సెక్రటరీ మిరియాల రంగయ్య, ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టియూసి) జనరల్ సెక్రటరీ సి.త్యాగరాజన్, సింగరేణి సిఎంఓఏఐ వైస్ ప్రెసిడెంట్ పి. రాజీవ్ కుమార్, డిజిఎంలు కే.అజయ్ కుమార్, జి.రాజేంద్ర ప్రసాద్, అజయ్ కుమార్, వై.వి.ఎల్.వరప్రసాద్, బి.శివ కేశవ రావు, డిజిఎం(సివిల్) పి.రాజశేఖర్ , అధికారులు, యూనియన్ నాయకులు, స్పోర్ట్స్ సూపర్ వైజర్ లు పాల్గొన్నారు.

మొదటి రోజు ఆటల పోటీల విజేతల వివరాలు..

ఆర్చరీలొ మొదటి బహుమతి ఎస్.అఖిల్ (సింగరేణి), రెండవ బహుమతి, నిఖిల్, (డబ్ల్యూసిఎల్), మూడవ బహుమతి, సెడ్ కుమార్, (ఎస్ఈసిఎల్) గెలుచుకున్నారు. రన్నింగ్ మహిళా విభాగం 100 మీటర్స్‌లో మొదటి బహుమతి ప్రియా ఒరమ్, (ఎంసిఎల్), రెండవ బహుమతి, డాక్టర్ సూదిసన్ మండల్, (సిసిఎల్), మూడవ బహుమతి ని ఈ.సుష్మ, (సింగరేణి) గెలుచుకున్నారు. అలాగే 400 మీటర్స్‌లో మొదటి బహుమతిని ప్రియా ఒరమ్, (ఎంసిఎఎల్) రెండవ బహుమతి ని త్రిప్తి పూరి, (ఎన్‌సిఎల్) మూడవ బహుమతిని రుక్మని, (ఎస్ఈసిగఎల్) దక్కించు కున్నారు. 800 మీటర్స్‌లో మొదటి బహుమతి అనిమా కుజుర్,, (ఎస్ఈసిగఎల్), రెండవ బహుమతి త్రిప్తి పూరి, (ఎన్‌సిఎల్) మూడవ స్థానాన్ని లక్ష్మి ఒరన్, (సిసిఎల్) దక్కించుకున్నారు. రన్నింగ్ పురుషుల విభాగంలో 800 మీటర్స్ మొదటి బహుమతి రాజ్ కుమార్ ఒరమ్, (బిసిసిఎల్), రెండవ బహుమతి ఎస్.క్రాంతి కిరణ్, (సింగరేణి), మూడవ బహుమతి రాజ్ కుమార్, (డబల్యూసిఎల్) దక్కించుకొగా డిస్కస్ త్రో లో మొదటి బహుమతి మాన్విత, (సింగరేణి) రెండవ బహుమతి ఇందు బాల, (ఎన్‌సిఎల్), మూడవ బహుమతిని పింకి నాహక్, (సిసిఎల్) విజేతలుగా నిలిచారు. డిస్కస్ త్రో పురుషుల విభాగంలో మొదటి స్థానంలో సుబ్రతా మండల్, (ఈసిఎల్), రెండవ స్థానం ఆశీష్ కుమార్, (ఎన్‌సిఎల్) మూడవ స్థానం ప్రవీణ్ చంద్ర మిశ్రా, (బిసిసిఎల్) దక్కించుకున్నారు. ట్రిపుల్ జంప్‌లో మొదటి స్థానం సంతు పటస్, రెండవ స్థానంలో అవినాష్, మూడవ స్థానంలో అభిమన్యు బాటియ విజేతలుగా నిలిచారు.

నెస్ట్‌లో ఆరోగ్య సంరక్షణ పురోగతికి మార్గం సుగమం

హైదరాబాద్: ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలపై దృష్టి సారించిన మొట్టమొదటి, వాస్తవ-ప్రపంచ కేస్-ఆధారిత పోటీగా నిలిచిన నెస్ట్ (నర్చరింగ్ ఎక్సలెన్స్, స్ట్రెంథనింగ్ టాలెంట్) గ్రాండ్ ఫినాలేను నోవార్టిస్ ఇండియా విజయవంతంగా నిర్వహించింది. నెలల తరబడి కొనసాగిన కఠినమైన పోటీ, మార్గదర్శకత్వం అనంతరం, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లినికల్ డెవలప్మెంట్‌లో ప్రతిభావంతులు కలిసి, ఔషధాన్ని పునఃరూపకల్పన చేసి రోగి సంరక్షణను మెరుగుపరిచే తమ వినూత్న ఆలోచనలను ప్రదర్శించడం లక్ష్యంగా వచ్చాయి. నోవార్టిస్ డెవలప్మెంట్ హబ్ ఇండియా హెడ్ సాధన జోగలేకర్ మాట్లాడుతూ, నోవార్టిస్‌లో, తాము ప్రతిభను వెలికితీసేందుకు, కొత్త అవకాశాలను సృష్టించేందుకు సహకారాన్ని ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. వాస్తవ-ప్రపంచ ప్రభావానికి గుర్తింపు పొందిన నాలుగు విజేత జట్లు, రూ.8,00,000 ప్రైజ్ పూల్ నుండి ప్రదానం చేయబడ్డాయి. భారతదేశంలోని నోవార్టిస్ డెవలప్‌మెంట్ హబ్‌తో ప్రీ-ప్లేస్‌మెంట్ ఇంటర్వ్యూ అవకాశాలను పొందాయి.

దేశ తదుపరి తరం విద్యుత్ విప్లవానికి ఎలెక్రామా నాంది

గ్రేటర్ నోయిడా: భారతదేశం విక్సిత్ భారత్ 2047 వైపు తన ప్రయాణాన్ని వేగవంతం చేస్తున్నందున, ప్రపంచ తయారీ కేంద్రంగా తన స్థానాన్ని బలోపేతం చేసుకుంటున్నందున ఆత్మనిర్భర్ భారత్, విద్యుత్ రంగం ఆర్థిక వృద్ధి, ఇంధన భద్రత, స్థిరత్వాన్ని నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ పరిణామం చెందుతున్న దృశ్యంలో, ఐఈఈఎంఏ (భారతీయ విద్యుత్, ఎలక్ట్రానిక్స్ తయారీదారుల సంఘం) నేడు గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో మార్ట్‌లో ప్రపంచంలోనే అతిపెద్ద విద్యుత్ ప్రదర్శన అయిన ఎలెక్రామా 2025ను స్ఫూర్తిదాయకంగా ప్రారంభించింది. ఎలెక్రామా 16వ ఎడిషన్ విద్యుత్, విద్యుత్ సాంకేతికతలలో భారతదేశ సామర్థ్యాలను ప్రదర్శిస్తుంది, విశ్వసనీయ ప్రపంచ భాగస్వామిగా దాని పాత్రను బలోపేతం చేస్తుంది.

శివకార్తికేయన్, నాని బర్త్‌డేలకు టాటా ప్లే బింగేలో వారి హిట్ మూవీలు

ముంబయి: శివకార్తికేయన్, నాని తమ పుట్టినరోజులను ఆచరించుకుంటున్న నేపథ్యంలో, వారిద్దరూ నటించిన అత్యంత ప్రియమైన సినిమాలను టాటా ప్లే బింగేలో చూసే అవకాశం దక్కింది. జెర్సీ (తెలుగు), ప్రిన్స్ (తమిళం, తెలుగు), హీరో (తెలుగు), నాని గ్యాంగ్ లీడర్ (తెలుగు) మూవీలు టాటా ప్లే బింగేలో ప్రసారమవుతున్నాయి. వీక్షకులు 30కిపైగా యాప్‌ల (అమెజాన్ ప్రైమ్ వీడియో, జియో హాట్‌స్టార్, ఆపిల్ టీవీ+, జీ5, సోనీలైవ్, ఫ్యూజ్ం, ఫ్యాన్‌కోడ్, హాల్‌మార్క్ లయన్స్‌గేట్ ప్లే, ఆహా, ప్రూ ట్, సన్ నెక్స్ట్, స్టేజ్, రీల్‌డ్రామా, చౌపాల్, నమ్మ ఫ్లిక్స్, ప్లానెట్ మరాఠీ, మనోరమామాక్స్, ఐస్ట్రీమ్, తరంగ్ ప్లస్, హంగామా ప్లే, షెమరూమీ, క్యూరియాసిటీ స్ట్రీమ్, ఎపిక్ ఆన్, ట్రావెల్‌ఎక్స్‌పి, డాక్యుబే, షార్ట్స్‌టీవీ, ప్లేఫ్లిక్స్, క్లిక్‌కె మరియు గేమ్స్) మొత్తం ప్యాకేజీని ఒకే సబ్‌స్క్రిప్షన్ కింద, ఒకే యాప్‌లో, ప్రతి యాప్ పాస్‌వర్డ్‌ను సబ్‌స్క్రైబ్ చేయకుండా లేదా గుర్తుంచుకోవాల్సిన అవసరం లేకుండా టాటా బింగేలో పొందవచ్చు. కనెక్ట్ చేయబడిన టీవీలతో సహా అన్ని పరికరాల్లో వీక్షణకు అందుబాటులో ఉంటుంది.

ఈసారి మహాశివరాత్రి ప్రత్యేకం: నందిజీ

విశాలాంధ్ర - హైదరాబాద్: ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది అన్వేషకులు ఫిబ్రవరి 26, 2025న మహా మహాశివరాత్రి 2025ని జరుపుకోనున్నారు. ఈ సంవత్సరం ఇది మరింత విశిష్టమైనది, భారతదేశంలోని ప్రయాగ్‌రాజ్‌లో ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి జరిగే భారీ తీర్థయాత్ర-ప్రతి 144 సంవత్సరాలకు ఒకసారి వస్తుందని చేతన సామాజిక వేదిక అయిన సిఎన్ఈఎస్ఎస్ వ్యవస్థాపకుడు నందిజీ అన్నారు. ఈ ప్రపంచ ఆధ్యాత్మిక కార్యక్రమానికి నాయకత్వం వహిస్తూ, నందిజీ మహా మహాశివరాత్రి ప్రపంచ యోగి దినోత్సవాన్ని నిర్వహిస్తారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా గుర్తించి, 2014లో ఐక్యరాజ్యసమితి ఆమోదించిన మహాశివరాత్రి ప్రపంచ యోగి దినోత్సవం అంతర్జాతీయ యోగా దినోత్సవ లక్ష్యాన్ని జరుపుకుంటుందన్నారు.

కజకిస్తాన్ కాన్సుల్ జనరల్‌గా నాసిర్ అలీ ఖాన్ పదవీ కాలం పొడిగింపు

హైదరాబాద్: కజకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ హైదరాబాద్‌లోని రిపబ్లిక్ ఆఫ్ కజకిస్తాన్ కాన్సుల్ జనరల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ పదవీ కాలాన్ని ఐదేళ్లు పొడిగించింది. దీంతో 2030 జనవరి వరకు ఈ పదవిలో ఉండనున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో కజకిస్తాన్ దేశానికి ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ పొడిగింపు భారత్-కజకిస్తాన్ సంబంధాల బలోపేతంలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా వచ్చింది. వాణిజ్యం, పెట్టుబడులు, విద్య, పర్యాటకం, సాంస్కృతిక మార్పిడి తదితర రంగాల్లో ఆయన రెండు దేశాల మధ్య పరస్పర సహకారం, ఆర్థిక అభివృద్ధికి దోహదపడ్డారు. తనపై ఉంచిన నమ్మకానికి కజకిస్తాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖకు, భారత్‌లోని కజకిస్తాన్ రాయబారి నుర్లాన్ జల్గస్బాయేవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రోహీర్ పీహెచ్‌సీనీ తనిఖీ చేసిన డీయంహెచ్ఓ

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఏటూరు నాగారం మండలంలోని రోహీర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గోపాల రావు శనివారం అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రావు మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల కొరకై, రోజూ వస్తున్న రోగుల వివరాలను అడిగి తెలుసుకుని, ఆరోగ్య కేంద్రంలోని మందుల నిల్వల గదిని, ల్యాబ్ టెక్నీషియన్ రూమును, రిజిస్టర్‌లను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ, వైద్య సిబ్బంది సమయపాలన పాటించి, ప్రజలకు అందుబాటులో ఉండి, మెరుగైన వైద్య సేవలు అందించాలనీ, లేనియెడల శాఖ పరమైన కఠిన చర్యలు ఉంటాయని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కీటక జనిత వ్యాధుల నియంత్రణ అధికారి డా.చంద్ర కాంత్, స్టాఫ్ నర్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వసుధైక కుటుంబంతో మమతల దీపాలు వెలిగించిన పినాకిల్

విశాలాంధ్ర - నేరేడుచర్ల : సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల పట్టణంలోని పినాకిల్ పాఠశాలలో వసుధైక కుటుంబం మాది, జగమంతా కుటుంబం మాది గ్రాండ్ పేరేంట్స్ కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. నేటి బంధుత్వాలు నేడు తెగిన గాలిపటాలు భేషజాల సుడి గాలికి కొట్టుకు పోతున్న కాగితాలు ఆర్థిక సంబంధాల అడకత్తెరలో ముక్కలౌతున్న పోకచెక్కలుగా మారాయి. అందుకే హృదయంతో స్పందించి, మనసులో మదించి, ఆలోచనల అగ్ని కణం రగిలించి అక్షర లక్షలతో ముందుకు సాగుతున్నది పినాకిల్ పాఠశాల ఈ సందర్భంగా పినాకిల్ విద్యా సంస్థల అధినేత మదార్ సార్ మాట్లాడుతూ అనుబంధాల లోగిలి, రక్త సంబంధాల వాకిలి, ప్రేమానురాగాల కౌగిలి, మానవత్వానికి మనిషి జీవితానికి పేగుబంధానికి ప్రేమానురాగాలకి రక్తబంధానికి నిదర్శనం మన బంధుత్వాలు, కుటుంబ వ్యవస్థ రోజు రోజుకు నశించిపోతుందని అన్నారు. అందుకే రోజు రోజుకు ఓల్డ్ ఏజ్ హోంల సంఖ్యలు పెరుగుతూ పోతున్నాయని, బాల్యం నుండే మార్పు రావాలి, బంధాలు పెరగాలి, అమ్మమ్మ, నానమ్మల కథలు వినాలి, తాతయ్య నేర్పే మర్యాదలు నేర్వాలి, కలసి భోజనం చేసి, కలసి ముచ్చటించడం నేర్వాలి. ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడాలన్నారు. అలాగే విద్యార్థి, విద్యార్థులు తమ ప్రతిభతో సాంస్కృతిక కార్యక్రమాలను అలరించారు. అనంతరం తమ అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలను తము ఘనంగా సత్కరించారు. ఈ వసుధైక కుటుంబం కార్యక్రమంతో మళ్ళీ ప్రపంచానికి మన దేశం వసుధైక కుటుంబం అని చాటి చెబుదాం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు, శ్రేయోభిలాషులు, పురప్రముఖులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

సంపాదకీయం

అబద్ధాలాడడంలో పెద్దన్న... చిన్నన్న

అసత్యమాడడంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పెద్దవాడా, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గొప్పవాడా అని తేల్చుకోవడం కష్టమే. వీరిద్దరి అసత్యాలు తమ దేశంలోని రాజకీయాలను అతలాకుతలం చేయడంతో పాటు ప్రపంచ రాజకీయ చిత్రపటాన్నే గందరగోళం చేస్తాయి. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు నరేంద్ర మోదీ స్థానంలో మరొకరిని ఎన్నుకోవడానికి మన దేశానికి 21 మిలియన్ డాలర్లు పంపించారని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంటున్నారు. అయితే ఈ డబ్బు భారత్‌కు కాకుండా బంగ్లాదేశ్ కు అందిందని "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" పత్రిక వెల్లడించింది. అంతకు ముందు రెండోసారి అమెరికా అధ్యక్షుడైన ట్రంప్, అత్యంత సంపన్నుడు ఎలాన్ మస్క్ ప్రకటనల తరవాత పెద్ద తుఫానే రేగింది. అమెరికా పంపిందంటున్న 21 మిలియన్ డాలర్లు అంటే దాదాపు 181 కోట్లు. మన దేశంలో ఎంపీ స్థానాలకు పోటీ చేసేవారు వందకోట్ల రూపాయల దాకా ఖర్చు పెడ్తారని అంటారు. ఆ లెక్కన యు.ఎస్. ఏడ్ ద్వారా అదిందంటున్న డబ్బు అది అక్రమమే అయినా, కాకపోయినా ఇద్దరు ఎంపీ అభ్యర్థులు పోటీ చేయడానికి బొటాబొటిగా సరిపోవచ్చు. యు.ఎస్. ఏడ్ తరపున డబ్బు పంపారని ట్రంప్ చెప్పిన తరవాత ఆ డబ్బు కాంగ్రెస్ కు అందిందన్న వాదన బయలుదేరింది. దీని ఆధారంగా గోదీ మీడియాలో నిరంతర చర్చోపచర్చలు జరుగుతున్నాయి. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో ఈ అంశంపై వార్త వెలువడిన తరవాత కాంగ్రెస్ ఈ వ్యవహారంపై చాలా తీవ్రంగా స్పందించింది. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో సవివరమైన వార్త వచ్చిన తరవాత ఈ విషయంపై పెద్ద దుమారం రేగింది. కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేడా జైప్రకాశ్ నారాయణ్ నాయకత్వంలో జరిగిన సంపూర్ణ విప్లవం నాటి నుంచి 2011లో అన్నా హజారే నాయకత్వంలో జరిగిన అవినీతి వ్యతిరేక ఉద్యమం వరకు అమెరికా నుంచి అందిన నిధుల నిజానిజాలు తేల్చాలని, శ్వేత పత్రం జారీచేయాలని కాంగ్రెస్ గట్టిగా కోరుతోంది. లేకపోతే తాము నల్లటి పత్రం (నీలి విడుదల చేస్తామంటున్నారు. ఒకవేళ నిధులు భారత్ కు కాదు బంగ్లాదేశ్ కే అందాయి అనుకున్నా ఆ దుష్ప్రభావం భారత్ మీద కచ్చితంగా పడుతుంది. ఈ డబ్బు అమెరికా నుంచి ఎందుకొచ్చింది, ఎవరికొచ్చింది అన్న విషయంలో రాజకీయ చతురతలో అద్వితీయుడని ప్రచారం చేసుకునే మోదీకి తట్టలేదు. ఆయన నమ్మే సలహాదారు అజిత్ దోబల్ కు తెలియదు. 1971లో పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధంలో భారత్ అపూర్వమైన విజయం సాధించడమే కాదు పాకిస్థాన్‌ను రెండు ముక్కలుచేసి బంగ్లాదేశ్ అవతరణకు దోహదం చేసింది. ఇటీవల మోదీ విదేశాంగ విధాన వైఫల్యంవల్ల బంగ్లాదేశ్‌లో పరిస్థితి ఎలా దిగజారుతోందో, భారత్ మీద ప్రతికూల ప్రభావం ఎలా పడ్తోందో మోదీ సర్కారుకు అంచనా కూడా లేనట్టుంది. బంగ్లా దేశ్ తాజా పరిణామాల్లో అమెరికా హస్తం ఉండడాన్ని మోదీ సర్కారు ఖండిస్తుందా. అలా ఖండిచినప్పుడు అమెరికా పేరెత్తి ఖండిస్తుందా అన్నది పెద్ద ప్రశ్న. కానీ ట్రంప్ ప్రతి రోజూ భారత్ మీద విరుచుకు పడ్తూనే ఉన్నారు. ఈ విషయంలో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ లో ప్రచురితమైన వార్త సంచలనం సృష్టించడమే కాదు, ఈ సమాచారాన్ని ట్రంప్ కార్యాలయంలోని బల్ల కింద వెతికి తెచ్చిందీ కాదు. ఈ సమాచారం అందరికీ అందుబాటులో ఉంది. ఇద్దరు, ముగ్గురు వ్యక్తులకు మాత్రం ఏమీ తెలియదు. వారు విశ్వగురువు మోదీ, చాణక్య బిరుదాంకితుడు అమిత్ షా, మోదీ సర్కారు సలహా దారు అజిత్ దోబల్. యు.ఎస్.ఏడ్ ఎవరికి ఎంత మొత్తం డబ్బు అందజేస్తుంది అన్నది సార్వత్రికంగానే అందుబాటులో ఉంది. మరి మోదీ సర్కారు ఈ విషయాన్ని ఎందుకు దర్యాప్తు చేయలేదు. ఎందుకంటే అమెరికా నుంచి కాంగ్రెస్ కు డబ్బులు అందాయని నమ్మించడానికే అని ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. భారత్ లో ఎన్నికలు జరుగుతున్నప్పుడు ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్‌లో పాల్గొనడానికి అమెరికా ఈ డబ్బు పంపిందని కూడా అంటున్నారు. కానీ 19వ తేదీన ట్రంప్ మాత్రం 2024 సార్వత్రిక ఎన్నికలలో మోదీని కాకుండా మరోకరిని గెలిపించడానికి పంపామని ట్రంప్ చెప్తున్నారు. ట్రంప్ ప్రకటన వెలువడ్డ తరవాత బీజేపీ ఐ.టి.సెల్ అధిపతి అమిత్ మాలవీయ, ప్రధానమంత్రి ఆర్థిక సలహాదారు సంజీవ్ సన్యాల్, కేంద్ర మాజీమంత్రి రవి శంకర్ ప్రసాద్ ప్రకటనల మీద ప్రకటనలు జారీ చేస్తున్నారు. తమకు డబ్బు అందలేదని బీజేపీకి అంత ధీమా ఉంటే వణికిపోతూ ప్రకటనలు గుప్పించాల్సిన అవసరమేమిటో! సంజీవ్ సన్యాల్ మోదీ అర్థిక సలహా మండలి సభ్యుడు కనక ఆయనకు వచ్చిన సందేహాలన్నీ మోదీనో, ప్రధాన మంత్రి కార్యాలయాన్నో అడగాలిగా. సలహాదారుకు మంచి చెడ్డల వివేక జ్ఞానం ఉంటుదనుకుంటాం కదా!

భారత్ కు డబ్బు పంపామంటున్న అమెరికా వాదిస్తూ ఉంటే సంజీవ్ సన్యాల్ మొదట ప్రభుత్వం నుంచి సమాచారం సేకరించాలిగా! ఆయన ప్రశ్నలు ఎవరిని ఉద్దేశించినవి? మొదట ప్రభుత్వ పక్షం నుంచి సమాచారం సేకరించాలిగా! మన దేశాన్ని అస్థిరీకరించడంకోసం మరో దేశం డబ్బు పంపుతూ ఉంటే మోదీ ప్రభుత్వం తప్ప మరే ప్రభుత్వమైనా నిశ్శబ్దంగా ఎలా ఉండగలుగుతుంది. విదేశీ విరాళాలు ఎఫ్.సి.ఆర్.ఐ ద్వారా వస్తాయి. ఆ శాఖ హోం మంత్రిత్వ విభాగంలో అంతర్భాగం. మరి వాస్తవం ఎందుకు తేల్చలేదు. అంటే హోం మంత్రిత్వశాఖ కూడా విఫలమైందనుకోక తప్పదు. విదేశాల నుంచి సహాయం అందుకోవడంలో తప్పులేదు. కానీ ఆ డబ్బును దుష్ట ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారా అని తేల్చవలసిన బాధ్యత కచ్చితంగా ప్రభుత్వం మీదే ఉంటుంది మరి. భారత్ మీద సుంకాలు విధిస్తాం అని మొన్న మోదీ అమెరికా పర్యటన సందర్భంగానే ట్రంప్ మన ప్రధాని మొహం మీదే చెప్పారు. బ్రిక్స్‌కు అస్తిత్వం లేకుండా చేస్తామని కూడా ట్రంప్ మోదీ మొహానే చెప్పేశారు. అయినా మోదీ మొహంలో చిరునవ్వే తొణికిసలాడింది తప్ప ఆయన కళ్లు ఎర్రబడలేదు. వెంటనే స్పందించాలన్న ఆలోచనే తట్టలేదు. అమెరికాలో ట్రంప్ మొహాన చెప్పడానికి మొహమాటం అనుకుంటే స్వదేశం తిరిగి వచ్చిన తరవాతైనా వివరణ ఇవ్వాల్సిందిగా! అమెరికాలో అక్రమంగా ఉంటున్నారన్న కారణంగా మూడు విమానాలలో అమెరికా భారత్‌లోని అమృత్‌సర్‌లో దింపేసి వెళ్లిపోయింది. ఆ అక్రమ వలసదార్ల కాళ్లకు, చేతులకు సంకెళ్లు వేసి మన దేశంలో దిగవిడిచి వెళ్లినా మోదీ 56 అడుగుల ఛాతీలో స్పందన ఎందుకు లేదో!

పోరాటాలే ఆయన ఊపిరి

ఆయన పోచుకోలు కబుర్లు చెప్పే నాయకుడు కాదు...త్యాగాల నాయకుడు. తననెప్పుడూ నాయకునిగా కాక, కేవలం సామాన్య కార్యకర్తగానే భావించుకున్న నిరాడంబరుడు. బహుజన, అట్టడుగు, దళిత ప్రజల సంక్షేమం కోసం అహరహం శ్రమించారు. ఆయన సంపూర్ణంగా నమ్మిందీ, నిలబడినదీ నిక్కచ్చి అయిన కమ్యూనిస్టు భావజాలంలోనే. పేద ప్రజల, వ్యవసాయ కార్మిక, ఉపాధ్యాయ ఉద్యమాలలో ఆయనది క్రియాశీలక పాత్ర. ఆయనే ఉప్పులేటి ప్రసాదరావు. దాదాపు మూడు దశాబ్దాలకు పైగా కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసి పుచ్చలపల్లి సుందరయ్యతో జైలు జీవితం గడిపి పేదప్రజల కోసం పనిచేసి కృష్ణాజిల్లా బందారు గూడెం గ్రామ సర్పంచిగా పనిచేసి అనేక సౌకర్యాలు కల్పించిన మహా వ్యక్తి ఉప్పులేటి ప్రసాదరావు. కమ్యూనిస్టు ఉద్యమంతో మమేకమై

అభ్యుదయపథమే తన జీవనవిధానంగా జీవించారు. ఈ ఆదివారం ఆ మహానీయుని శతజయంతి సందర్భంగా ఆయన ప్రజా ఉద్యమంలో ఆయన జీవన ప్రస్థానాన్ని కుప్లంగా మననం చేసుకుందాం.

1925 ఫిబ్రవరి23న మధ్యతరగతి కుటుంబంలో ప్రసాదరావు జన్మించారు. చిన్నప్పటి నుంచి అభ్యుదయభావాలు అలవర్చుకున్నారు. వలస పాలకుల నుంచి దేశ విముక్తి కోసం, ఆ తర్వాత దోపిడీదార్ల నుంచి శ్రామిక ప్రజల రక్షణ కోసం ప్రసాదరావు జైళ్లు, అజ్ఞాతవాసాలు, కుటుంబ ఇబ్బందులు ఎన్ని ఎదురైనా లెక్కచేయకుండా సిద్ధాంతమే వేదాంతంగా అకుంఠిత దీక్షతో ఆదర్శప్రాయమైన జీవితాన్ని గడిపారు. విద్యాభ్యాసం పూర్తి అయిన తర్వాత ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నప్పుడు కమ్యూనిస్టులతో సంబంధాలు ఏర్పాడ్డాయి. స్వాతంత్ర్యోద్యమ ప్రభావంతో ఉపాధ్యాయ వృత్తిని వదిలిపెట్టి స్వాతంత్ర్య సమరాంగణంలోకి దూకారు. స్వాతంత్ర్య పోరాటం సందర్భంగా అనేకసార్లు రహస్య జీవితం గడిపారు. 8మంది సంతానం ఉన్నా లెక్కచేయకుండా పోరాటబాటలో సాగిపోయారు. దక్షిణభారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతల్లో ఒకరైన పుచ్చలపల్లి సుందరయ్యతో కలిసి అనేక సంవత్సరాలు జైలు జీవితం గడిపారు. కాన్సన్‌ట్రేషన్ కేంప్‌లో ఉన్నప్పుడు ఆయనను తీవ్రంగా హింసించి, ప్రాణాలు తీసేందుకు సిద్ధమైనప్పటికీ లెక్కచేయలేదు. కోనాడ సూర్యప్రకాశరావును ప్రసాదరావు భార్య పుష్పరాగం కలిసి పరిస్థితిని వివరించగా, ఆయన రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌కు పరిస్థితిని వివరించడంతో ఉన్నతాధికారులు, కలెక్టర్‌తో అంబేద్కర్ మాట్లాడి 24 గంటల్లో ప్రసాదరావును ప్రవేశపెట్టాలని ఆదేశించారు. దానితో వంటినిండా తీవ్ర గాయాలతో ఉన్న ప్రసాదరావును అధికారులు ఇంటి దగ్గరకు తీసుకువచ్చి పడేసివెళ్లిపోయారు. ఈ విధంగా అంబేద్కర్ జోక్యంతో ఆయన ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా ప్రజల సమస్యల పరిష్కారానికి విశేషంగా కృషి చేశారు. సర్పంచ్‌గా బందారు గూడెం గ్రామాన్ని అభివృద్ధి పథంలో పయనింపచేశారు. బడుగు, బలహీనవర్గాల ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకునిగా అనేక పోరాటాలు నిర్వహించారు. తగిన కూలి, భూములు దక్కేవిధంగా కృషి చేశారు. బహుజనులకు కూడా అధికారం దక్కాలని పరితపించారు. కమ్యూనిస్టు పార్టీలో ఉంటూనే అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. ఎన్నికలలో జనరల్ స్థానాలలో కూడా దళితులను పోటీకి నిలిపిన అభ్యుదయవాది. ఎన్నడు తనకు పదవుల కోసం ఆశించలేదు. బడుగుల అభ్యున్నతే తన అభ్యున్నతికి భావించి నిఖార్సైన కమ్యూనిస్టుగా ప్రసాదరావు నిలిచారు. కమ్యూనిస్టు పార్టీలో చీలిక తర్వాత కొంత కాలం సీపీఎంలో ఉన్నారు. అనంతరం కాంగ్రెస్‌లోకి వెళ్లారు. కాంగ్రెస్‌లో చేరిన తర్వాత పదవులు ఇస్తామని ప్రతిపాదించినా సున్నితంగా తిరస్కరించి బడుగు జీవులకు వాటిని ఇప్పించారు. కాంగ్రెస్‌లో ఉంటూనే పేద ప్రజల కాంగ్రెస్ అనే విభాగాన్ని ఏర్పాటు చేసి పేదల అభ్యున్నతికి పాటుపడ్డారు. కార్మికనాయకుడిగా, ఉపాధ్యాయ సంఘం నేతగా ఆయా వర్గాల సమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేశారు. ప్రసాదరావుకు భార్య పుష్పరాగం అన్ని విధాల సహాయ సహకారాలను అందించారు.

భర్త ప్రజా ఉద్యమాలలో తీరికలేకుండా ఉంటే పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చదిద్దడంలో ఆమె పాత్ర ఎనలేనిది. వారి కుమారులు అందరూ ఉన్నతాధికారులుగా పనిచేసినవారే. పిల్లలను జీఎస్టీ అధికారిగా, ఇన్‌కంటాక్స్ కమిషనర్‌గా, ప్రొఫెసర్లుగా, ప్రధానోపాధ్యాయునిగా, వైద్యునిగా తీర్చిదిద్దారు. వారు కూడా తల్లిదండ్రుల బాటలో పయనిస్తూ సమాజానికి తమ వంతు సేవలు అందిస్తున్నారు. ఆయన కోడలు ఉప్పులేటి కల్పన పామర్రు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 2014లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా గ్రామంలో ప్రసాదరావు దంపతుల నిలువెత్తు విగ్రహాలు ఏర్పాటు చేసి వర్థంతి, జయంతికి కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారు. ఆయన మార్గంలో నడవడం, నిబద్ధతతో ప్రజాసేవకు అంకితంకావడమే శతజయంతి సందర్భంగా ప్రసాదరావుకు అర్పించే నిజమైన నివాళి.

యు. తారకప్రసాద్
సెల్:848020623

ఆ నీరు స్నానానికి ప్రమాదం

టి.వి.సుబ్బయ్య

హిమాలయాల మీద సైతం ప్లాస్టిక్ సీసాలు, చిన్న చిన్న ప్లాస్టిక్ సంచులు టూరిస్టుల వల్ల పడిపోయి కాలుష్యం ఏర్పడుతోంది. అన్ని దేశాలలో వలే భారతదేశంలోని నదులన్నీ కలుషితమయ్యాయి. నీటి కాలుష్యంపై ప్రభుత్వ చర్యలు తక్కువే. తాజాగా గంగానదిలో వివిధ ప్రాంతాల్లో కుంభమేళా జరుగుతోంది. ఈ నెల 26 వ తేదీ వరకు మేళా జరుగుతుంది. విదేశీయులతో సహా మన దేశంలోని నలు మూలల నుంచి కోట్లాది మంది గంగలో పవిత్ర స్నానాలు చేశారు. ఇంకా చేస్తున్నారు. చిరకాలంగా మన దేశ ప్రజలకు గల నమ్మకం మేరకు అక్కడ నీళ్లు ఎలా ఉన్నాయి, స్నానం చేయవచ్చా లేదా అనే ఆలోచన ఉండదు. అందువల్ల అక్కడ స్నానానికి వెళ్లేందుకు వెనుకాడరు. ఈ మేళాకే కాదు ఎక్కడ ఇలాంటివి జరిగినా వెళ్లి స్నానం చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణా, గోదావరి పుష్కరాలకు సైతం లక్షలు, కోట్ల మంది నదుల వెంట అనేక చోట్ల పవిత్ర స్నానాలు జరిగాయి. గోదావరి పుష్కరాల సందర్భంగా తొక్కిసలాట జరిగి రాజమండ్రిలో దాదాపు 30 మంది చనిపోయారు. కుంభమేళాలోను ప్రయాగ ప్రాంతంలో వందల మంది మరణించారు.

గంగలో నీరు స్వచ్ఛంగా ఉందని యుపి ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా తదితర బాధ్యులు వాదిస్తున్నారు. గంగ ప్రక్షాళనకు వందలు, వేల కోట్లు కేటాయించినా పెద్ద ఉపయోగం కలగలేదని ప్రభుత్వ నివేదికలే చెప్తున్నాయి. దేశ, రాష్ట్ర పాలికలు మాత్రం నది పరిశు భ్రంగా ఉందని రుజువులతో సహా చెప్పిన వారు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని వారిని ఉపేక్షించేది లేదని యోగి తదితరులు బెదిరిస్తున్నారు. ప్రభుత్వ సంస్థ జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ (జిఎన్‌టి) మాత్రం రుజువులతో నివేదికను ప్రకటించింది. వాస్తవాలను సైతం కాదని బుకాయించడం ఇప్పటి కేంద్ర, రాష్ట్ర పాలకులకు దాదాపు పదకొండు సంవత్సరాలుగా ఉన్న అలవాటు. ఎక్కువ సార్లు గ్రీన్ ట్రిబ్యునల్ నివేదికలు నదులు కలుషితంగా ఉన్నాయని ప్రకటించింది. గంగానది ఎనిమిది, తొమ్మిది రాష్ట్రాల మీదుగా వేయి కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని అంచనా. నదులే కాదు, సముద్రాలు మళ్లీ బాగు చేయలేనంతగా కలుషిత మయ్యాయి. గంగానది కాలుష్యంపై ఎన్.జి.టి 2025 ఫిబ్రవరి 3 వ తేదీన నివేదికను విడుదల చేసింది. త్రివేణి సంగమం వద్ద లక్షలాది మంది పవిత్ర స్నానాలు చేశారు. మహాకుంభ్ సందర్భంగా ప్రతిరోజు గంగలో కోట్లాది మంది మునిగి పూజలు చేశారు. ఇక్కడ నీళ్లలో స్నానం చేయడానికి భద్రతమైనది కాదని జిఎన్‌టి తెలిపింది. నీటిలో ఉండవలసిన బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్ (బిఒడి) కంటే ఎక్కువగా ఉన్నందున నీరు స్నానానికే కాదు, తాగడానికి ఏ మాత్రం పనికి రావు. ప్రభుత్వ సంస్థ జిఎన్‌టి ప్రకారం ఇక్కడి నీళ్లు మానవ వినియోగానికి పనికి రావు. నీటి నాణ్యత పరిశీలించి నిర్ధారించడానికి బిఒడి ఎంతైనా అవసరం. నీటిలో ఆర్గానిక్ పదార్థాన్ని చెదరగొట్టడానికి ఏరోబిక్ మైక్రోనిజమ్స్‌కు అవసరమైన ఆక్సిజన్‌ను బిఒడి అంచనా వేస్తుంది. లీటరుకు 3 గ్రాముల కంటే తక్కువ బిఒడి స్థాయి ఉంటేనే స్నానానికి ఆ నీరు ఉపయోగపడు తుంది. ప్రస్తుతం సంగం వద్ద నీటి స్థాయి పరిమితి కంటే బిఒడి స్థాయి ఎక్కువగా ఉంది. జనవరి 16 న సాయంకాలం 5 గంటలకు లీటరుకు బిఒడి స్థాయి 5.09 మిల్లీ గ్రాములు ఉంది. జనవరి 18 వ తేదీ సాయంకాలం 5 గంటలకు 4.6 మిల్లీ గ్రాములు ఉంది. జనవరి 19 వ తేదీ (బుధవారం) ఉదయం 8గంటలకు బిఒడి 5.29 మిల్లీగ్రాములు ఉందని జిఎన్‌టి నివేదిక ప్రకటించింది.

నీటిలో ఉండవలసిన బయోలాజికల్ ఆక్సిజన్ డిమాండ్ (బిఒడి) కంటే ఎక్కువగా ఉన్నందున నీరు స్నానానికే కాదు, తాగడానికి ఏ మాత్రం పనికి రావు. ప్రభుత్వ సంస్థ జిఎన్‌టి ప్రకారం ఇక్కడి నీళ్లు మానవ వినియోగానికి పనికి రావు. నీటి నాణ్యత పరిశీలించి నిర్ధారించడానికి బిఒడి ఎంతైనా అవసరం. లీటరుకు 3 గ్రాముల కంటే తక్కువ బిఒడి స్థాయి ఉంటేనే స్నానానికి ఆ నీరు ఉపయోగపడు తుంది.

కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు (సిపిసిబి) ప్రకారం, మహాకుంభ్ ప్రారంభమైనప్పుడు సంగం వద్ద బిఒడి స్థాయి జనవరి 13 నీరు లీటరుకు 3.94 మి.గ్రా ఉంది. జనవరి 14 వ తేదీన మకర సంక్రాంతి రోజు లీటరుకు 2.28 మిల్లీగ్రాముల బిఒడి ఉండటం వల్ల ఆ రోజు పరిస్థితి మెరుగ్గా ఉంది. జనవరి 15 బిఒడి ఒక మిల్లీ గ్రాముకు తగ్గి పరిస్థితి మెరుగైంది. జనవరి 24 నాటికి అది 4.08 కి పెరిగింది. మౌని అమావాస్య రోజు జనవరి 29 న 3.26 శాతం మి.గ్రాకు చేరింది. ఫిబ్రవరి 3 వ తేదీన నది నీరు స్నానానికి పనికి రాదని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌కు సిపిసిబి నివేదికలో తెలియజేసింది. జనవరి 12-13 తేదీలలో ప్రయాగరాజ్ పరిసరాల్లో ఎక్కువ ప్రాంతాల్లో స్నానానికి నీళ్లు పనికి రావని తెలియజేసింది. జనవరి 13 వ తేదీన (2025) తర్వాత జనవరి 19 న నాణ్యమైన నీటిని స్నానానికి అర్హమైనదని నిర్ధారించిన తర్వాత గంగానదిపై లార్డ్ కర్జన్ బ్రిడ్జి వద్దకు 10 నుంచి 11 వేల క్యూసెక్కుల మేరకు గంగలోకి విడుదల చేసినట్టు సిపిసిబి నివేదిక తెలిపింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పండిట్ రవిశంకర్ ఐదారేళ్ల క్రితం దిల్లీలోని యమునా నదీతీరంలో దాదాపు వారం రోజుల పాటు యోగా, మెడిటేషన్ ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. నరేంద్రమోదీ ప్రభుత్వం సకల సహాయాలు చేసింది. కొన్ని వందల కోట్లు ఖర్చు చేశారు. దేశ విదేశాల నుంచి వేలాది మంది యోగా, మెడిటేషన్ చేసేవారు హాజరయ్యారు. వారం తిరిగే సరికి వేల టన్నుల చెత్తా చెదారం తయారైంది. అదంతా యమునలో తోశారని పర్యావరణవేత్తలు గోల చేశారు. యమునలో నీరు తాగాననిఒక ముఖ్యమంత్రి చెప్తారు. ఇది నిజమా? ఎన్‌జిటి నివేదికను ముఖ్యమంత్రులు చదవరేమో? స్విట్జర్లాండ్ పునాదిగా ఉండే రైన్ నది మరో నాలుగు దేశాల మీదుగా ప్రవహిస్తుంది. ఈ నదిని బాగుచేయ డానికి 30 ఏళ్ల కాలం పట్టిందని సమాచారం. ఇది ఉండేది 30 కిలోమీటర్లే. గంగ వెయ్యి కిలోమీటర్లు తొమ్మిది రాష్ట్రాల మీదుగా ప్రవహిస్తోంది. ఇంత పొడవైన నదిని చాలా వరకు బాగు చేశామని చెబుతారు. ఇది సాధ్యమేనా! పాలకులు చెప్పేవి అబద్ధాలేనని ప్రజలు పరిగణిస్తే తప్పేమిటి?

మహాశివరాత్రి రోజు ఫిబ్రవరి 26 న మహాకుంభ్ ముగుస్తుంది. త్రివేణి సంగమంలో 54 కోట్ల మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారని చెప్తున్నారు. త్రివేణి సంగమం, లేదా గంగ తదితర నదుల్లో నీరు స్నానానికి తగినవి కావని ప్రభుత్వ సంస్థలు ధృవీకరణ నివేదిక విడుదల చేసినప్పటికీ యుపి ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ తమను విమర్శించిన ప్రతిపక్షాలపై చెలరేగిపోవడం ఆయన పదవికి ఎంత మాత్రం తగింది కాదు. తిరునాళ్లు, మహాకుంభ్‌లు, పుష్కరాలు నిర్వహించడం ద్వారా తమ వైపు జనాన్ని మళ్లించుకొని ఓట్లు పొందుదామన్న యావ తప్పితే మరో ఆలోచన ఉండడంలేదు.

అభ్యుదయ సాహిత్య అంతర్జాతీయ నేపథ్యం

ఆర్వీ రామారావ్

ఇరవయ్యవ శతాబ్దం రెండో దశాబ్దమే సంక్షుభితంగా మొదలైంది. 1914 జులై 28న మొదలై 1918 నవంబర్ 11న ముగిసిన మొదటి ప్రపంచ యుద్ధం తీవ్ర ఆర్థిక సంక్షోభాలకూ, సాంస్కృతిక సంక్షోభ ప్రమాదాలకూ సంకేతమైంది. సాంస్కృతిక రంగంలో తలెత్తుతున్న సంక్షోభాన్ని రచయితులు, కళాకారులు పసిగట్టారు. 1919లో మాక్షిం గోర్కీ బర్బ్యూసా, బెర్ట్రండ్ రసల్, ఆప్టన్ సింక్లైర్, స్టీఫెన్ జావన్ ఈ విషమ పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. దాన్నే "డిక్లరేషన్ ఆఫ్ ఇండిపెండెన్స్ ఆఫ్ థాట్" అన్నారు. ఈ ప్రకటనపై భారత రచయితల పక్షాన రవీంద్రనాథ్ ఠాగోర్, వి.కుమార స్వామి సంతకాలు చేశారు.

1930నాటి ఆర్థిక మాంద్యం మొత్తం ప్రపంచాన్నే ప్రభావితం చేసింది. ఈ ప్రభావం సహజంగానే సాంస్కృతిక, కళారంగాల మీద కూడా ఉంది. ఆ ప్రభావం రెండు రకాలుగా కనిపించింది. ఒక పాయ క్షీణ సాహిత్యానికి, కళలకు, నిరర్థక ప్రయోగవాదానికి దారి తీస్తే మరొక పాయ మానవాళి భవిష్యత్తును ప్రభావితం చేసే శక్తి ప్రజలకు ఉందని గుర్తించింది. 1935 ప్రథమార్థంలో పారిస్ లో ప్రపంచ రచయితల సదస్సు జరిగింది. అప్పుడు లండన్ లో విద్యార్థిగా ఉన్న సజ్జాద్ జహీర్ (బన్నే భాయ్) భారత విద్యార్థిగా ఈ సదస్సుకు హాజరయ్యారు. 1930లలో ఇంగ్లాండ్ లో చదువుకుంటున్న సజ్జాద్ జహీర్, ముల్క్ రాజ్ ఆనంద్, అహమద్ అలీ, మహమ్మద్-ఉజ్-జఫర్ వంటి వారు ఆర్థిక మాంద్యం తర్వాత అంతర్జాతీయ రంగంలో వస్తున్న మార్పులను నిశితంగా గమనించేవారు. సమాజ గతి, సాంస్కృతిక రంగంలో వస్తున్న మర్పులను అవగాహన


మాక్షిం గోర్కీ


ఆప్టన్ సింక్లైర్


బెర్ట్రాండ్ రసల్

సజ్జాద్ జహీర్

చేసుకున్నారు. ఫ్రాన్స్, రష్యాలో సాంస్కృతిక రంగంలో వస్తున్న మార్పు వీరిని కుదిపేసింది. దీని ప్రభావంతో లండన్ విద్యార్థులుగా ఉన్న వారు భారత అభ్యుదయ రచయితల సంఘం స్థాపించారు. ఓ నిర్దిష్టమైన ప్రణాళిక రూపొందించారు. ఇది లండన్ నుంచి వెలువడే "లెఫ్ట్ రివ్యూ"లో ప్రచురితమైంది.

లండన్ లోని సజాద్ జహీర్ గదిలో ముల్క్ రాజ్ ఆనంద్, ఎం.డి.తాసీర్, ప్రమోద్ సేన్ గుప్తా, జ్యోతిర్మయ్ ఘోష్ కలుసుకునే వారు. ముల్క్ రాజ్ ఆనంద్, జ్యోతిర్మయ్ ఘోష్ అభ్యుదయ రచయితల సంఘం ప్రణాళిక రూపొందించారు. కమ్యూనిస్ట్ రాల్ఫ్ ఫాక్స్ ఈ బృందాన్ని తరచుగా కలుసుకుంటూ ఉండేవారు. ఆయన స్పెయిన్ అంతర్యుద్ధంలో ఫాసిస్టు వ్యతిరేక పోరాటంలో ప్రాణాలు కోల్పోయారు. అభ్యుదయ రచయితల ప్రణాళికకు సజ్జాద్ జహీర్ మెరుగులు దిద్దారు. 1935లో ఈ ప్రణాళికను రూపొందించారు. వివిధ భాషలు మాట్లాడే ప్రాంతాల్లో కూడా అభ్యుదయ రచయితల సంఘం ఏర్పాటు చేయాలని ఈ మిత్ర బృందం నిర్ణయించింది. భావ సారూప్యతగల రచయితలతో కలిసి పనిచేయాలని, అభ్యుదయ సాహిత్యాన్ని భిన్న భాషల్లోకి అనువదించాలని, హిందుస్థానీని ఉమ్మడి భాషగా అంగీకరించాలని కూడా అనుకున్నారు. రచయితలు తమ రచనలను వెలువరించడానికి సహాయం చేయాలని కూడా అనుకున్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛకు, భావ వ్యక్తీకరణకు పాటు పడాలని కూడా అనుకున్నారు. ఈ సంకల్పమే మన రాజ్యాంగంలో చేరింది.

అభ్యుదయ రచయితల సంఘం ప్రణాళిక చూసి ప్రేం చంద్ ప్రభావితులయ్యారు. తాను నిర్వహిస్తున్న హన్స్ పత్రికలో ఈ ప్రణాళిక ప్రచురించారు. భారత సమాజంలో త్వరితగతిన మార్పులు వస్తున్నాయని, పాత భావాలను, నమ్మకాలను, సామాజిక, రాజకీయ వ్యవస్థలను ప్రజలు సవాలు చేస్తున్నారని నిర్ధారణకు రావడమే కాక ఈ ఘర్షణలోంచే నూతన సమాజం ఉద్భవిస్తుందని ఊహించగలిగారు. "మన సాహిత్యమూ, కళలు ఇంతవరకు కేవలం పండితులు, యాజక భ్రష్ట వర్గాల చేతుల్లో పడి నలుగుతూ వచ్చాయి. వాటిని ఉద్ధరించి ప్రజలకు సన్నిహితం చేసి, జీవిత వాస్తవాలను చిత్రించే సాధనాలుగా, భవిష్యత్తుకు మార్గదర్శకాలుగా మలచడం మన సంఘం ఆశయం" అని లండన్‌లో ఆమోదించిన అభ్యుదయ రచయితల సంఘం ప్రణాళికలో పేర్కొన్నారు. "భారత నాగరికతలోని ఉదాత్త సంప్రదాయాలకు వారసులం అని కూడా ఈ ప్రణాళికలో పేర్కొన్నారు. దేశంలోని తిరోగామి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అంశాలన్నింటినీ సద్విమర్శక, సృజనాత్మక సాహితీ సేద్యం చేయాలి. ఈనాడు ప్రధానంగా ఉన్న ఆకలి, దారిద్ర్యం, సాంఘిక అసమానత, రాజకీయ పరాధీనత లాంటి సమస్యలను అవగతం చేసుకుని మనం కొత్త రచనలు చేయాలి. అప్పుడే మనం సమాజ సమస్యలను అవగతం చేసుకుని కార్యాచరణకు దిగగలుగుతాం" అని లండన్ ప్రణాళిక దిశా నిర్దేశం చేసింది.

మోదీతో ఢిల్లీ సీఎం భేటీ

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా శనివారం ఉదయం ప్రధాని నరేంద్రమోదీతో సమావేశమయ్యారు. కొత్తగా ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టిన ఆమె మర్యాదపూర్వకంగా ప్రధానిని కలిశారని బీజేపీ వర్గాలు తెలిపాయి. ప్రధానితో భేటీ సందర్భంగా మోదీ ఆమెకు కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చినట్లు సమాచారం. అంతకుముందు రేఖా గుప్తా ఢిల్లీ యూనివర్సిటీ పరిధిలో తాను చదువుకున్న కాలేజీకి వెళ్లారు. అక్కడ ప్రిన్సిపల్, విద్యార్థులను కలిసి మాట్లాడారు. ఇక్కడ చదివిన రేఖా గుప్తా మాత్రమే కాదు... మీరంతా కూడా సీఎంలు కావాలని విద్యార్థులతో రేఖా గుప్తా అన్నారు. కాలేజీ ప్రిన్సిపల్ మాట్లాడుతూ రేఖా గుప్తాకు తన ఆశీస్సులు ఉంటాయని చెప్పారు. కాగా ఢిల్లీలో కొత్తగా కొలువుదీరిన బీజేపీ సర్కారు... ఫిబ్రవరి 24 నుంచి మూడు రోజులపాటు అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు నిర్వహించబోతోంది. 24న నూతన అసెంబ్లీ తొలి సమావేశాలు ప్రారంభమవుతాయి. ప్రొటెం స్పీకర్‌ను ఎన్నుకుంటారు. ఆ తర్వాత ప్రొటెం స్పీకర్ కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రమాణస్వీకారాలు చేయిస్తారు. అనంతరం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జరుగుతుంది. ఫిబ్రవరి 25న ఢిల్లీ ప్రభుత్వం అసెంబ్లీలో కాగ్ నివేదిక ప్రవేశపెట్టనుంది. కాగ్ నివేదికపై 25, 27 తేదీల్లో చర్చ జరగనుంది.

మారిషస్ నేషనల్ డేకు మోదీ

న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరిగే మారిషస్ 57వ స్వాతంత్ర్య దినోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ గౌరవ అతిథిగా హాజరవుతారని మారిషస్ ప్రధాని నవీన్ రామ్‌గూలమ్ ప్రకటించారు. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలకు రాబోయే వేడుక సాక్ష్యంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రపంచ అధినేతల్లో మోదీ ఒకరని, బిజీ షెడ్యూల్‌లోనూ ఆయన తమ ఆహ్వానాన్ని అంగీకరించడం గౌరవంగా భావిస్తున్నామని ఆయన వ్యాఖ్యానించారు. 1968 మార్చి 12న బ్రిటిష్ పాలన నుంచి మారిషస్‌కు స్వాతంత్ర్యం దక్కింది. నాటినుంచి మారిషస్ ఏటా మార్చి 12ను నేషనల్ డేగా నిర్వహించుకుంటోంది. కాగా గతేడాది భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మారిషస్ జాతీయ దినోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యూనివర్సిటీ ఆఫ్ మారిషస్ ఆమెకు గౌరవ డాక్టర్ ఆఫ్ సివిల్ లాను ప్రదానం చేసింది.

షెడ్డు కూలి ఐదుగురి మృతి

జాల్నా: మహారాష్ట్ర జాల్నా జిల్లాలో నిర్మాణ స్థలంలో ఉన్న రేకుల షెడ్డు కూలి ఐదుగురు కార్మికులు మృతి చెందారు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. జాల్నా జిల్లా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో జఫ్రాబాద్ తాలూకాలోని చందోల్ రోడ్డులో ఈ ఘటన జరిగింది. ఈ రోడ్డులో ఓ నిర్మాణ స్థలంలో రేకుల షెడ్డు ఉంది. ఆ షెడ్డులో భవన నిర్మాణ కార్మికులు ఆరుగురు నిద్రపోతున్నారు. ఇసుక లోడ్‌ను టిప్పర్ డ్రైవర్ దించుతున్న సమయంలో... ఆ షెడ్డుని బలంగా గుద్దడంతో అది కూలిపోయింది. షెడ్డు కూలిపోవడాన్ని దగ్గరలోని గోశాలలో ఉన్న ఓ మహిళ చూసింది. వెంటనే ఆమె రైతులకు చెప్పడంతో... వారు ఘటనా స్థలానికి చేరుకుని కూలిన రేకులు తొలగించారు. వీరిలో 12 ఏళ్ల అమ్మాయిని రక్షించారు. అయితే ఆరుగురిలో ఉన్న ఐదుగురు నిద్రలోనే కన్నుమూశారని అధికారులు తెలిపారు. చనిపోయిన వారిలో గణేశ్ కాశీనాథ్ ధన్వాయి (50), అతని కుమారుడు భూషణ్ ధన్వాయి(17)గా పోలీసులు గుర్తించారు. ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ వెంటనే అక్కడి నుంచి పారిపోయినట్లు రైతులు తెలిపారు. కాగా, మృతదేహాలను అక్కడి నుంచి తీసుకెళ్లేందుకు పోలీసులు ప్రయత్నించారు. అయితే గ్రామస్తులు మాత్రం పోస్టుమార్టం నిర్వహించాలని పట్టుబట్టారు. దీంతో జఫ్రాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పోలీసు బృందాన్ని ఘటనా స్థలానికి రప్పించి... మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

ఐయూఎంఎల్ నేతతో తృణమూల్ ఎంపీల భేటీ

మలప్పురం (కేరళ): తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) రాజ్యసభ పార్లమెంటరీ పార్టీ నాయకుడు డెరెక్ ఓబ్రియన్, లోక్‌సభ ఎంపీ మహువా మొయిత్రా శనివారం ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐంఎయూఎల్) అధినేత పానక్కాడ్ సాదిక్ అలీ షిహాబ్ తంగల్‌ను ఆయన నివాసంలో కలిశారు. కేరళలో రెండు రోజుల పర్యటన కోసం వచ్చిన టీఎంసీ నాయకులతో పాటు మాజీ ఎమ్మెల్యే పి.వి.అన్వర్ కూడా ఉన్నారు. ఆయన శాసనసభ్యుడిగా రాజీనామా చేసి ఎల్‌డీఎఫ్‌తో సంబంధాలు తెంచుకున్న తర్వాత ప్రస్తుతం పార్టీ కన్వీనర్‌గా ఉన్నారు. వారు వెళ్లిపోయిన తర్వాత, తంగల్ విలేకరులతో మాట్లాడుతూ ఇది 'స్నేహపూర్వక పర్యటన' అని, ఎటువంటి రాజకీయ చర్చలు లేవని అన్నారు. 'వారు ఇప్పటికే ఇండియా ఐక్య సంఘటనలో భాగం. ఎన్నికలు వచ్చినప్పుడు కూటమిని బలోపేతం చేయడం ముఖ్యం.

ఈ విషయంపై మేము యూడీఎఫ్‌లో చర్చలు జరుపుతాం. తదుపరి చర్యలను నిర్ణయిస్తాం' అని ఐయూఎంఎల్ అధినేత చెప్పారు. 'వారు పానక్కాడ్ గురించి విన్నారు. ఇది ఒక చారిత్రక ప్రదేశం అయినందున వారు ఇక్కడికి రావాలనుకున్నారు. జాతీయ రాజకీయాల గురించి సాధారణ స్నేహపూర్వక చర్చ మాత్రమే జరిగింది' అని తంగల్ చెప్పారు. డెరెక్ ఓబ్రియన్ విలేకరులతో మాట్లాడుతూ ఇది 'మర్యాదపూర్వక సందర్శన. రేపటి గురించి మాట్లాడటానికి మరిన్ని ఉంటాయి' అని అన్నారు. అన్వర్ మాట్లాడుతూ రెండు పార్టీల నాయకులకు ఐఎంయూఎల్ గురించి తెలుసునని, పార్లమెంటులో ముస్లిం లీగ్ ఎంపీలతో స్నేహం చేస్తున్నారని చెప్పారు.

లేని శాఖకు 20 నెలలుగా మంత్రి

చండీగఢ్: ఉనికిలో లేని ఒక శాఖకు పంజాబ్‌లో ఓ మంత్రి బాధ్యతలు నిర్వహించారు. ఈ విషయాన్ని 20 నెలల తర్వాత పంజాబ్ ప్రభుత్వం గుర్తించింది. దానిని సవరించేందుకు ఇచ్చిన ఒక గెజిట్ నోటిఫికేషన్ ద్వారా ఈ విషయం వెల్లడైంది. దీనిపై బీజేపీ తీవ్ర విమర్శలు గుప్పించింది. 2022 మార్చిలో పంజాబ్‌లో భగవంత్ మాన్ నేతృత్వంలో ఆప్ ప్రభుత్వం ఏర్పడింది. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో భాగంగా 2023 మేలో కుల్దీప్‌సింగ్ ధలివాల్‌కు రెండు శాఖలు కేటాయించింది. ఎన్‌ఆర్‌ఐ వ్యవహారాలు, అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ డిపార్ట్‌మెంట్ బాధ్యతలు అప్పగించింది. 2024లో చివరిలో మరోసారి పునర్వ్యవస్థీకరణ జరిగింది. ఆ మేరకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తాజాగా దానిని సవరించింది. కుల్దీప్‌సింగ్‌కు కేటాయించిన అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ శాఖ ఉనికి లేకపోవడం వల్ల సెప్టెంబర్‌లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో మార్పులు చేస్తున్నట్లు అందులో పేర్కొంది. దీనిపై బీజేపీ స్పందిస్తూ 'పంజాబ్‌లో పాలనను ఆప్ ఒక జోక్‌గా మార్చింది. ఉనికిలో లేని శాఖకు 20 నెలలుగా ఆ మంత్రి బాధ్యతలు నిర్వర్తించారు. అలాంటి ఒక శాఖను తన మంత్రి నిర్వహిస్తున్నారనే విషయం సీఎంకు తెలియదంటే పరిస్థితి ఎలా ఉందో ఆలోచించుకోండి' అని మండిపడింది.

రాజస్థాన్ సీఎంను చంపేస్తా

జైలు నుంచి కంట్రోల్ రూమ్‌కు ఖైదీ ఫోన్

జైపూర్: రాజస్థాన్ సీఎం భజన్ లాల్ శర్మను చంపేస్తానంటూ దౌసా జైలులో ఉన్న ఓ ఖైదీ ఫోన్ ద్వారా బెదిరించాడు.

అప్రమత్తమైన పోలీసులు దీనిపై దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉండగా... రింకు అనే వ్యక్తి వివిధ కేసుల్లో ఖైదీగా దౌసా జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అయితే, అతడు జైలు నుంచి శుక్రవారం కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేశాడు. సీఎంను చంపేస్తానంటూ బెదిరింపులకు పాల్పడినట్లు రాష్ట్ర హోంమంత్రి జవహర్ సింగ్ బేఢమ్ తెలిపారు. అప్రమత్తమైన పోలీసులు దీనిపై దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించారు. జైల్లో ఉన్న అతడికి ఫోన్ ఎలా వచ్చిందనే దానిపై ఆరా తీస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనలో జైలులో మరో అధికారి ప్రమేయం ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు పేర్కొన్నారు.

ముదురుతున్న భాషా వివాదం

తమిళానికి రూ.74 కోట్లు...సంస్కృతానికి రూ.1488 కోట్లా?

కేంద్రంపై స్టాలిన్ మండిపాటు

చెన్నై: జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ)లో భాగంగా త్రి భాషా విధానం అమలుపై కేంద్రం, తమిళనాడు సర్కార్ మధ్య తీవ్రస్థాయిలో వివాదం చెలరేగుతోంది. హిందీ భాషను బలవంతంగా తమపై రుద్దే ప్రయత్నం చేస్తున్నారని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ కేంద్రంపై విరుచుకుపడుతున్నారు. ఎన్‌ఈపీ అమలు చేస్తే తమ రాష్ట్రం 2000 ఏళ్లు తిరోగమనం చెందుతుందని అన్నారు. దీనిని పాపం అంటూ పిలిచారు. కేంద్రం రూ.10 వేల కోట్లు ఇచ్చినా తమిళనాడు ఈ విధానాన్ని అంగీకరించదని స్పష్టంచేశారు. త్రిభాషా విధానం ద్వారా హిందీని తమ రాష్ట్రంలో అమలు పరిచేందుకు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రయత్నిస్తున్నారని అంతకుముందు స్టాలిన్ విమర్శించారు. తాజాగా మరోసారి కేంద్రాన్ని లక్ష్యం చేసుకుంటూ విమర్శలు గుప్పించారు. కడలూరులో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ 8 కోట్ల మంది మాట్లాడే తమిళ భాషాభివృద్ధికి కేవలం రూ.74 కోట్లు మాత్రమే కేటాయించారని, వేల మందికి మాత్రమే పరిమితమైన సంస్కృతానికి రూ.1,488 కోట్లు కేటాయించారని మోదీ సర్కారుపై ధ్వజమెత్తారు. కేంద్రం తమిళభాష, సంస్కృతిని ప్రోత్సహిస్తున్నామని చెబుతూ సంస్కృతాన్ని ఎక్కువగా ప్రోత్సహిస్తోందని స్టాలిన్ ఆరోపించారు. ఎన్‌ఈపీ అమలుపై కేంద్రం, తమిళనాడు మధ్య విభేదాలు ఉన్నాయి. కీలక పథకాలకు నిధులు నిలిపేసిందని కేంద్రంపై డీఎంకే ప్రభుత్వం ఆరోపించింది. మరోవైపు సీఎం తనయుడు, డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ తమిళనాడు తమిళం, ఇంగ్లీష్ భాషల 'రెండు భాషల విధానాన్ని' మాత్రమే అనుసరిస్తుందని తేల్చిచెప్పారు. నటుడు-రాజకీయ నాయకుడు కమల్ హాసన్ కూడా భాషా వివాదంలో చేరారు.

'ఒక భాష కోసం తమిళులు ప్రాణాలు కోల్పోయారు. వాటితో ఆడుకోకండి. తమిళులకు, పిల్లలకు కూడా ఏ భాష అవసరమో తెలుసు. వారికి ఏ భాష కావాలో ఎంచుకునే జ్ఞానం వారికి ఉంది' అని శుక్రవారం తన మక్కల్ నీది మైయం (ఎంఎన్ఎం) పార్టీ 8వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా కమల్‌హాసన్ అన్నారు.

ట్రంప్, మస్క్‌లను విశ్వసించలేం

బృందా కారత్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఎలాన్ మస్క్ వ్యాఖ్యలను విశ్వసించలేమని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ వ్యాఖ్యానించారు. భారత్‌లో ఓటు శాతం పెంచేందుకు యూఎస్‌ఎయిడ్ 21 మిలియన్ల డాలర్లు అందించిందంటూ ట్రంప్, ఎలన్ మస్క్ అసంబద్ధ వ్యాఖ్యలు చేశారని అన్నారు. గత ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకునేందుకు బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ నేతలు ఈ వ్యాఖ్యలను వినియోగిస్తున్నారని అన్నారు. అసలు ట్రంప్, ఎలాన్ మస్క్‌లను విశ్వసించలేమని, వాస్తవాలు, ఆధారాలతో సంబంధం లేకుండా వారు ప్రకటనలు చేస్తారని అన్నారు. వారిని విశ్వసించకూడదని, వాస్తవాల కోసం దర్యాప్తు చేయాలని అన్నారు. భారత ప్రభుత్వం ఈ వ్యాఖ్యలను ఖండించకుండా ఎందుకు ఉదాసీనంగా వ్యవహరిస్తుందని ఆమె ప్రశ్నించారు. అటువంటి నగదు ఏదీ అందలేదని మాజీ ఎన్నికల కమిషనర్ ఖురేషీ చాలా స్పష్టంగా, కచ్చితంగా చెప్పారని, కానీ భారత ప్రభుత్వం ఆయనకు మద్దతు ఇవ్వలేదని అన్నారు. బీజేపీ, ఆర్‌ఎస్ఎస్ వంటి విషసంస్థలు గత ప్రభుత్వాలను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, ప్రపంచం ముందు భారత్‌ను ఎలా చూపించాలనుకుంటున్నాయని ప్రశ్నించారు. భారత దేశ ప్రతిష్ఠ గురించి మోదీ ప్రభుత్వం బాధపడటం లేదని అన్నారు. మోదీ ప్రభుత్వం ఈ వ్యాఖ్యలను వెంటనే ఖండించాలని డిమాండ్ చేశారు.

లంచం ఇస్తేనే భోజనం

ఉగాండా జైలు కష్టాలు వెల్లడించిన వసుంధర ఓస్వాల్

న్యూఢిల్లీ: స్విట్జర్లాండ్‌లో ప్రముఖ వ్యాపారవేత్తగా పేరు గడించిన భారత సంతతికి చెందిన పంకజ్ ఓస్వాల్ కుమార్తె వసుంధర గతేడాది అక్టోబరులో ఉగాండాలో అరెస్టయ్యారు. కిడ్నాప్, హత్య అభియోగాలపై ఆమెను అరెస్టు చేసిన పోలీసులు కొన్నాళ్లు నిర్బంధంలో ఉంచారు. ఆ సమయంలో పోలీసులు తనతో చాలా దారుణంగా వ్యవహరించారని వసుంధర వెల్లడించారు. లంచం ఇస్తేనే తనకు ఆహారం, నీళ్లు ఇచ్చారని ఆరోపించారు. ఈ ఘటన జరిగిన నాలుగు నెలల తర్వాత తాజాగా ఆమె మీడియాతో మాట్లాడారు. 'ఆ రోజు పోలీసులు మా ఇంటికి వచ్చి వారెంట్ లేకుండా సోదాలు చేశారు. సెర్చ్ వారెంట్ అడిగితే ఇది యూరప్ కాదని ఇష్టానుసారం మాట్లాడారు. ఇంటర్‌పోల్ డైరెక్టర్‌ను కలవాలంటూ బలవంతంగా నన్ను బయటకు తీసుకొచ్చారు. ఓ పురుష అధికారి నన్ను లాక్కెళ్లి వ్యాన్‌లో పడేశారు. ఆ తర్వాత ఐదు రోజులు నిర్బంధించారు. మరో రెండు వారాలు జైలుకు పంపించారు. ఆ సమయంలో నా ప్రాథమిక హక్కులకు తీవ్రంగా భంగం కలిగించారు. స్నానం చేయనివ్వలేదు. తిండి పెట్టలేదు. కనీసం నీళ్లు కూడా ఇవ్వలేదు. నాకు భోజనం, ఇతర కనీస సౌకర్యాలు కల్పించేందుకు నా తల్లిదండ్రులు పోలీసులకు లంచం ఇవ్వాల్సి వచ్చింది. ఒక దశలో నన్ను వాష్‌రూమ్‌కు కూడా వెళ్లనివ్వలేదు. క్రిమినల్ లాయర్‌ను అనుమతించకుండానే బలవంతంగా నాతో వాంగ్మూలం రాయించుకున్నారు. హత్యలు, మానవ అక్రమ రవాణా వంటి కేసుల్లో నేరాలు చేసిన వారితో కలిపి జైలు గదిలో ఉంచారు. చనిపోయాడనుకున్న వ్యక్తి బతికే ఉన్నాడని తెలిసినా నన్ను జైల్లోనే ఉంచారు. ఎన్నో ప్రయత్నాల తర్వాత చివరకు బెయిల్ లభించింది' అని వసుంధర ఓస్వాల్ నాటి ఘటనలను గుర్తుచేసుకున్నారు.

అసలు కేసు ఏమిటంటే...రాజస్థాన్‌కు చెందిన ముకేశ్ మేనరియాకు పంకజ్ ఓస్వాల్ కుటుంబం ఉద్యోగం ఇచ్చింది. అతను వారి ప్రైవేటు జెట్‌కు క్యాబిన్ సిబ్బందిగా పనిచేశాడు. తర్వాత వివిధ ప్రాంతాల్లోని వారి ఇళ్లకు సంబంధించిన వ్యవహారాలు చూసుకునేవాడు. అయితే 2023లో ఆ కుటుంబానికి, అతడికి మధ్య విభేదాలు తలెత్తడంతో ఉద్యోగం మానేశాడు. కొన్నాళ్లకు అతడు కన్పించకుండా పోవడంతో ముకేశ్‌ను కిడ్నాప్ చేసి, హత్య చేశారన్న ఆరోపణలపై గతేడాది అక్టోబరు 1న వసుంధర ఓస్వాల్‌ను పోలీసులు అరెస్టు చేశారు. కొన్ని రోజులకు ముకేశ్ ఆచూకీ టాంజానియాలో లభించడంతో అదే నెల 21న ఆమెకు బెయిల్ లభించింది. గత డిసెంబరు 19న వసుంధరపై కేసును కోర్టు కొట్టేసింది.

ఢిల్లీ మహిళలకు బీజేపీ మోసం: ఆతిశీ

న్యూఢిల్లీ: ఎన్నికల హామీ ఏమైందంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాను ఆప్‌నేత, మాజీ సీఎం ఆతిశీ ప్రశ్నించారు. ఈ అంశంపై చర్చించేందుకు తనకు అవకాశమివ్వాలంటూ శనివారం ఆమె ఢిల్లీ సిఎంకు లేఖ రాశారు. గురువారం నిర్వహించిన తొలి కేబినెట్ సమావేశంలో మహిళల కోసం వాగ్దానం చేసిన ఆర్థిక సహాయ పథకాన్ని ఆమోదించడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఢిల్లీలోని మహిళలకు నెలకు రూ.2,500 అందించే పథకం అమలుపై చర్చించేందుకు ఆదివారం రేఖాగుప్తాను కలిసేందుకు తనకు సమయమివ్వాలని లేఖలో కోరారు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు ముందుగా మీకు హృదయపూర్వక అభినందనలు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి కేబినెట్ సమావేశంలో ఢిల్లీలోని తల్లులు, సోదరీమణులకు నెలకు రూ.2,500 ఇచ్చే పథకాన్ని ఆమోదిస్తామని ప్రధాని మోదీ ఈ ఏడాది జనవరి 31న నిర్వహించిన ర్యాలీలో హామీ ఇచ్చారు. ఇది మోదీ హామీ అని స్పష్టం చేశారని అన్నారు. బీజేపీ నేతృత్వంలో ఢిల్లీ ప్రభుత్వం ఫిబ్రవరి 20న తొలి కేబినెట్ సమావేశం నిర్వహించిందని, అయితే ఈ పథకం ఆమోదం పొందలేదని అన్నారు. ఢిల్లీలోని తల్లులు, సోదరీమణులు ప్రధానిని విశ్వసించి... మోసపోయామని భావిస్తున్నారని అన్నారు. మహిళల సమస్యలను పరిష్కరించడానికి, ఈ పథకంపై చర్యలు తీసుకోవడానికి ఆదివారం ఆప్ ప్రతినిధి బృందంతో పాటు తాను సమావేశం కావాలని కోరుకుంటున్నట్లు ఆతిశీ పేర్కొన్నారు.

జీఎస్టీ అధికారి ఇంట్లో మిస్టరీ మరణాలు

తిరువనంతపురం: కేంద్ర ప్రభుత్వంలో ఉన్నతహోదాలో ఉన్న ఓ అధికారి ఇంట్లో మరణాలు మిస్టరీగా మారాయి. ఆయనతో పాటు తల్లి, సోదరి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. కేరళలో జరిగిన ఈ ఘటన సంచలనంగా మారింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం మనీశ్ విజయ్ కొచ్చిలో సెంట్రల్ ఎక్సైజ్ అండ్ జీఎస్టీ విభాగంలో అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల ఆఫీసుకు నాలుగు రోజులు సెలవు పెట్టారు. అవి పూర్తయిన తర్వాత ఆయన తిరిగి విధుల్లోకి రాలేదు. దాంతో మనీశ్‌ను కలిసేందుకు స్నేహితులు ఎర్నాకుళం జిల్లాలోని అతని క్వార్టర్స్‌కు వెళ్లి చూశారు. అక్కడికి వెళ్లగానే దుర్వాసన రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి తలుపులు తీయగా మనీశ్ ఒక గదిలో, ఆయన సోదరి షాలిని మరో గదిలో ఉరికి వేలాడుతూ కనిపించారు. వారి తల్లి వేరే గదిలో మంచంపై నిర్జీవంగా కనిపించింది. ఆ మృతదేహాన్ని తెల్లని వస్త్రంలో చుట్టి పూలు చల్లినట్లుగా ఉంది. పక్కనే వీరు ముగ్గురూ దిగిన ఫొటో ఉంది. దీంతో ఈ ఘటన అనుమానాలకు దారితీసింది. ఆమె ముందే చనిపోయి ఉండొచ్చని, లేకపోతే ముందే చంపేసి, వీరు ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. కొద్దిరోజుల క్రితమే వారు మృతి చెందినట్లు కొచ్చి పోలీస్ కమిషనర్ మీడియాకు వెల్లడించారు. ఫోరెన్సిక్ పరీక్ష తర్వాత ఈ మరణాలకు గల కారణాలు తెలుస్తాయన్నారు. ఒక గదిలో డైరీని గుర్తించారు. విదేశాల్లో ఉన్న సోదరికి తమ మరణం గురించి సమాచారం ఇవ్వాలని, ఇంట్లో ఉన్న అన్ని పత్రాలను ఆమెకు అందించాలని కేరళ పోలీసులను ఉద్దేశించి అందులో పేర్కొన్నట్లు సమాచారం. మనీశ్ కుటుంబం స్వరాష్ట్రం జార్ఖండ్. ఆయన గతంలో కోజికోడ్ ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్స్ విభాగంలో పనిచేశారు. తర్వాత సెంట్రల్ ఎక్సైజ్ అండ్ జీఎస్టీ విభాగానికి బదిలీ అయ్యారు.

కొద్దినెలల నుంచి ఆయనతో పాటు తల్లి, సోదరి కూడా ఉంటున్నారు. ఇక షాలిని జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షల్లో తొలిర్యాంకు సాధించారు. ఆ పరీక్షల్లో జరిగిన అవకతవకలకు సంబంధించిన కేసును సీబీఐ విచారిస్తోంది. ఈ కేసులో ఆమె నిందితురాలిగా ఉన్నారు. దీంతో మనస్తాపానికి గురై వీరి కుటుంబం ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవల మనీశ్ సెలవు పెట్టింది కూడా ఆ లీగల్ కేసు పనిమీదే అని తెలుస్తోంది. దీనిపై దర్యాప్తు జరుగుతోందని పోలీసులు తెలిపారు.

మళ్లీ తెరపైకి ఐఏఎస్... ఐపీఎస్ వివాదం

బెంగళూరు: కర్నాటకలో ఐఏఎస్ రోహిణి, ఐపీఎస్ రూపా డి మధ్య సోషల్ మీడియా వేదికగా ప్రారంభమైన రచ్చ గాలివానలా మారింది. ప్రస్తుతం బెంగళూరులో మెజిస్ట్రేట్ కోర్టులో ఈ కేసు విచారణ కొనసాగుతున్న తరుణంలో వీరి వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. కేసు విచారణలో భాగంగా 2021 జనవరి 15 నుంచి 2023 ఫిబ్రవరి 28 వరకూ వీరి మధ్య సంభాషణ భద్రపరిచాల్సిందిగా మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశించింది. ఈ మేరకు భారతి ఎయిర్ టెల్- రిలయన్స్ జియోలకు ఆదేశాలిచ్చింది. తన వ్యక్తిగత ఫొటోలు సోషల్ మీడియాలో పెట్టి పరువుకు భంగం వాటిల్లేలా చేసిన కారణంగా రూ. కోటి నష్టపరిహారం ఇవ్వాలని ఐఏఎస్ రోహిణి పట్టుబడుతోంది. అదే సమయంలో తమ ఇద్దరి మధ్య వివాదానికి సంబంధించి కాల్ డేటా రికార్డు(సీడీఆర్)ను ఒక్కసారి పరిశీలించాల్సిందిగా ఐపీఎస్ రూపా డి... మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ వేశారు. దీనిలో భాగంగా ఈ కేసు విచారణ బెంగళూరు మెజిస్ట్రేట్ కోర్టుకు వచ్చింది. విచారణ చేపట్టిన మెజిస్ట్రేట్ కోర్టు... ఇద్దరి మధ్య జరిగిన సంభాషణకు సంబంధించి కాల్ డేటా రికార్డును భద్రపరచాలని ఇరు టెలికాం సర్వీసులకు ఆదేశాలిచ్చింది. రూపా డి విచారణకు హాజరుకాకుండా జాప్యం చేస్తున్న కారణంగా ఆమెను క్రాస్ ఎగ్జామినేషన్ చేసే ప్రక్రియను నిలిపివేయాలంటూ రోహిణి దాఖలు చేసిన పిటిషన్ ను కోర్టు తిరస్కరించింది. అదే సమయంలో తమ మధ్య చోటు చేసుకున్న వివాదాన్ని కాల్ డేటా ఆధారంగా పరిశీలించాలని రూపా డి కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దాంతో ఈ నెల ఆరంభంలో విచారణ చేపట్టిన బెంగళూరు మెజిస్ట్రేట్ కోర్టు.. తాజాగా వారి మధ్య సాగిన సంభాషణ కాల్ డేటా రికార్డును పొందుపరచాల్సిందిగా ఆయా టెలికాం సంస్థలకు ఆదేశాలిచ్చింది. ఇదిలా ఉండగా, వీరి మధ్య చోటు చేసుకున్న వివాదం సుప్రీంకోర్టు వరకూ వెళ్లింది. వీరి మధ్య పరస్పర అంగీకారం కుదరకపోవడంతో ఆ కేసుపై అప్పటివరకూ కొనసాగిన స్టేను గతేడాది సుప్రీంకోర్టు ఎత్తివేసింది. వీరి మధ్య నాలుగేళ్ల క్రితం మొదలైన వివాదం నేటికి కొనసాగుతూనే ఉంది.

విరిగిన సీటు కేటాయించారు

ఎయిర్ ఇండియాపై కేంద్ర మంత్రి ఆగ్రహం

న్యూఢిల్లీ: ఎయిర్ ఇండియా సేవలపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అసంతృప్తి వ్యక్తపరిచారు. ఇటీవలే భోపాల్ నుంచి ఢిల్లీకి ప్రయాణించగా తనకు విరిగిన సీటు కేటాయించినట్లు చెప్పారు. ప్రయాణికులను ఆ సంస్థ మోసం చేస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను భోపాల్ నుంచి ఢిల్లీ వెళ్లేందుకు దేశీయ విమానయాన సంస్థకు ఎయిర్ ఇండియా లో నంబర్ ఏ1436లో టికెట్ బుక్ చేసుకున్నా. నాకు సీట్ నంబర్ 8 సీ కేటాయించారు. సీటు వద్దకు వెళ్లి చూడగా అది విరిగిపోయి ఉంది. నేను ఆశ్చర్యపోయా. ఈ విషయంపై సిబ్బందిని ప్రశ్నించగా... సమస్యను యాజమాన్యం ఆలస్యంగా గుర్తించినట్లు చెప్పారు. ఈ సీటు టికెట్‌ను ప్రయాణికులకు విక్రయించకూడదని ఆదేశించిందని తెలిపారు. అదొక్క సీటే కాదు విమానంలోని మరికొన్ని సీట్లు కూడా ఇదే విధంగా ఉన్నట్లు సిబ్బంది చెప్పారు. దీని వల్ల చాలా అసౌకర్యం కలిగింది. నా పరిస్థితి చూసి తోటి ప్రయాణికులు తమ సీట్లలో కూర్చోమని ఆఫర్ చేశారు. కానీ వారికి ఇబ్బంది కలిగించడం ఇష్టం లేక నేను అదే విరిగిపోయిన సీట్‌లో దాదాపు గంటన్నర పాటు ప్రయాణించా. ఇలాంటి చర్యలు ప్రయాణికుల్ని మోసం చేయడం కిందకే వస్తాయి. ఎయిర్ ఇండియా నిర్వహణను టాటా గ్రూప్ తీసుకున్న తర్వాత ఎయిర్‌లైన్స్ సేవలు మెరుగుపడతాయని అనుకున్నా... కానీ అది అపోహేనని అర్థమైంది' అంటూ కేంద్ర మంత్రి తనకు ఎదురైన అనుభవాన్ని వెల్లడించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతుండడంతో ఎయిర్ ఇండియా సంస్థ స్పందించి మంత్రికి కలిగిన అసౌకర్యానికి క్షమాపణలు కోరింది.

ఉక్కు రంగానికి దిగుమతుల సెగ

టాటా స్టీల్ సీఈవో నరేంద్రన్

న్యూఢిల్లీ: చౌక ఉక్కు దిగుమతులు వెల్లువెత్తుతుండటం దేశీయంగా పరిశ్రమను దెబ్బతీస్తోందని టాటా స్టీల్ సీఈవో టీవీ నరేంద్రన్ ఆందోళన వ్యక్తం చేశారు. మిగతా మార్కెట్లలో అవకాశాల్లేక ఇతర దేశాల నుంచి స్టీల్ భారత్‌కు మళ్లుతోందని ఆయన చెప్పారు. దీనితో దేశీయంగా ధరలు పడిపోయి... ఉక్కు కంపెనీలు సమస్యలు ఎదుర్కొంటున్నాయన్నారు. భవిష్యత్తులో ఉక్కు పరిశ్రమ పెట్టుబడులపై ఇది ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని నరేంద్రన్ తెలిపారు. చౌక దిగుమతులను కట్టడి చేయాలంటూ ప్రభుత్వానికి పరిశ్రమ విజ్ఞప్తి చేసినట్లు ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్ 69వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన చెప్పారు. కేంద్రం తగు చర్యలు తీసుకుంటుందని పరిశ్రమ ఎదురు చూస్తోందని ఆయన పేర్కొన్నారు. కొన్నేళ్లుగా అత్యధికంగా పెట్టుబడి పెడుతున్న ప్రైవేట్ రంగాల్లో ఉక్కు పరిశ్రమ కూడా ఉందని నరేంద్రన్ చెప్పారు. ప్రస్తుతం ఒక విడత విస్తరణ ప్రణాళికలు పూర్తయినట్లు వివరించారు. అధికారిక గణాంకాల ప్రకారం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జనవరి మధ్య కాలంలో భారత ఉక్కు ఎగుమతులు సుమారు 29 శాతం క్షీణించి 3.99 మిలియన్ టన్నులకు పరిమితయ్యాయి.

గత ఆర్థిక సంవత్సరం ఇదే వ్యవధిలో ఎగుమతులు 5.61 మిలియన్ టన్నులుగా నమోదయ్యాయి. మరోవైపు, ఏప్రిల్-జనవరి మధ్య వ్యవధిలో దిగుమతులు 20 శాతం పెరిగి 8.29 మిలియన్ టన్నులకు చేరాయి.

బీజేపీ హామీలను ప్రజలు నమ్మరు: అఖిలేశ్

లక్నో: సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ శనివారం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2029 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లకు పెంచుతామని ప్రభుత్వం చేస్తున్న వాదనను తీవ్రంగా విమర్శించారు. తమ పనిలో విఫలమైన వారు లక్ష్యం 'సమయ పరిమితి'ని మారుస్తారని అన్నారు. '2021 లో బీజేపీ నాయకులు 2024 నాటికి యూపీ ఆర్థిక వ్యవస్థ ఒక ట్రిలియన్ డాలర్లు (వెయ్యి బిలియన్ డాలర్లు) అవుతుందని చెప్పారు. ఇప్పుడు 2025లో వారు 2029లో యూపీ ఆర్థిక వ్యవస్థ ఒక ట్రిలియన్ డాలర్లుగా మారుతుందని చెబుతున్నారు. ప్రజలు నిన్నటి వాగ్దానాలను నమ్మరు లేదా రేపటి వాదనలను కూడా నమ్మరు' అని 'ఎక్స్' లో ఒక పోస్ట్‌లో ఆయన పేర్కొన్నారు. 'తమ పనిలో విఫలమైన వారు దేశం, రాష్ట్ర భవిష్యత్తును కాదు. లక్ష్యం కాల పరిమితిని మారుస్తారు' అని తెలిపారు. 'అబద్ధాలు బీజేపీకి పర్యాయపదంగా మారాయి. నేటి బీజేపీని ప్రజలు కోరుకోవడం లేదని అంటున్నారు!' అని అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ స్ఫూర్తితో రాష్ట్రం ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారే దిశగా పయనిస్తోందని ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ శుక్రవారం అసెంబ్లీలో అన్నారు.

విశాలాంధ్ర హైదరాబాద్

టాటా సంస్థ పాఠశాల భవనాల నిర్మాణం అభినందనీయం

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా టాటా సంస్థ అద్భుతమైన భవనాలు నిర్మించి అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. శనివారం సుల్తాన్ బజారులో టాటా సంస్థ ఆధ్వర్యంలో నూతన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని టిసిఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్న, క్లస్టర్ హెడ్ శ్రీరంగ్ దావ్లేతో కలసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టాటా సంస్థ హైదరాబాద్ నగరంలో పాఠశాల భవనాలు నిర్మాణాలు చేపట్టి అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ పాఠశాలలో మాజీ రాష్ట్రపతి డా.జాకీర్ హుస్సేన్, మాజీ ముఖ్యమంత్రులు చెన్నారెడ్డి, అంజయ్య, మాజీ ఎం.పి కేశవరావు మరెందరో పారిశ్రామిక వేత్తలు, వైద్యులు అలాగే ఉన్నత అధికారులు తదితరులను అందించిన పాఠశాలకు గొప్ప పేరు ఉన్నదని అన్నారు. టాటా సంస్థ పాఠశాల నిర్మాణంలో ఎక్కడ కూడా రాజీ పడకుండా రెండంతస్తులలో పాఠశాల గదులతో పాటు సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, బాల, బాలికల డైనింగ్ హల్స్, కాన్ఫరెన్స్ హల్, మౌలిక సదుపాయాలు కల్పించి అద్భుతంగా చేపట్టడం సంతోషదాయకమని అన్నారు. టాటా సంస్థ దేశాన్ని ఐ.టి, పారిశ్రామిక రంగాల్లో ఎన్నో సేవలందిస్తుందని యువతకు ఉద్యోగ, ఉపాధి రంగాలలో ఎన్నో అవకాశాలు కల్పిస్తుందని అన్నారు. ప్రతి విద్యార్థి భవిష్యత్తూ దేశ భవిష్యత్తేనని విద్య తోడుంటే జీవితంలో విజయం తథ్యమని పట్టుదలతో చదవాలని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకోని ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం టిసిఎస్ ప్రెసిడెంట్ వి.రాజన్న మాట్లాడుతూ సుల్తాన్ బజారు బాలికల ఉన్నత పాఠశాల భవన నిర్మాణంలో ఎక్కడకూడా రాజీ పడకుండా నాణ్యతా ప్రమాణాలతో చేపట్టామని అన్నారు.

పేద పిల్లల విద్యా వికాసంలో టాటా సంస్థ ముందుంటుందని ప్రతి విద్యార్థి తను అనుకున్న లక్ష్యాన్ని చేరుకొని దేశానికి మెరుగైన సేవలందించాలని, ఇక్కడ చదివిన విద్యార్థులకు టిసిఎస్‌లో అవకాశాలు పొందాలని పేర్కొన్నారు. తదుపరి టిసిఎస్ ప్రతినిధులతో కలసి పాఠశాలోని తరగతి గదులు, సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, డైనింగ్ హల్స్ తదితర బ్లాక్‌లను పరిశీలించారు. తదుపరి టిసిఎస్ ప్రతినిధులు భవన డాక్యుమెంట్స్ జిల్లా కలెక్టర్‌కి అందచేశారు. అనంతరం విద్యార్థులచే ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డిఈఓ శ్రీనివాస రెడ్డి, హెచ్.ఎం ఆదిత్య వర్ధన్ రాజు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు సేఫ్టీ కిట్స్ అందజేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ (టీజీహెచ్‌ఎంఈయు) ఆధ్వర్యంలో జిహెచ్‌ఎంసి కమిషనర్, అడిషనల్ కమిషనర్ పంజును కలిసి ఆయా విభాగాల్లో పని చేస్తున్న సిబ్బందికి భద్రతా పరికరాలు అందజేయాలని శనివారం వినతిపత్రాన్ని అందజేశారు. జిహెచ్‌ఎంసిలో ఔట్‌సోర్సింగ్ విధానంలో శానిటేషన్, ఎంటమాలజీ, వెటర్నరి, హౌస్ కీపింగ్, హార్టికల్చర్, స్పోర్ట్స్ తదితర విభాగాలలో పని చేస్తున్నటువంటి కార్మికులకు సేఫ్టీ కిట్స్ ఇంత వరకు ఇవ్వలేదని, జిహెచ్‌ఎంసి సేఫ్టికెట్స్ ఇవ్వడంలో నిర్లక్ష్యం చేస్తున్నందున తమరు చొరవ తీసుకొని వీలైనంత తొందరగా కార్మికులకు సేఫ్టీ కిట్స్ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి మౌలానా ఆజాద్ కృషి ఎనలేనిది

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత ప్రథమ విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ దేశంలో విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని మహబూబ్‌నగర్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం చైర్మన్ మహ్మద్ ఫయాజ్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలానా ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నర్సింహారెడ్డి మాట్లాడుతూ అబుల్ కలామ్ ఆజాద్ ప్రవేశ పెట్టిన విద్యా రంగ సంస్కరణలు చాలా గొప్పవని అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం చైర్మన్ మహ్మద్ ఫయాజ్ మాట్లాడుతూ దేశంలో అనేక విద్యాసంస్థల రూపకల్పనలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ తన వంతు పాత్ర పోషించారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మీడియా సెల్ కన్వీనర్ సీజే బెనహర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మహ్మద్ అవేజ్ అహ్మద్, నాయకులు ఫక్రుద్దీన్ ఖురేషి, మహ్మద్ జఫీర్, పీర్ సాధిక్, షాఫైసల్, మహ్మద్ అక్బర్, మహ్మద్ ఫహీం, జమీల్, రఫీ, వహీద్, సునీల్, సుధాకర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రాంచంద్ర, మొయిజ్, బాసిత్, అలీ, అలీం, నయీమ్, అబుబకర్, ఖాదర్, అష తదితరులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ కేంద్రాల పునరుద్ధరణకు చర్యలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : కనీస వసతుల పరిశీలన, భోజన పరిస్థితి పరిశీలించేందుకు జీహెచ్‌ఎంసీ కమిషనర్ ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసారు. ఇట్టి కమిటీలో జిహెచ్‌ఎంసి చీఫ్ ఇంజనీర్ భాస్కర్‌రెడ్డి హెడ్‌గా, అడిషనల్ కమీషనర్లు పంకజ (హెల్త్), వేణుగోపాల్ రెడ్డి (అడ్వర్టైజ్మెంట్) సభ్యులుగా నియమించారు. కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కమిటీ సెక్రటేరియట్ వెనుక భాగంలో మింట్ కాంపౌండ్ లక్డికాపూల్ వద్ద శనివారం అన్నపూర్ణ కేంద్రాలను సందర్శించి అక్కడ ఉన్న కనీస వసతులు భోజన పరిమాణం నాణ్యతను పరిశీలించారు. అన్నపూర్ణ కేంద్రాలు నిరుపేదలకు ఉపయోగపడే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్న నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం మేరకు జిహెచ్‌ఎంసి వ్యాప్తంగా ఉన్న రూ.5లకే అన్నపూర్ణ భోజనం నిరుపేదలకు వర ప్రసాదంగా మారిందని భావించిన రాష్ట్ర ప్రభుత్వం అన్నపూర్ణ కేంద్రాల ఆధునీకరణకు చర్యలు చేపట్టింది. కనీస వసతులతో పాటు పౌష్టికాహారం అందించేందుకు జిహెచ్‌ఎంసి ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు తాను కమిటీ సభ్యులు శనివారం మింట్ కాంపౌండ్, లక్డికాపూల్ సమీపంలోని అన్నపూర్ణ క్యాంటీన్ల స్థితి, ఆహార నాణ్యత ను తెలుసుకోవడానికి అకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. లక్డికాపూల్ వద్ద గల అన్నపూర్ణ క్యాంటీన్‌లో భోజనం చేసి నాణ్యత బాగుందని సంతృప్తిని వ్యక్తం చేశారు. క్యాంటీన్ల పరిస్థితిని పరిశీలించి, రెండు ప్రదేశాలలో మరమ్మతులు చేపట్టాలని కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. జీహెచ్‌ఎంసీ ప్రాంతంలోని వివిధ ప్రదేశాలలో క్యాంటీన్ల స్థితిని నివేదించడానికి కమిటీ ఇంజనీర్ల బృందాన్ని నియమిస్తున్నట్లు వివరించారు.

కాలుష్య నియంత్రణపై క్విజ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సహకారంతో ఎలాన్ అండ్ ఎన్‌విజన్, ఐఐటి, కాలుష్య నియంత్రణపై క్విజ్‌ను నిర్వహించింది. ప్రపంచ వ్యాప్తంగా పెరిగిపోతున్న కాలుష్యంపై అవగాహన కల్పించడానికి, కాలుష్య ముప్పును అరికట్టడానికి క్విజ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాజెక్ట్ అధికారి బోదా నాగేశ్వరరావు హాజరయ్యారు. క్విజ్‌కు ముందు పాల్గొన్న వారితో పాటు నిర్వాహక బృందం ప్రతిజ్ఞను చేశారు. పర్యావరణాన్ని కాపాడండి, ఇ-వేస్ట్ మేనేజ్‌మెంట్, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై ఆయన అవగాన కల్పించారు. దీనిలో భాగంగా నిర్వహించిన క్విజ్ 3 రౌండ్‌లను చేపట్టారు.

రైతులకు అండగా ప్రభుత్వం : ఎమ్మెల్యే

20 మంది రైతులకు సబ్సిడీ ద్వారా ట్రాన్స్‌ఫార్మర్‌లు పంపిణీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్ నగర్ పట్టణంలోని విద్యుత్ భవన్ వద్ద వ్యవసాయ అవసరాలకోసం 20 మంది రైతులకు సబ్సిడీ ద్వారా ట్రాన్స్ఫార్మర్‌లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని రైతులు వేసిన పంటలు ఎండిపోరాదనే ఉద్దేశంతో తాను ప్రత్యేక శ్రద్ధ వహించి, విద్యుత్ అధికారులతో మాట్లాడి ట్రాన్స్ఫార్మర్‌లను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేశామని, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి అనేక పథకాలను అమలు చేస్తున్నామని ఆయన గుర్తు చేశారు. వ్యవసాయం అంటే దండుగ కాదు, పండుగ అని భావించే ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని ఆయన స్పష్టం చేశారు. రైతు క్షేమంగా ఉంటేనే రాజ్యం సుభిక్షంగా ఉంటుందని నమ్మిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆయన స్పష్టం చేశారు. ఈరోజు 20 మంది రైతులకు ట్రాన్స్ఫార్మర్‌లు పంపిణీ చేస్తున్నామని త్వరలో మరికొందరికి ట్రాన్స్ఫార్మర్‌లు పంపిణీ చేస్తాం అని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రైతులకు గృహ అవసరాలకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు హన్వాడ మండలంలోని గొండ్యాలలో 132 కెవి సబ్ స్టేషన్ మంజూరు చేయించుకోవడం జరిగిందని, ఆరు 33/11 కెవి సబ్‌స్టేషన్లు మంజూరు చేసుకున్నామని ఆయన తెలిపారు. ఎస్ ఈ.పివి రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వేంకటాద్రి, ఓబిసి సెల్ రాజు గౌడ్, మహబూబ్‌నగర్ మండలం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, శ్రీనివాస్ యాదవ్, బుద్దారం సుధాకర్ రెడ్డి, సిరిగిరి మురళీధర్, పోతన్ పల్లి మోహన్ రెడ్డి, ధర్మపూర్ నర్సింహారెడ్డి, అనుప ఆంజనేయులు, రామస్వామి, బొట్టు శ్రీను, యాదన్న యాదవ్, తులసి రామ్ నాయక్ విద్యుత్ శాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పది యేండ్ల విద్యా వ్యవస్థ నిర్వీర్యం అయ్యింది...

పది యేండ్ల విద్యావ్యవస్థ నిర్వీర్యం అయ్యింది అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. క్రిష్టియన్ పల్లిలోని ప్రభుత్వ ఎంవిఎస్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో పది కోట్ల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న బాలికల హాస్టల్ భవనానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థల్లో గత పది సంవత్సరాలు కనీస మౌలిక సదుపాయాలను కూడా గత ప్రభుత్వం కల్పించలేకపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థకు మంచిరోజులు వచ్చాయని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, రామచంద్రయ్య, ఓబిసి సెల్ రాజు గౌడ్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, ధర్మాపూర్ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్చువల్‌గా పది శాఖలు ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్ : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చైర్మన్ చల్లా శ్రీనివాసులు సెట్టి, చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ సమక్షంలో తెలంగాణ రాష్ట్రంలో పది కొత్త శాఖలను వర్చువల్‌గా ప్రారంభించారు. అలంపూర్ క్రాస్ రోడ్, చిన్నంబావి, రాఘవేంద్ర కాలనీ కొండాపూర్, నియోపోలిస్, పటాన్ చెరువు కిష్టారెడ్డిపేట, ఖాజాగూడ, ఉస్మాన్ నగర్, కంది, సుచిత్ర సర్కిల్, నందిపేట, కొత్త శాఖలను ప్రారంభించారు. ఈ కొత్త శాఖల చేరికతో రాష్ట్రంలో మొత్తం శాఖల సంఖ్య 1206కు చేరింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బ్యాంకింగ్ సేవలు అందుబాటులో లేని ప్రాంతాలలో బ్యాంకింగ్‌ను సులభంగా యాక్సెస్ చేయడానికి, అభివృద్ధి చెందుతున్న పట్టణ కేంద్రాలలో ప్రజల పెరుగుతున్న బ్యాంకింగ్ అవసరాలను తీర్చడానికి ఎస్.బీ.ఐ నిబద్ధతలో పని చేస్తుందని మరింత కస్టమర్లను చేరుకోవడానికి అత్యున్నత స్థాయి బ్యాంకింగ్ సేవలను అందించడానికి ఎస్.బీ.ఐ ఎప్పుడు ముందుంటుందని తెలియజేశారు. అంతే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థను పెంచడంలో ఎస్‌బీఐ కీలకపాత్ర పోషిస్తూనే ఉందని పేర్కొన్నారు. గ్లోబల్ ఫైనాన్స్ మ్యాగజైన్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా అత్యంత విశ్వసనీయ బ్యాంకులు, 2024కి భారతదేశంలోని ఉత్తమ బ్యాంకు జాబితాలో 4వ స్థానంలో నిలిచిందని తెలియజేశారు.

ఆర్‌యుబి నిర్మాణంపై ఎమ్మెల్యే సమీక్ష

విశాలాంధ్ర - మల్కాజిగిరి : గౌతమ్ నగర్ ఆర్‌ఓబి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని మల్కాజిగిరి శాసనసభ్యులు మరి రాజశేఖర్ రెడ్డి జిహెచ్‌ఎంసి ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిహెచ్‌ఎంసి ప్రాజెక్టు అధికారులతో గౌతమ్‌నగర్ ఆర్‌యుబి నిర్మాణంపై సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిహెచ్‌ఎంసి నుండి టెక్నికల్ ఇష్యూ లెటర్ ను రైల్వేకు జారీ చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. గౌతమ్ నగర్ చౌరస్తా నుండి సాయి నగర్ చౌరస్తా వరకు ప్రజలకు సంబంధించిన ఎలాంటి ప్రాపర్టీ డామేజ్ కాకుండా నిర్మాణానికి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఎమ్మెల్యే కోరారు. త్వరలో పనులు ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి ప్రాజెక్టు ఈ.ఈ రోహిణి, రేణుక, డి.ఈ సుదర్శన్, ఏ.ఈ ప్రశాంత్, బిఆర్ఎస్ నాయకులు రావుల అంజయ్య, మేకల రాము యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, వంశీ ముదిరాజ్, సుమన్ గౌడ్, భాగ్యనందరావు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న

కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ఏఐవైఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఇంటర్ బోర్డ్ గుర్తింపు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఇంటర్ అడ్మిషన్లు నిర్వహిస్తున్న శ్రీ చైతన్య కళాశాలపై చర్యలు తీసుకోవాలని అవసరమైతే సీజ్ చేయాలని, ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలలు అక్రమంగా 2025-26 విద్య సంవత్సర నోటిఫికేషన్ వెలువడకముందే చేపడుతున్న ముందస్తు అడ్మిషన్లకు అడ్డుకట్టవేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి ఆధ్వర్యంలో తిరుమలగిరి, సుభాష్ నగర్ ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఉన్న అడ్మిషన్లు నిర్వహిస్తున్న అనధికారిక శ్రీ చైతన్య కళాశాల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల 2025-26 విద్య సంవత్సర నోటిఫికేషన్ విడుదల కాకముందే అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభించడం సరికాదన్నారు. నిబంధనలకు అనుగుణంగా విద్యార్థులు అనుమతులు ఉన్న కళాశాలలోనే చేరాలి. కానీ, కార్పొరేట్ కళాశాలల మాయాజాలం కారణంగా విద్యార్థులు అనుమతులు మంజూరు కాని కళాశాలల్లో అడ్మిషన్లు తీసుకోవడం వలన నష్టపోతున్నారన్నారు. అడ్మిషన్ ఒక చోట... తరగతులు ఒక చోట నిర్వహిస్తూ విద్యార్థులను వారి తల్లిదండ్రులను ఈ కార్పొరేట్ కళాశాలలు మోసం చేస్తున్నారని వారు ధ్వజమెత్తారు. అనుమతులు పొందని కళాశాలల్లో అడ్మిషన్లు పొందితే విద్యార్థులు తమ విద్యా భవిష్యత్ ను నష్ట పోయే ప్రమాదమున్నదన్నారు. అదే విధంగా కార్పొరేట్ కళాశాలలు ధన దోపిడీకి తెరలేపాయని లక్షలాది రూపాయలు ఫీజుల రూపంలో విద్యార్థులు వారి తల్లిదండ్రుల నుండి వసూళ్లు చేస్తున్నారని ఆరోపించారు. అనుమతులు లేని ఐపీఎల్, ఐకాన్, నియాన్, ఫాస్ట్ ట్రాక్, కో స్పార్క్ లాంటి అనాధికర సెక్షన్లు అంటూ విద్యార్థులను అయోమయంలో పడేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్పొరేట్ కళాశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలను అరికట్టడానికి అన్ని కళాశాలలలో మానసిక నిపుణుల కమిటీలు వేసేలా బోర్డ్ ఆదేశాలు జారీ చేయాలని వారు డిమాండ్ చేశారు.తక్షణమే ఇంటర్ బోర్డ్ కార్పొరేట్ కళాశాలల ఆగడాలను ఆపాలని, లేనిపక్షంలో బోర్డ్ ఆదేశాలను భేకాతరు చేస్తున్న కార్పొరేట్ విద్యా సంస్థలపై దాడులు చేస్తామని దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి సల్మాన్ బేగ్, టి.సత్య ప్రసాద్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు మాజీద్ అలీ ఖాన్, కళ్యాణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతను పాటించాలి

విశాలాంధ్ర - మల్కాజిగిరి : తినుబండారాల వ్యాపారం చేసే ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతను పాటించాల్సిన అవసరం ఉందని మల్కాజిగిరి సర్కిల్ ఉప కమిషనర్ గోదుమల రాజు తెలిపారు. శనివారం తినుబండాల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్ల వెంట, హోటళ్ళలో పని చేసే వారు శుభ్రతను పాటించడం ద్వారా అంటువ్యాధులు అరికట్ట వచ్చని తెలిపారు. రాబోయే వేసవి కాలంలో ప్రజలు అధిక దాహంతో ఎక్కువ మోతాధిలో నీరు తీసుకుంటారని కలుషితమైన నీరు, ఆహారం ఉపయోగించి డయేరియా వ్యాధి ప్రభలుతుందని, ప్రతి వ్యాపారి వ్యక్తిగత పరిశుభ్రత నాణ్యమైన పదార్థాలను మాత్రమే విక్రయించాలని కోరారు. వివిధ సెంటర్లలో చిరు వ్యాపారాలు నిర్వహించుకునే వారు వారి వ్యాపార సముదాయము ముందు 100 లీటర్ల కెపాసిటీ కల డస్ట్ బిన్, నల్ల కవర్స్‌తో ఉంచాలని సూచించారు. వ్యర్థాలను చెత్తబుట్టలు భద్రపరిచి జిహెచ్‌ఎంసి వారు ఏర్పాటు చేసిన స్వచ్ఛ ఆటో టిప్పర్‌కు మాత్రమే అందించాలని, రోడ్లపైన మురుగు నీటి కాలువలలో, బహిరంగ ప్రదేశాలలో వేసినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందుకు గాను రూ.1000 జరిమానా కూడా విధించడం జరుగుతుందన్నారు. వ్యక్తిగతంగా, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వంటకు ఉపయోగించే పదార్థాలు కూడా నాణ్యత గల పదార్థాలను మాత్రమే ఉపయోగించాలన్నారు. ముఖ్యంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్, హెూటల్స్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని రిఫైనరీ నూనె నాణ్యమైన ఆయిల్స్ వంటలకు ఉపయోగించాలని కోరారు. కల్తీ పదార్థాలు కల్తీ నూనెలో మసాలాలు ఇతరత్రా ఏవైనా కల్తి వినియోగించినచో కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కల్తీకి పాల్పడినట్లైతే చట్ట ప్రకారం జైలుకు పంపాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. అనంతరం ఫుడ్ సేఫ్టీ అధికారి జంగారెడ్డి మాట్లాడుతూ రోడ్లకు ఇరువైపులా చిరు వ్యాపారులు ముఖ్యంగా అల్పాహార సెంటర్ వారు ఫాస్ట్ ఫుడ్ సెంటర్స్ వారు చెరుకు రసం, టీ అమ్మకం దారులు నాణ్యమైన వస్తువులను మాత్రమే ఉపయోగించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రతి వ్యాపారి తన జుట్టుకు నెట్టు వాడాలని, గోర్లు కత్తిరించుకోవాలని, గ్లౌజులు ఉపయోగించాలని కోరారు. నాణ్యమైన పదార్థాలు లైసెన్స్ ట్రేడ్ లైసెన్స్, ఫుడ్ లైసెన్స్ లేని వారిపై తనిఖీలు నిర్వహించి అధిక మొత్తంలో జరిమానా విధిస్తామని ఆయన తెలిపినారు.

సర్కిల్ ఉపవైద్యాధికారిని డాక్టర్ కె.మంజుల మాట్లాడుతూ ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు నాణ్యమైన పదార్థాలను వాడాలన్నారు. శానిటరి సూపర్‌వైజర్ శ్రీనివాస్ ప్రతి వ్యాపారి ట్రేడ్ లైసెన్స్ తప్పని సరిగా తీసుకోవాలని, జిహెచ్‌ఎంసి వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. దేనికి దళారులను నమ్మవద్దని వ్యక్తిగతంగా కార్యాలయంలో ట్రేడ్ లైసెన్స్ విభాగం సిబ్బందిని సంప్రదించి అనుమానాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

అలరించిన శ్రీకళ్యాణి మ్యూజిక్ అకాడమీ అన్నమయ్య స్వరార్చన

విశాలాంధ్ర - శేరిలింగంపలి : డా. శోభా రాజు ఆధ్వర్యంలో ప్రతి శనివారం జరుగుతున్న అన్నమ స్వరార్చనలో భాగంగా శ్రీ కళ్యాణి మ్యూజిక్ అకాడమీ "గణేశ పంచరత్నం, చూడరమ్మ సతులాల, భోపాళి రాగం, అదివో అల్లదివో, అమృత వర్షిణి రాగం, పిడికిట తలంబ్రాల, జగడపు చనవుల జాజర, సిరుత నవ్వులవాడె సిన్నెక్క, బ్రహ్మమొక్కటే" అనే బహుళ ప్రాచుర్యం పొందిన అన్నమయ్య సంకీర్తనలు భక్తితో పాడగా వారి సితార శిష్య బృందం "బి.శారద, ఎస్. నిర్మలశ్రీ, ఎస్. రిషిక, డి.రవి తేజ, వై.నందిత, జి.ఎన్.ఏ. కాత్యాయని, బి.శ్రీదేవి, కుమారి ఏ.సంవిధ" సితారతో అలరించగా, వీరికి "బి.వి.రమణ మూర్తి, జగన్ దత్తు, డి.స్వాతి, మనోజ్ మోహంటి" సంయుక్తంగా తబల మీద వాయిద్య సహకారం అందించారు. కాగా, వీరి స్వరార్చన మాధుర్యానికి బి.మణి, ఆనంద్ చక్కని వ్యాఖ్యానాన్ని అందించి అందరి ప్రశంసలు పొందారు. కళాకారులను అన్నమాచార్య భావనా వాహిని సంస్థ నిర్వాహకులు లక్ష్మీ జ్ఞాపికలతో సత్కరించారు. చివరిగా శ్రీ స్వరసిద్ధి వేంకటేశ్వరస్వామి వారికి అంగనలీరే మంగళ హారతులు అందించి విచ్చేసిన భక్తులందరికీ ప్రసాద వితరణ జరిపారు.

ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణ దరఖాస్తులు త్వరతగతిన పరిశీలించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్‌లో నేషనల్ హై వే 44 కింద ప్యారడైస్ జంక్షన్ నుండి డైరీ ఫామ్ రోడ్ వరకు అలాగే స్టేట్ హైవే 01 కింద ప్యారడైస్ నుండి శామీర్‌పేట్ వరకు చేపట్టే ఎలివేటెడ్ కారిడార్ భూసేకరణపై హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ భూ సేకరణ పనులలో భాగంగా అందిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలన చేసి తదుపరి చర్యలు చేపట్టాలని భూసేకరణ అధికారు లను ఆయన ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నేషనల్ హైవే 44 కింద 405 కుటుంబ సామాజిక సర్వే చేపట్టి పూర్తి చేయడం జరిగిందని అలాగే స్టేట్ హైవే కింద సర్వేను త్వరలో పూర్తి చేయడం జరుగుతుందని వివరించారు. హనుమాన్ టెంపుల్, టివోలీ థియేటర్, బోయిన్‌పల్లిలోని ముస్లిం స్మశాన వాటికలపై ప్రజలు అందచేసిన అర్జీలను పరిశీలన తదుపరి హెచ్ఎండిఏకు పంపించడం జరిగిందని, అలాగే రెండు కారిడార్‌ల ఏర్పాటులో వచ్చే వివిధ ప్రాపర్టీస్ మరోసారి సర్వే చేపట్టాలని భూ సేకరణ అధికారులను కలెక్టర్ ఈ సందర్భంగా ఆదేశించారు. అదనపు కలెక్టర్ ముకుందరెడ్డి, డిఆర్ఓ వెంకటాచారి, ఎస్‌డిసి అపర్ణ, రాజేష్, సిబ్బంది పాల్గొన్నారు.

జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కి ఘన సన్మానం

విశాలాంధ్ర - శేరిలింగంపలి: జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సేవలను గుర్తించి ముదిరాజ్‌ని కో-ఆపరేటివ్ సొసైటీ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియమించడం సంతోషంగా ఉందని తెలంగాణ రాష్ట్ర బీసీ కులాల, సంఘాల అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ కులాల, సంఘాల అధ్యక్షులు బేరి రామచందర్ యాదవ్ ఘనంగా సన్మానించారు. జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ ముదిరాజులు కూడా బీసీలే బీసీల ఉద్యమంలో అన్ని విధాల సహకరిస్తానన్నారు. న్యాయపోరాటంలో బీసీలకు సహాయం చేస్తానని వాగ్దానం చేశారు. రాజకీయంగా సామాజికంగా అన్యాయానికి గురి అయి అన్ని విధాల పేదరికంలో మగ్గుతున్న బీసీ కులాలకు రాజ్యాంగపరంగా న్యాయం చేయాలని జ్ఞానేశ్వర్ ద్వారా ముఖ్యమంత్రికి తెలియజేయాలని సందేశం పంపడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బేరి రామచందర్ యాదవ్‌తో పాటు సన్మానంలో జంగయ్య యాదవ్, ఆర్కే సాయన్న ముదిరాజ్, రాఘవేందర్ గౌడ్, రజక సంఘం కృష్ణ, నాయి బ్రాహ్మణ సంఘం పద్మశాలి సంఘం, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

జీఎంపీఎస్ నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ

విశాలాంధ్ర - మేడిపల్లి: గొల్ల కురుమలు ఆర్థికంగా, రాజకీయంగా విద్యావంతులుగా అన్ని రంగాలలో ముందుండాలని మేడ్చల్ నియోజకవర్గం ఇన్చార్జి తోటకూర జంగయ్య యాదవ్ బోడుప్పల్ తన నివాసంలో శనివారం ఉదయం గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) 2025 నూతన సంవత్సర డైరీ ఆవిష్కరణ చేశారు. సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మేకల కుమార్ ఎక్కలదేవి కొమురయ్య ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గొల్ల కురుమలను విస్మరించకుండా ప్రోత్సాహం అందిస్తూ గొల్ల కురుమలు ఆర్థికంగా రాజకీయంగా విద్యావం తులుగా ఎదిగేందుకు కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గొల్ల కురుమలు ఉద్యోగ వ్యాపార రంగాలతోపాటు రాజకీయంగా కూడా చాలా వెనుకబడి ఉన్నారని, రానున్న రోజుల్లో గొల్ల కురుమలు అన్ని రంగాలతో పాటు రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి భావన వెంకటేష్, నీలం దామోదర్, ఎర్రోళ్ల అశోక్, మామిండ్ల బలేష్, మామిండ్ల ఆనంద్, ఎక్కల దేవి, శ్రీశైలం, మామిళ్ళ మల్లేష్, మామిళ్ళ శ్రీశైలం, ఎర్రోళ్ల ఐలేని, మంచ మల్లేష్, మామిండ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై దారుణం..

అందరూ చూస్తుండగానే తండ్రిని చంపిన తనయుడు

విశాలాంధ్ర - కాప్రా : కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టపగలు నడిరోడ్డు పై దారుణం చోటు చేసుకుంది. కన్న కొడుకే తండ్రిని కత్తితో పొడిచి దారుణంగా హతమార్చాడు. పోలీసుల కథనంప్రకారం.. సికింద్రాబాద్ లాలాపేటకు చెందిన ఆరెల్లి మొగిలి (45)ని అతని కుమారుడు సాయి కుమార్ (25) ఇద్దరూ ప్యాకర్స్ అండ్ మూవర్స్‌లో పనిచేస్తున్నారు. మొగిలి నిత్యం మద్యం తాగి ఇంట్లో గొడవ చేస్తుండటంతో సాయికుమార్ విసిగిపోయాడు. శనివారం మధ్యాహ్నం లాలాపేట నుంచి మొగిలి బస్సులో బయలుదేరగా.. అతని కుమారుడు ద్విచక్రవాహనంపై అనుసరించాడు. ఈసీఐఎల్ బస్ టెర్మినల్ వద్ద బస్సు దిగిన తండ్రిని తన వెంట తెచ్చుకున్న చాకుతో విచక్షణారహితగా 10..15 సార్లు పొడిచాడు. తీవ్రంగా గాయపడిన మొగిలిని స్థానికులు సమీపంలో ఉన్న శ్రీకర ఆసుపత్రికి తరలించగా చికత్స పొందుతూ మృతి చెందాడు. కత్తితో దాడి చేస్తున్న దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

గ్రేటర్ అభివృద్ధికి చర్యలు: మేయర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : గ్రేటర్ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టినట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. శనివారం సాయంత్రం బంజారాహిల్స్ రోడ్డు నంబర్12 వార్డు నంబర్ 93లో గల మజీద్ ఖైప్ నుండి మదీనా హెూటల్ వరకు రూ. 25 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించడం జరుగుతుందన్నారు. అందుకు ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలకు పెద్ద పీట వేయడం జరిగిందన్నారు.

ఈ నేపథ్యంలో మౌలిక సదుపాల కల్పన కోసం ప్రతి జోన్‌కు రూ.25 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో సిసి రోడ్లు, డ్రెయినేజీ, స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణాలకు, క్రీడా మైదానాలలో వసతులు కల్పనతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. ప్రాధాన్యత పనులను చేపట్టేందుకు అధికారులకు ఆదేశాలు జారీచేసినట్లు వివరించారు. ఈ నిధులు పనులు పూర్తయిన తర్వాత మరో రూ.25 కోట్లు ప్రతి జోన్‌కు కేటాయింపు చేసేందుకు కమిషనర్‌తో మాట్లాడి నిర్ణయం తీసుకున్నట్లు మేయర్ పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రజా ప్రభుత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జిహెచ్ఎంసి అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలకు మేయర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసి ప్రశాంతి ఈఈ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్కిటెక్ట్‌లు, ఇంజనీర్‌లకు బిల్డ్‌నౌ డీసీఆర్‌పై శిక్షణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం ఫాస్ట్ డ్రాయింగ్ స్క్రూటినీ సిస్టమ్ కోసం అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో కూడిన యూనిఫైడ్ సింగిల్ విండో సిస్టమ్‌ను అమలుకు బిల్డ్‌నౌ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతతో రూపొందించిన ఫాస్ట్ డ్రాయింగ్ స్క్రూటిని సిస్టం ద్వారా భవన నిర్మాణ అనుమతుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయడం లక్ష్యమన్నారు. ఇది అన్ని భవనాల అనుమతుల కోసం ఒక రాష్ట్రం ఒకే ఇంటర్ ఫేస్ సిస్టాన్ని కలిగి ఉంటుంది. ఏ1 ఆధారిత కొత్త విధానం వేగంగా, పారదర్శకంగా భవన అనుమతుల ప్రక్రియకు తోడ్పడుతుంది. బిల్డ్‌నౌ అప్లికేషన్ ప్రాసెసింగ్ సమయాన్ని తగ్గించే అధునాతన సాంకేతికత గల అత్యంత వేగవంతమైన డ్రాయింగ్ స్క్రూటిని సిస్టంలో ఒకటిగా రూపొందించబడింది. శనివారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో బిల్డ్ నౌ డి.సి.ఆర్‌పై లైసెన్స్ గల ఆర్కిటెక్ట్‌లు, ఇంజనీర్‌లకు హ్యాండ్స్ ఆన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఇట్టి శిక్షణ కార్యక్రమంలో బిల్డ్ నౌ డి.సి.ఆర్ వ్యవస్థపై ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వడంతో పాటు భవన అనుమతుల ప్రక్రియలో క్రియేషన్ ఆఫ్ టెంపులేట్స్, లేయర్లు, వివిధ ఎంటిటిలను రూపొందించడం గురించి అవగాహన కల్పించారు. బిల్డ్ నౌ అప్లికేషన్ బృందం ఇట్టి శిక్షణ కార్యక్రమంలో డి.సి.ఆర్ వ్యవస్థపై వివరణాత్మక ప్రదర్శన అందించడంతో పాటు డి.సి.ఆర్ పోర్టల్‌లో డ్రాయింగ్ తయారీ ప్రక్రియను వివరణాత్మకంగా వివరించారు. శిక్షణలో భాగంగా తలెత్తిన సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్, స్టేట్ నోడల్ ఆఫీసర్ ఎస్.దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇట్టి శిక్షణ కార్యక్రమం భవనాల రూపకల్పన, అనుమతుల ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు దోహదపడుతుందని అన్నారు. చీఫ్ సిటీ ప్లానర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఫాస్ట్ డ్రాయింగ్, స్క్రూటిని సిస్టం కోసం అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతిక విధానం ద్వారా భవన నిర్మాణ అనుమతులు వేగవంతంగా పూర్తవుతాయని తెలిపారు. ఇట్టి శిక్షణను పూర్తిగా అవగాహన చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అడిషనల్ సిసిపిలు, సిపిలు, ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్‌లు, బిల్డ్ నౌ అప్లికేషన్ బృందం తదితరులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పిస్తున్నాం

విశాలాంధ్ర - శేరిలింగంపలి: శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలో రూ 83.80 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్ల నిర్మాణ పనులకు గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ వి.గంగాధర్‌రెడ్డి పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసనసభ్యులు ఆరెకపూడి గాంధీ ముఖ్య అతిథిలుగా పాల్గొని శంఖుస్థాపనలు చేశారు. మొదటగా గుల్మోహర్ పార్క్ కాలనీలో రూ.14.80 లక్షలతో సీసీ రోడ్లు, నేతాజీ నగర్ కాలనీలో రూ.20.00 లక్షలతో సీసీ రోడ్లు, గోపనపల్లిలో గల సిపిఆర్ బెల్లా విస్టా నుండి నల్లగండ్ల మెయిన్ రోడ్డు వరకు రూ.49.00 లక్షలతో సీసీ రోడ్లు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిని, పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి శాసన సభ్యులు ఆరెకపూడి గాంధీని ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ వి.గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ శరవేగంగా విస్తరిస్తున్న గచ్చిబౌలి డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రతీకగా నిలుపుతున్నామని అన్ని అన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా డివిజన్ పరిధిలో శరవేగంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని తెలిపారు. సమస్యలను ఒక్కొకటిగా అధిగమిస్తూ శాశ్వత పరిష్కారం చూపుతున్నామని అన్నారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేకుండా ఆదర్శవంతమైన గచ్చిబౌలి డివిజన్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని కార్పొరేటర్ వి.గంగా ధర్‌రెడ్డి చెప్పడం జరిగినది. అభివృద్ధి పనుల్లో ప్రజల భాగస్వామ్యం పెరగాలని కోరారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలో రాష్ట్ర, జిల్లా, సీని యర్ నాయకులు, డివిజన్ నాయకులు, మహిళ నాయకులు, మహిళ కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు, జిహెచ్ఎంసి అధికారులు, అభిమానిలు, కాలనీ వాసులు స్థానిక నేతలు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

పసుపుకు మద్దతు ధరను ప్రకటించాలి : కవిత

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఆంధ్ర ప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడుకు గురుదక్షిణగా కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్పిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబుపై ఉన్న ప్రేమ తెలంగాణ రైతాంగంపై ఎందుకు లేదని రేవంత్ రెడ్డిని ఎమ్మెల్సీ కవిత నిలదీశారు. తెలంగాణ రైతుల కంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చంద్రబాబే ఎక్కువనా అని ప్రశ్నించారు. బ్యాగులతో దొరికిన రేవంత్ రెడ్డి జుట్టు చంద్రబాబు చేతిలో ఉందని, అందుకే చంద్రబాబు చెప్పినట్లు సీఎం రేవంత్ రెడ్డి నడుచుకుంటున్నారని ధ్వజమెత్తారు. శనివారం నిజామాబాద్ పసుపు మార్కెట్ యార్డును ఎమ్మెల్సీ కవిత సందర్శించారు. అక్కడ పసుపు రైతులతో మాట్లాడి వారి కష్టాలు, సమస్యలు, మార్కెట్‌లో ఉన్న ధరల వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ గతంలో ప్రజా భవన్‌లో ఇరు రాష్ట్రాల సీఎంల సమావేశంలో తర్వాత బనకచర్ల ప్రాజెక్టు చేపడుతామని చంద్రబాబు ప్రకటించారని, చంద్రబాబుకు రేవంత్ రెడ్డి బ్రీఫ్ చేసిన తర్వాత ఆయన ప్రకటన చేశారని చెప్పారు. గోదావరి నది నుంచి 200 టీఎంసీలను కృష్ణా, పెన్నా బేసిన్ లకు తరలించడానికి ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు చేపడుతోందని, మన దగ్గరి నుంచి 200 టీఎంసీల నీటిని ఏపీ ఎత్తుకపోతుంటే మూర?పు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూస్తూ నిలబడ్డారని మండిపడ్డారు. నిజంగా తెలంగాణహితం కోరితే చంద్రబాబు ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ కేంద్రానికి ఎందుకు లేఖ రాయడం లేదని, ప్రభుత్వం కోర్టుల్లో ఎందుకు కేసులు వేయడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. ఆనాడు ఏపీ ప్రాజెక్టులు చేపడితే, కాలువలు విస్తరిస్తే కేసీఆర్ వ్యతిరేకిస్తూ కేంద్రానికి లేఖలు రాశారని, కోర్టుల్లో కేసులు వేసి స్టే లు తీసుకొచ్చారని గుర్తు చేశారు. తక్షణమే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయాలని, అవసరమైతే కోర్టుకు వెళ్లి బనకచర్ల ప్రాజెక్టును ఆపాలని డిమాండ్ చేశారు. నోరుందికదా అని సీఎం రేవంత్ రెడ్డి గంప గయ్యాళిలా ఒర్రుతున్నారని విరుచుకుపడ్డారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా తప్పదు

విశాలాంధ్ర-దుండిగల్: మున్సిపల్ పరిధిలో ఉన్న దుకాణాల్లో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడితే తప్పకుండా జరిమానాలు విధిస్తామని మున్సిపల్ శానిటేషన్ అధికారులు హెచ్చరించారు. శనివారం నియోజకవర్గం దుండిగల్ మున్సిపాల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ ఆదేశాల మేరకు శనివారం ప్లాస్టిక్ బ్యాన్ కార్యక్రమంలో భాగంగా గండిమైసమ్మ పరిధిలో స్పెషల్ టీంలను ఏర్పాటు చేసి ముఖ్యంగా సింగల్ యూస్ ప్లాస్టిక్ కవర్లు ఉపయోగించే కిరాణా షాపులు, హెూటల్స్, చికెన్ మటన్ దుకాణాలపై తనిఖీలు నిర్వహించి సింగల్ యూస్ ప్లాస్టిక్ అమ్మేవారికి 12700 జరిమానా విధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిషేధిత ప్లాస్టిక్ విక్రయాలు జరిగితే జరిమానా విధిస్తామని తెలిపారు. అదేవిధంగా ప్లాస్టిక్ బదులు అందరూ, జూటు బ్యాగులు, చేతి కర్ర సంచులు వాడాలని సూచించినారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ అంజయ్య, రామచందర్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ పి.సాత్విక్, వార్డ్ ఆఫీసర్లు, జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర - కాప్రా : నాచారం డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ దినోత్సవ వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి. పాఠశాల ప్రాంగణంలో శనివారం జరిగిన వేడుకలకు చైర్మన్ నవీనతరావు, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ కుమార్, అనుష జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రైమెరీ విద్యార్థులు సంవత్సరాంతంగా పొందిన నైపుణ్యాలను వివిధ ప్రదర్శనల ద్వారా ఇచ్చారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, మనోహరమైన స్కిట్లతో పాఠశాల వేదిక పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా అతిరథ మహారథులు మాట్లాడుతూ గ్రాడ్యుయేషన్ అనేది ప్రీస్కూలర్ జీవితంలో ఒక ప్రత్యేకమైన మైలురాయని అన్నారు. ఈ వేడుకలు విద్యార్థుల్లో మరింత ఆత్మ విశ్వాసాన్ని పెంపొందిస్తాయని వారి విజయాలకు దోహదపడతాయని అన్నారు. ప్రిన్సిపల్ సుమా మీనన్ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్నతనం నుండి నైతిక విలువలు, క్రమశిక్షణ వంటి లక్షణాలు నేర్పుతూ ఉత్తమ పిల్లలుగా తీర్చిదిద్దే బాధ్యత ఇటు గురువులతో పాటు తల్లిదండ్రులు తీసుకోవాలని అన్నారు. భవిష్యత్తులో విద్యార్థులు దృఢ సంకల్పంతో ముందుకు సాగడానికి మరెన్నో కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. అనంతరం విద్యార్థులు గ్రాడ్యుయేట్ దుస్తులు టోపీలను ధరించి తమ డిగ్రీలను చేతిలో పట్టుకుని గొప్ప విశ్వాసంతో ప్రకాశవంతంగా కేరింతలతో కార్యక్రమాన్ని ముగించారు. పాఠశాల యాజమాన్యం నిర్వహించిన ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ దినోత్సవ వేడుక ఏప్పటికి చిరస్మరణీయంగా నిలుస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కోర్ హెడ్ ఆపరేషన్స్ కిషోర్ కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్, ప్రి ప్రైమెరి ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మంత్రి దామోదర్ రాజనర్సింహది మాదిగ కులం కాదనడం సరికాదు

విశాలాంధ్ర-బషీర్ బాగ్: మంద కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కాకుండా అడ్డుకుంటున్నారని మాదిగ, మాదిగ అనుబంధ కులాల ఐక్య వేదిక చైర్మన్ మేడి పాపయ్య ఆరోపించారు. బేడ, బుడుగ, జంగాల హక్కుల దండు వ్యవస్థాపక అధ్యక్షులు హనుమంతు ఆధ్వర్యంలో బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు విలేకరుల సమావేశంలో వైస్ చైర్మన్లు జున్ను కనకరాజు, ఇటిక రాజు మాదిగ, పీ.మేరీ మాదిగ సలహాదారులు రాజలింగం, శ్రీనివాసరావులతో కలిసి ఆయన మాట్లాడారు. మంద కృష్ణ మాదిగ మంత్రి దామోదర్ రాజనర్సింహాను మాదిగ కులం కాదు అనడం ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. మంద కృష్ణ నీది ఏ కులం అని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణలో మంత్రి దామోదర్ రాజనర్సింహా కీలక పాత్ర పోషించారని తెలిపారు. మాల నేతలను వెంటబెట్టుకొని మాదిగకులకు ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. చిత్తశుద్ధితో చేసిన ఎస్సీ వర్గీకరణను తప్పుబట్టి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని ధ్వజమెత్తారు. వర్గీకరణ కోసం ఎన్నో ఏళ్లుగా పోరాటం చేస్తున్నామని, ఆ కల సహకారం అయ్యే దిశగా వెళ్తుంటే దానికి అడ్డుపుల్ల వేస్తున్నారని చెప్పారు. దామోదర్‌ను మంత్రి వర్గం నుండి భర్తరఫ్ చేయాలని మంద కృష్ణ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. మంద కృష్ణ చుట్టూ ఎంత మంది మాదిగలు ఉన్నారని, మాలనేతలను వెంట తిప్పుకుంటూ మాదిగలను విమర్శిస్తే ఖబర్దార్ అని హెచ్చరించారు. మందకృష్ణ మాదిగలకు, మాలలకు చిచ్చు పెట్టి బీజేపీకి లబ్ది చేయాలని చూస్తున్నాడని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో డా. మేడి రమణ, శ్రీనివాస్, గంధం రాములు, గద్ద యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాల్లో కొలను

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్: నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బంజారా సేవా సంఘం సభ్యుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన శ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బంజారా సేవా సంఘం సభ్యులు మాట్లాడుతూ బంజారా ఆరాధ్య దైవంగా కొలిచే సేవాలాల్ మహారాజు చరిత్ర చిరస్మరణీయమని, సేవాలాల్ మహారాజ్ మూగజీవులను చంపద్దంటూ మత్తు పానీయాలను మరిచిపోవాలి అంటూ పోరాటం చేస్తూ నాడు బ్రిటిష్ ప్రభుత్వంలో బంజారా ప్రజలపై జరుగుతున్న అరాచకాలను ఎదిరిస్తూ, బంజారా జాతిని చైతన్యం పరుస్తూ సన్మార్గంలో నడిపినటువంటి సేవాలాల్ మహారాజు, బంజారాలో హిందూ మతాన్ని పాటించాలని, బంజారా జాతిని ఎల్లవేళలా కాపాడుతూ వచ్చారని, దేశవ్యాప్తంగా సేవాలాల్ మహారాజ్ జయంతిని అంగరంగ వైభవంగా నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మాజీ ఎంపీ రవీందర్ నాయక్, మాజీ మంత్రి అమర్ సింగ్ తిలావత్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ప్రగతి నగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు చల్లా సుధీర్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర సేవల సేన అధ్యక్షులు ఆంగోత్ రాంబాబు నాయక్, ఉపాధ్యక్షులు రవి నాయక్, మాజీ కార్పొరేటర్లు కార్పొరేటర్లు, వివిధ పార్టీల ప్రజాప్రతినిధులు బంజారా కుటుంబ సభ్యులు, కొర్ర రాములు నాయక్, సేవలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రనాయక్, కాంట్రాక్టర్ హర్య నాయక్,కమిటీ ఎగ్జిక్యూటివ్ నెంబర్ నాయకులు అశోక్ నాయక్, గుడి పూజారి ఎస్పీ నాయక్, మహారాజ్ బంజారా దుర్గా దాస్ మహారాజ్, సేవ సంఘం కమిటీ సభ్యులు, బంజారా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామర్ స్కూల్లో ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

విశాలాంధ్ర - ఆమనగల్లు : పట్టణంలోని ఆమనగల్లు గ్రామర్ హైస్కూల్లో విద్యార్థులు శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయ పాత్ర పోషించి విద్యార్థులకు పాఠాలు బోధించి ఆకట్టుకున్నారు. చూడముచ్చటైన వస్త్రధారణతో విద్యార్థులు హాజరై సందడి చేశారు. చిన్నారులు బోధించిన తీరుపై వీక్షకులు ప్రశంసించారు. స్వయంపాలన సందర్భంగా పాఠశాల యాజమాన్యం వివిధ రకాల మొక్కలతో అలంకరించి పాఠశాలను శోభాయమానంగా చేసి ఆకట్టుకున్నారు. అనంతరం మధ్యాహ్నం పాఠశాల ఆవరణలో ముగింపు వేడుకలు జరిగాయి. యాజమాన్యం బికుమాండ్ల ప్రదీప్ కుమార్, అవ్వారి శివలింగం, ఆమనగంటి సంజీవ్ కుమార్, కోట్ల వెంకటేష్, అవ్వారి శైలజ శివకుమార్, వెల్దండ రవికిరణ్ ముఖ్య అతిథులుగా హాజరై ఒకరోజు ఉపాధ్యాయులకు బహుమతి ప్రధానం చేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ధ్యానముద్రలు యోగ సాధనతోపాటు సినీ గీతాలపై నృత్య ప్రదర్శనతో అలరించి సందడి చేశారు. కార్యక్రమంలో సుమతి, సమ్రిన్, ఆసియా బేగం, బాలిశ్వర్, నిఖిత, జయలక్ష్మి, మౌనిక, అనుష, జ్యోతి,

అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారుల కొరడా

విశాలాంధ్ర - దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి డి.పోచంపల్లి 7 వార్డులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. దుండిగల్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ ఆదేశాల మేరకు టిపిఓ సంజున, టౌన్ ప్లానింగ్ సిబ్బంది సతీష్, తిరుపతి, రాము, వేణు శనివారం ఉదయం కూల్చివేతలు చేపట్టారు. అనుమతులకు మించి నిర్మించిన నిర్మాణాలను జెసిబి సహాయంతో స్లాబ్, గోడలను తొలగించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలోని గృహ నిర్మాణం చేపట్టే నిర్మాణదారులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోని, తమకున్న అనుమతులు మేరకు నిబంధనలకు అనుగుణంగా మాత్రమే నిర్మాణాలు చేసుకోవాలని సూచించారు. అనుమతులకు మించి చేపట్టిన నిర్మాణాలను కూల్చి వేస్తామని తెలిపారు.

అప్పుల బడ్జెట్ కాకూడదు

- ప్రభుత్వం గొప్పలకు పోవద్దు
- నీటి ప్రాజెక్టులకు 10 శాతం నిధులు
- సూపర్-6... ధరల స్థిరీకరణ నిధికి ప్రాధాన్యత
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సూచన

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 24 నుంచి జరగనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షల కోట్ల భారీ బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్లు ప్రచారం జరుగుతోందని, అయితే ఇది అప్పులపై ఆధారపడే బడ్జెట్ కాకూడదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూచించారు. గుంటూరు మల్లయ్యలింగం భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ మాట్లాడుతూ బడ్జెట్ ప్రవేశానికి ముందు రాష్ట్రానికి వచ్చే ఆదాయం ఎంత? కేంద్రం నుంచి వచ్చే నిధులెన్ని? వివిధ పద్దుల రూపంలో వచ్చే ఆదాయం ఎంత? రుణాలు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుంటారని, కానీ భారీ బడ్జెట్ ప్రవేశపెట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని అన్నారు. దీనిపై ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి, సంబంధిత శాఖ అధికారులు రాష్ట్రానికి ఎంత ఆదాయం వస్తుందనే విషయాన్ని పరిశీలించి బడ్జెట్ ప్రవేశపెట్టాలని సూచించారు. జగన్ ఏ తప్పు చేశారని నాడు విమర్శలు చేశామో... ప్రస్తుతం చంద్రబాబు కూడా అదే తప్పు చేస్తున్నారని రామకృష్ణ అన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాలపై జగన్ ప్రభుత్వం శీతకన్ను వేసిందని, ప్రాజెక్టుల నిర్మాణాలకు నిధులు విడుదల చేయలేదని, విడుదల చేసిన నిధులు సక్రమంగా వినియోగించలేదని రామకృష్ణ గుర్తుచేశారు. ప్రస్తుత ప్రభుత్వమైనా ఇరిగేషన్ ప్రాజెక్టులకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చి... 10 శాతం నిధులు కేటాయించాలని ఆయన కోరారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలతో పాటు వెనుకబడిన ప్రాంతాల ప్రాజెక్టులను పూర్తి చేయాలని సూచించారు. ఎన్టీఆర్ హయాంలో ప్రారంభించిన హంద్రీనీవా, వెలిగొండ తదితర ప్రాజెక్టులు 30 ఏళ్లుగా పూర్తి కాలేదన్నారు. ఈ ప్రాజెక్టుల పూర్తి కోసం దశాబ్దాల నుంచి రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలన్న రైతుల న్యాయబద్ధ డిమాండ్‌ను రామకృష్ణ గుర్తుచేశారు. వంశధార, నాగవల్లి ప్రాజెక్టులైతే కనీసం చర్చకు కూడా రావట్లేదన్నారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. సూపర్-6 పథకాలు ఎప్పుడు అమలు చేస్తారంటూ తొమ్మిది మాసాలుగా ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఈ బడ్జెట్‌లో సూపర్-6 అమలుకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తిచేశారు. మిర్చి, టమోటా తదితర పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడిపోతున్నారని, రైతుల ఆందోళనను పరిగణలోకి తీసుకుని ధరల స్థిరీకరణ నిధికి ప్రాధాన్యతనిచ్చి బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని అన్నారు.

అగ్రిగోల్డ్ సమస్యపై రేపు అర్జీల అందజేత

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ చమురు, సహజ వాయువును పరిరక్షించాలని కోరుతూ కాకినాడలో ఆదివారం ఉదయం 11 గంటలకు జరిగే సదస్సుకు సీపీఐ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అన్నారు. వీటి పరిరక్షణకు భవిష్యత్తులో జరిగే ఆందోళనలోనూ సీపీఐ భాగస్వామి అవుతుందన్నారు. కృష్ణా గోదావరి బేసిన్‌లో ఉన్న చమురు, సహజవాయువు నిక్షేపాలను రిలయన్స్ వంటి కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్న తీరు ఆక్షేపణీయమన్నారు. రాష్ట్ర పురోభివృద్ధికి, లక్షలాది మంది నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఇవి దోహదపడతాయని తెలియజేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు సత్వరమే న్యాయం చేయాలని కోరుతూ ఈ నెల 24వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల్లో అర్జీలు అందజేయనున్నట్లు ముప్పాళ్ల తెలిపారు. ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, విజయనగరం, పార్వతీపురం తదితర జిల్లాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలతో అగ్రిగోల్డ్ ఆస్తులు కొల్లగొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అడ్డుకున్న బాధితులపై దాడులకు తెగబడుతున్నారని మండిపడ్డారు. దీనిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవటం లేదన్నారు. ఈ నేపథ్యంలో అగ్రిగోల్డ్ ఆస్తులను పరిరక్షించాలని, ఆ బాధ్యతను స్థానిక తహసీల్దార్, ఎస్ఐలకు అప్పజెప్పాలని, అగ్రిగోల్డ్ అంశంపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేయాలని అర్జీలు అందజేయనున్నట్లు తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ మోదీ సర్కారు దేశ ఆర్థిక, పారిశ్రామిక రంగాలను నిర్వీర్యం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా రంగాలను అంబానీ, అదానీ వంటి గుత్త పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నదని మండిపడ్డారు. రాష్ట్రాల స్వయం నిర్ణయాధికారాన్ని తుంగలో తొక్కిందన్నారు. మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ పబ్బం గడుపుతున్నదని విమర్శించారు. మోదీ నాయకత్వంలోని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఐ ప్రచార కార్యక్రమాలకు రూపకల్పన చేయనున్నట్లు తెలిపారు. సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పాల్గొన్నారు.

మార్చి 23 నుంచి ప్రచార కార్యక్రమాలు

నరేంద్ర మోదీ ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ మార్చి 23 నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు సీపీఐ అధ్వర్యంలో ప్రచార కార్యక్రమాలను దేశవ్యాప్తంగా చేపట్టనున్నట్లు రామకృష్ణ తెలిపారు. దానిలో భాగంగా రాష్ట్రంలోనూ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఈ నెల 24న జరిగే జూమ్ సమావేశంలో రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ప్రకటిస్తామని వెల్లడించారు. మోదీ అధికారం చేపట్టిన నాటి నుంచి ఏ ఒక్క సమస్యను పరిష్కరించలేదని, నిరుద్యోగం, రైతాంగ సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. అంబానీ, అదానీలకు ఊడిగం చేస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను దివాలా తీయించారని మండిపడ్డారు. గ్రూప్-2 అభ్యర్థుల ఆందోళనపై ముఖ్యమంత్రి స్పందించాలని రామకృష్ణ కోరారు. వారి ఆందోళనల నేపథ్యంలో గ్రూప్-2 పరీక్ష వాయిదా వేయాలని, పరీక్షకు అనుగుణంగా రోస్టర్ సిస్టమ్‌ను మార్చాలన్నారు. దీనిపై సీఎం స్వయంగా ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు.

మద్యం తయారీకి వ్యతిరేకం కాదు: వినయ్ విశ్వం

తిరువనంతపురం: మద్యం తయారీకి సీపీఐ వ్యతిరేకం కాదని పార్టీ కేరళ కార్యదర్శి వినయ్ విశ్వం అన్నారు. తాగునీరు-వ్యవసాయంపై ప్రభావం ఉండరాదన్నదే తమ పార్టీ డిమాండ్ చేస్తోందని ఆయన శనివారం మీడియాతో చెప్పారు. ఎల్‌డీఎఫ్ కూడా తమతో ఏకీభవిస్తోందన్నారు. బ్రూవరీ అనేది ఎల్‌డీఎఫ్ విధానమని, తాగునీటిని ప్రభావితం చేస్తుందా లేదా వ్యవసాయాన్ని ప్రభావితం చేస్తుందా అనేదే ప్రశ్న అని అన్నారు. అయితే అలాంటి పరిస్థితి ఉండదన్న హామీ ప్రభుత్వం ఇచ్చిందని చెప్పారు. ప్రతిపక్షాలు వాస్తవాలను పట్టించుకోకుండా విమర్శలు గుప్పిస్తుండటం సరికాదని వినయ్ విశ్వం అన్నారు.

గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం: డీజీపీ

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: రాష్ట్రంలో గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా తెలిపారు. కృష్ణా జిల్లాలోని నాలుగు సబ్ డివిజన్‌ల పరిధిలో 183 కేసులలో పోలీసులు సీజ్ చేసిన 3,737 కిలోల గంజాయి, 4.22 కిలోల లిక్విడ్ గంజాయిని శనివారం జిందాల్ అర్బన్ మేనేజ్‌మెంట్ వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ... గంజాయి నియంత్రణపై ప్రభుత్వం దృష్టి పెట్టినట్లు చెప్పారు. ఈగల్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసి గంజాయి ముఠాలపై నిఘా పెట్టినట్టు తెలిపారు. గంజాయి రవాణా చేస్తున్న వారిపై కేసులతో పాటు వారి ఆస్తులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. యువత బానిస కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా కళాశాల విద్యార్థులు, ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో గంజాయి సాగు పూర్తిగా నియంత్రణలో ఉన్నట్లు చెప్పారు. ఈగల్ ఐజీపీ ఆకే రవి కృష్ణ, ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్ కుమార్, ఈగల్ ఎస్పీ నగేష్ కుమార్, కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధర్ రావు, పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బర్మా క్యాంపు కథల్లో వాస్తవికత

జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-విశాఖ: బర్మా క్యాంపు కథల్లో వాస్తవికత ఉందని మార్క్సిస్టు అధ్యయన కేంద్రం అధ్యక్షులు జేవీ సత్యనారాయణమూర్తి అన్నారు. ఆంధ్ర విశ్వకళా పరిషత్ తెలుగు శాఖ, అరసం అధ్వర్యంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగం సెమినార్ హాల్‌లో శనివారం జరిగిన పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ పాలకులు తమ వలస దేశాలకు మన దేశం నుంచి శ్రామికులను తీసుకెళ్లారని, వారిలో చాలామంది అక్కడే స్థిరపడిపోగా బర్మాకు తరలించిన వారిని మాత్రం అక్కడి ప్రభుత్వం వెనక్కి పంపిందని చెప్పారు. బర్మా జీవనానికి అలవాటు పడిన వారు వెనక్కి వచ్చి మాతృదేశ సంస్కృతికి అలవాటు పడేందుకు ఇబ్బంది పడ్డారని అన్నారు. ప్రభుత్వాలు బర్మా కాందిశీకుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించాయని, విశాఖలో పెద్ద షెడ్లను నిర్మించి వారిని అందులోకి తరలించి గాలికి వదిలేశాయని, కనీస సౌకర్యాలు కూడా కల్పించలేదని, నీటి కోసం మహిళలు తీవ్ర ఇబ్బందులు పడేవారని ఆయన వివరించారు. బతుకు పోరాటంలో కొంతమంది దొంగలుగా, రౌడీలుగా మారారని పక్కనే ఉన్న రైల్వే యార్డు నుంచి ఇనుము దొంగతనం చేసేవారని అన్నారు. పోలీసులు వారిపై దొంగలుగా ముద్రవేశారని, ఎక్కడైనా దొంగతనం జరిగితే వారిని తీసుకొచ్చి పోలీసు స్టేషన్‌లో పెట్టేవారని తెలిపారు. కాందిశీకులు గురించి ప్రచురితమైన మొదటి పుస్తకం బర్మా క్యాంప్ కథలు అని అన్నారు. రచయిత వెంకటరమణ అక్కడ పెరగడంతో అనుభవాలను కథలుగా చిత్రీకరించారని చెప్పారు. పుస్తకాన్ని తెలుగు విభాగం ఆచార్యులు అన్నంశెట్టి ఈశ్వరమ్మ విశ్లేషిస్తూ బర్మా క్యాంపు కథలు చదివించే విధంగా ఉన్నాయని, ఎక్కడా విసుగు రాదని అన్నారు. రచయిత బాల్యం నాటి అనుభూతులు కనిపిస్తాయని తెలిపారు. రచయిత హరి వెంకటరమణ మాట్లాడుతూ ఇప్పటివరకు మా బడి కథలు, బర్మా క్యాంపు కథలు రాశానని, పెందుర్తి కథలు రాయబోతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి తెలుగు విభాగం అధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు అధ్యక్షత వహించగా, అరసం రాష్ట్ర కార్యదర్శి ఉప్పల అప్పలరాజు రచయితను పరిచయం చేశారు. ఈ సభలో ఆచార్య వెలమల సిమ్మన్న, రచయిత మాత్స్య మూర్తి, బి.అనంతలక్ష్మి, రచయిత బి.వి.అప్పారావు, రేగి అచ్చులు, ప్రచురణ సంస్థ పబ్లిషర్ గుండ్ల వెంకటనారాయణ, ఎడిటర్ సాయి వంశీ ప్రసంగించారు.

రేపటి నుంచి అసెంబ్లీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఈనెల 24వ తేదీ నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించనున్నారు. అనంతరం సభ వాయిదా పడుతుంది. ఈనెల 28వ తేదీన 2025-26 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టే అవకాశముంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి. గత ఏడాది జూన్‌లో కూటమి ప్రభుత్వం కొలువు దీరగా, నాటి ఆర్థిక పరిస్థితులు దృష్ట్యా రెండుసార్లు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టారు. రాష్ట్ర అప్పులు, సంక్షేమ పథకాలకు అయ్యే ఖర్చుపై ఇప్పుడు అంచనా రావడంతో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. సుమారు 15 పనిదినాలు అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలనే యోచనలో ప్రభుత్వం ఉంది. మొదటి రోజు బీఏసీ తర్వాత సభ ఎన్ని రోజులు జరుగుతుందనే దానిపై అధికారిక నిర్ణయం వెలువడుతుంది. ప్రభుత్వం కొన్ని కీలక బిల్లులు సభ ముందుకు తీసుకురానుంది. అలాగే ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలుపై నిర్ణయం తీసుకోనుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత పులివెందుల ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడానికి అసెంబ్లీకి వచ్చిన వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి... తర్వాత తాను అసెంబ్లీ సమావేశాలు బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. తనకు ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని, ముఖ్యమంత్రితో పాటు సభలో మాట్లాడే అవకాశం కల్పించాలని కోరుతున్నారు. ఈ రెండింటికీ కూటమి ప్రభుత్వం అంగీకరించని పక్షంలో తాను సభకు వచ్చినా ఉపయోగం లేదని చెపుతున్నారు. మీడియా సాక్షిగా తాను ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తానని, అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అలా మొత్తానికి ఇప్పటివరకు అసెంబ్లీ సమావేశాలకు గైర్హాజరు అవుతూ వస్తున్న జగన్‌మోహన్ రెడ్డి... తాజా బడ్జెట్ సమావేశాలకు హాజరు కావాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే సోమవారం ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించే తొలిరోజు సభకు హాజరై... తర్వాత వస్తారా? లేదా? అనే విషయంపై ఇంకా నిర్ణయం జరగలేదని చెబుతున్నారు. జగన్ సభకు వచ్చినా... రాకున్నా మిగిలిన సభ్యులు హాజరవ్వాలని, కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలపై ఉభయ సభల్లో నిలదీయాలని వైసీపీ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం

అసెంబ్లీ సమావేశాలను పురస్కరించుకుని భద్రతా ఏర్పాట్లు మరింత కట్టుదిట్టం చేస్తున్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో రాకపోకలు, ప్రవేశాలపై ఉన్న నిబంధనల్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మీడియా, విజిటర్లు, పోలీసు సిబ్బందికి ప్రత్యేక పాస్‌లు జారీ చేశారు. భద్రతా కారణాల రీత్యా పాస్‌లు ఉన్నవారిని మాత్రమే అసెంబ్లీ ప్రాంగణంలోకి అనుమతించనున్నారు. అసెంబ్లీ, మండలిలో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేలా వివిధ కలర్ కోడ్‌లతో ఇప్పటికే పాస్‌లు జారీ చేశారు. అసెంబ్లీ గేటు-1 నుంచి మండలి చైర్మన్, స్పీకర్, డిప్యూటీ స్పీకర్, సీఎం, డిప్యూటీ సీఎంలకు మాత్రమే అనుమతి ఉంటుంది. గేటు-2 నుంచి మంత్రులకు మాత్రమే అనుమతి ఇస్తారు. గేటు-4 నుంచి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అనుమతిస్తూ బులెటిన్ జారీ చేశారు. మండలి చైర్మన్, స్పీకర్, సీఎం వచ్చి వెళ్లే కారిడార్‌లోకి ఇతరులెవ్వరికీ అనుమతి లేదని స్పష్టం చేశారు. నాలుగో గేట్ గన్ పాయింట్ మినహా భద్రతా సిబ్బందిని అనుమతించేది లేదని వెల్లడించారు. మంత్రులు, సభ్యుల పీఏలను అవసరం మేరకు మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. శాసన సభా వ్యవహారాలతో సంబంధం లేని ప్రభుత్వ విభాగాల సిబ్బందికి ప్రాంగణంలోకి అనుమతి లేదని తెలిపారు. శాసనసభ, మండలిలోకి సభ్యులు ఎవరూ ఆయుధాలతో రాకూడదని బులెటిన్‌లో పేర్కొన్నారు. ఒకవేళ వచ్చినా అసెంబ్లీ ప్రాంగణంలో ఉన్న బెల్ ఆఫ్ ఆర్మ్‌లో డిపాజిట్ చేయాల్సిందిగా సూచించారు. ఆయుధాలు, లాఠీలు, ప్లకార్డులు, విజిల్స్ లాంటి వాటితో విధానపరిషత్ ప్రాంగణంలోకి ప్రవేశం లేదని వెల్లడించారు. భద్రతా కారణాల రీత్యా సభ్యుల పీఏలు, వ్యక్తిగత సిబ్బందిని తీసుకురావొద్దని సూచించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ మినహా ఇతర చోట్ల మీడియా సమావేశాలు నిర్వహించొద్దని సభ్యులకు, మంత్రులకు సూచనలు జారీ చేశారు.

28న రాష్ట్ర కేబినెట్ భేటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈనెల 28వ తేదీ జరుగనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు కార్యాలయంలోనే ఈ సమావేశం నిర్వహించ నున్నారు. 28వ తేదీ ఉదయం 9 గంటలకు కేబినేట్ భేటీ కానున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.విజయానంద్ తెలిపారు. ఈనెల 24వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. 28న రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలనే యోచనలో ఉంది. దీనికి ముందుగా బడ్జెట్‌ను మంత్రివర్గ సమావేశం ఆమోదిస్తుంది. అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టే కొన్ని కీలక బిల్లులపై కూడా చర్చించే అవకాశం ఉంది. ఈ మేరకు ఆయా శాఖల ప్రత్యేక ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు ఉన్నతాధికారులకు సీఎస్ ఉత్తర్వులు జారీ చేశారు.



భూ అక్రమాలపై సిసోడియా ఆరా

విశాలాంధ్ర-ఒంగోలు: ప్రకాశం జిల్లాలోని ఒంగోలు, దాని పరిసర ప్రాంతాలలో భూ అక్రమాలపై రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా ఆరా తీశారు. నకిలీ పత్రాలు, స్టాంపులు, సంతకాల ఫోర్జరీలతో రెండేళ్ల క్రితం వెలుగుచూసిన మోసాల వివరాలు తెలుసుకున్నారు. ల్లా కలెక్టరు తమీమ్ అన్సారియా ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్, జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో ఆయన ప్రకాశం భవనంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భూ అక్రమాలపై సిట్ నమోదు చేసిన కేసులు... విచారణలలో పురోగతి, చార్జిషీట్ల దాఖలు తదితర వివరాలను తెలుసుకున్నారు. వివాదాస్పద స్థలాలు, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, ఇతర పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, వాస్తవ యజమానులను, డాక్యుమెంట్లను గుర్తించాలని అధికారులను సిసోడియా ఆదేశించారు. నకిలీ పత్రాలు ఎవరు సృష్టించారో ఆధారాలు సేకరించాలన్నారు. ఇందుకోసం రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖలు సమన్వయంతో పని చేయాలని సిసోడియా సూచించారు. సిట్ పరిధిలోకి రాని కేసులను తొలగించాలని, మిగతా కేసులలో విచారణ వేగవంతం చేయాలన్నారు. కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ15 రోజులలోగా సంబంధిత అధికారులతో ప్రత్యేకంగా సమావేశమవుతున్నట్లు తెలిపారు. సమావేశంలో రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ పుష్పలత, జిల్లా రిజిస్ట్రార్ బాలంజనేయులు, ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, సీఐలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దిశ నిర్వీర్యం చేసి సురక్ష తెస్తున్నారా?

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తర్వాత దిశ యాప్‌ను నిర్వీర్యం చేశారని వైసీపీ అధికార ప్రతినిధి పుత్తా శివశంకర్ ఆరోపించారు. వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన శనివారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరుగుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందని విమర్శించారు. అమ్మాయిలపై కూటమిలోని నాయకులు, కార్యకర్తలు అఘాయిత్యాలకు పాల్పడుతుంటే వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు. వైసీపీ హయాంలో తీసుకువచ్చిన దిశ యాప్‌ను కోటి 50 లక్షల మంది డౌన్ లోడ్ చేసుకున్నారని తెలిపారు. ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం దిశ యాప్‌ను నిర్వీర్యం చేసిందని, అమ్మాయిలపై దారుణాలు జరుగుతుంటే ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. ప్రజల నుంచి విమర్శలు వచ్చే సరికి మళ్లీ సురక్ష పేరుతో యాప్‌ను తీసుకువస్తున్నారని విమర్శించారు.

యూపీకి ఎన్‌జీటీ నోటీసు

అహ్మదాబాద్: ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మహా కుంభమేళాను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. నిత్యం లక్షల మంది గంగా నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్నారు. అయితే కుంభమేళా ప్రాంగణంలో పారిశుధ్యం లోపించినట్లు ఆరోపణలు వచ్చాయి. గంగా నది తీరంలో బహిరంగంగా మల, మూత్ర విసర్జన సాగుతోందని, పారిశుద్ధ్యానికి సరిపడ ఏర్పాట్లు లేవని ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వానికి జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) నోటీసు జారీచేసింది. ఉత్తరప్రదేశ్ కాలుష్య నివారణ బోర్డు (యూబీ పీసీబీ), ప్రయాగ్‌రాజ్ మేళా యంత్రాంగానికి నోటీసులు జారీ అయ్యాయి. ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం నుంచి రూ.10కోట్ల పర్యావరణపరమైన జరిమానా కోరుతూ నిపున్ భూషణ్ చేసిన ఫిర్యాదు క్రమంలో ఎన్‌జీటీ చర్యలు తీసుకుంది. కాలుష్యాన్ని నివారించడంలో యూపీ ప్రభుత్వం విఫలమైందని ఫిర్యాది ఆరోపించారు. 2024 నవంబరులో జరిగిన నీటి నాణ్యతా పరీక్షలో సంగమం వద్ద ఫీకల్ కొలిఫోమ్ స్థాయి ప్రతి 100 మిల్లీలీటర్లకు 3,300 ఎంపీఎన్ (మోస్ట్ ప్రోబబుల్ నంబర్)గా ఉన్నట్లు గుర్తుచేశారు. పర్యావరణం, అటవి, వాతావరణ మార్పు(ఎంఓఈఎఫ్‌సీసీ) శాఖ ప్రకారం 100 మిల్లీలీటర్లకు 2,500 ఎంపీఎన్‌కు మించి కొలిఫోమ్ ఉండరాదు. అయితే నది జలాలు కలుషితం అవుతుండటం వల్ల భక్తులకు కలరా, హెపటైటిస్ ఎ, పోలియో వంటి వ్యాధులు సోకే ప్రమాదం పెరిగింది. అలాగే సంగమం జలాల్లో బీఓడీ స్థాయి అధికంగానే ఉన్నట్లు ప్రభుత్వ డేటా చెబుతోంది.

‘ఈపీఎస్-95’ డిమాండ్లపై కేంద్రం సానుకూలం

న్యూఢిల్లీ: ఉద్యోగ భవిష్య నిధి చందాదారులకు ఈపీఎస్-95 కింద చెల్లించే పింఛన్ పెంచుతామని కేంద్రం తెలిపింది. కనీస పింఛన్ పెంపుదల సహా మరికొన్ని డిమాండ్లకు సానుకూలంగా స్పందించింది. ఈ మేరకు ఈపీఎస్-95 ఆందోళన కమిటీ జాతీయ అధ్యక్షుడు అశోక్ రౌత్ శనివారం తెలిపారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో తాము జరిపిన చర్చల్లో మంత్రి నుంచి సానుకూల స్పందన వచ్చిందన్నారు. త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని మాండవియా చెప్పారని రౌత్ వెల్లడించారు. ఇదే జరిగితే దేశంలో 78 లక్షల మందికి ప్రయోజనం కలగనుందన్నారు. ఈపీఎస్-95 కింద పెన్షన్‌ను రూ.7 వేలకు పెంచాలన్న డిమాండ్ దీర్ఘకాలంగా ఉంది. పెన్షనర్లు, వారి జీవిత భాగస్వామికి ఉచిత ఆరోగ్య బీమా కల్పించాలన్న డిమాండ్ కూడా ఉంది. అధిక పెన్షన్ కోసం దరఖాస్తుల్లో తప్పులు సవరించాలని కమిటీ కోరుతోంది. అయితే ఇటీవల ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో పెన్షన్‌పై ఎలాంటి ప్రకటనా రాకపోవడంతో కమిటీ నిరుత్సాహం వ్యక్తంచేసింది. ఇదే క్రమంలో కార్మిక, ఆర్థిక శాఖల ప్రతినిధులతో భేటీ అయింది. దీంతో తమ సమస్యలపై కేంద్రం నుంచి సానుకూల స్పందన లభించినట్లు ప్రకటించింది. కాగా, వడ్డీ రేట్లపై ఈపీఎఫ్ సెంట్రల్ బోర్డు ఆఫ్ ట్రస్టీల సమావేశం ఈనెల28న జరగనుంది.

తక్షణమే రాష్ట్ర హోదా పునరుద్ధరించాలి

- సీపీఐ డిమాండ్
- జమ్మూలో ధర్నా

జమ్మూ: జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదాను సత్వరమే పునరుద్ధరించాలని సీపీఐ డిమాండ్ చేసింది. రాష్ట్ర హోదా పునరుద్ధరణ కోసం డిమాండ్ చేస్తూ జమ్మూ ప్రెస్ క్లబ్ వద్ద సీపీఐ (జమ్మూ కశ్మీర్) అధ్వర్యంలో ధర్నా జరిగింది. పార్టీ కార్యకర్తలు. పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ప్లకార్డులు, బ్యానర్లు ప్రదర్శించారు. రాష్ట్ర హోదాకు మద్దతుగా, కేంద్ర ప్రభుత్వ తీరునకు నిరసనగా నినాదాలు ఇచ్చారు. ధర్నానుద్దేశించి సీపీఐ జమ్మూకశ్మీర్ కార్యదర్శి జీఎం మిర్రాజ్ మాట్లాడుతూ జమ్మూకశ్మీర్ ప్రజలకు ద్వంద్వ పరిపాలన వ్యవస్థ నచ్చదని, వారు దానిని ఆమోదించరని అన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వం కోసం ప్రజలు పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారని తెలిపారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కేంద్రం సజావుగా పనిచేసుకోనివ్వడం లేదని విమర్శించారు. 2019 నుంచి బ్యూరోక్రాట్ పాలనతో స్థానికులు తీవ్రంగా ఇబ్బంది పడినట్లు మిర్రాజ్ తెలిపారు.సీపీఐ జాతీయ సమితి సభ్యుడు రాకేశ్ శర్మ మాట్లాడుతూ రాష్ట్ర హోదా పునరుద్ధరణలో తాత్సారం కేంద్రానికి తగదన్నారు. జమ్మూకశ్మీర్ ప్రజల ఆకాంక్ష మేరకు రాష్ట్ర హోదాను సత్వరమే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జిల్లా కార్యదర్శి కుర్షీద్ అహ్మద్ భట్ మాట్లాడుతూ రాష్ట్ర హోదా జమ్మూకశ్మీర్ ప్రజలకు తక్షణావశ్యమని నొక్కిచెప్పారు. ధర్నాలో యువజన నేత ఇష్ఫాక్ అహ్మద్ షేక్, సీపీఐ సహాయ కార్యదర్శి గుల్జార్ అహ్మద్, సమితి సభ్యులు జీఎం భట్, బషీర్ అహ్మద్, మహమ్మద్ వక్బూల్, నరేశ్ మున్షి, సంజయ్ కోట్వాల్, సుఖ్‌దేవ్, సుభాశ్ మెహతా తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ‘ధర్మ గార్డియన్’

న్యూఢిల్లీ: భారత్, జపాన్ దేశాలు ఈనెల 24 నుంచి మార్చి 9 వరకు సంయుక్త సైనిక విన్యాసాలు ‘ధర్మ గార్డియన్’ జరగనున్నాయి. ప్రాదేశిక భద్రత, శాంతి, సుస్థిరతతో పాటు స్వేచ్ఛ, సమ్మిళిత ఇండో-పసిఫిక్ ఉమ్మడి విజన్‌కు రెండు దేశాలు కట్టుబడి ఉన్నట్లు రక్షణ శాఖ శనివారం ఒక ప్రకటన చేసింది. ఆరవ ఎడిషన్ ‘ధర్మ గార్డియన్’ కోసం భారత సైనికులు ఇప్పటికే జపాన్‌కు వెళ్లినట్లు పేర్కొంది. జపాన్‌లోని ఈస్ట్ ఫుజి మాన్యోవెర్ శిక్షణ స్థలంలో ఈ విన్యాసాలు జరుగుతాయని తెలిపింది. యుద్ధాలు, ఉగ్రవాదం నిరోధక అపరేషన్లలో సామర్థ్యం పెంచుకునేందుకు ఇవి దోహదమవుతాయని అధికారిక ప్రకటన వెల్లడించింది. ‘ధర్మ గార్డియన్’ ప్రతి సంవత్సరం జరుగుతుంది. భారత్-జపాన్ సంయుక్త సైనిక విన్యాసాలు చివరగా 2024 ఫిబ్రవరి- మార్చిలో రాజస్థాన్‌లో జరిగాయి.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.